www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
ప్రజల గొంతుక... దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 249 బుధవారం, జూన్ 03, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400



# ప్రజాకాంక్షలు నెరవేరుస్తాం

## ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహణ**

**అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించిన సీఎం**

- తెలంగాణ కోటి రత్నాలవీణ
- త్వరలోనే జాబ్ నోటిఫికేషన్లు విడుదల
- టీజీపీఎస్సీ ద్వారా విడుదల చేస్తాం
- జాబ్ నోటిఫికేషన్ల జారీ నిరంతర ప్రక్రియ
- న్యాయపరమైన సమస్యలు లేకుండా భర్తీ
- 67 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశాం
- నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తాం
- అద్దె ఇళ్ల బాధల నుంచి విముక్తి చేస్తాం
- సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం
- విజన్-2047 లక్ష్యం దిశగా ముందుకు..
- కాళోజీ స్ఫూర్తితో అధికారం చేపట్టాం
- నాటి నుంచి రాష్ట్ర హితంకై శ్రమిస్తున్నాం
- రాచరికం, పెత్తనాన్ని సమాజం సహించదు
- నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదు
- ప్రజాకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి





**హైదరాబాద్, జూన్ 2**
తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా నిరుద్యోగ యువతకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే పలు జాబ్ నోటిషికేషన్లను టీజీపీఎస్సీ విడుదల చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమానికి, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇక్కడ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో వైభవంగా నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం... రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ సహించదన్నారు. ప్రత్యేక తెలంగాణ కల సాకారం చేసిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీలకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ వేడుకలలో భాగంగా విధుల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురు పోలీసు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విశిష్టసేవా పురస్కారాలను ప్రదానం చేశారు. "పుట్టుక నీది, చావు నీది.. బతుకంతా దేశానిది" అన్న ప్రజాకవి కాళోజీ నారాయణరావు మాటలను సీఎం రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. కాళోజీ స్ఫూర్తితోనే తాము అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ప్రజల హితం కోసం నిరంతరం శ్రమిస్తున్నామని, తమది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రభుత్వం అన్నారు. గత 30 నెలల తమ పాలనలో ప్రజా సంకల్పాన్ని నిజం చేయడంలో విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని.. రాబోయే రోజుల్లో రాష్ట్ర రైతులను వ్యవసాయ **మిగతాది 2లో...**

# మూడో దేశం జోక్యం కుదరదు




**నేపాల్ ప్రధాని వ్యాఖ్యలపై భారత్ ఘాటు స్పందన**

- భారత్-నేపాల్ సరిహద్దు వివాదంలో మూడో దేశం జోక్యం కుదరదని స్పష్టం చేసిన భారత్
- ఇది పూర్తిగా ద్వైపాక్షిక అంశమని భారత విదేశాంగ శాఖ వెల్లడి
- భారత్, నేపాల్ పరస్పరం భూభాగాలు ఆక్రమించుకున్నాయన్న నేపాల్ ప్రధాని వ్యాఖ్యలు
- ద్వైపాక్షిక చర్చలకే కట్టుబడి ఉన్నామని భారత్ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,జూన్2:** భారత్, నేపాల్ మధ్య ఉన్న సరిహద్దు వివాదం పూర్తిగా ద్వైపాక్షిక అంశమని, ఇందులో మూడో దేశం ప్రమేయానికి ఆస్కారమే లేదని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యలను చర్చల ద్వారా, చారిత్రక ఆధారాల ప్రాతిపదికన పరిష్కరించుకోవాలని పేర్కొంది.నేపాల్ ప్రధాని బాలేంద్ర షా

# బీజేపీకి సింగం అన్నామలై గుడ్‌బై!

**తదుపరి కొత్త పార్టీ ఏర్పాటుపై దృష్టి**

**సొంత పార్టీతో ఉపఎన్నికల్లో పోటీ!!**



**కోయంబత్తూరు, జూన్ 2**
తమిళనాడు రాజకీయాల్లో సంచలన మార్పు చోటుచేసుకుంది. దేశవ్యాప్తంగా ఎంతో క్రేజ్ సంపాదించుకున్న ఐపీఎస్ మాజీ అధికారి, తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కే. అన్నామలై ఆ పార్టీకి రాజీనామా చేశారు. దిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్‌లను కలిసి తన 5 పేజీల రాజీనామా లేఖను సమర్పించారు. కొద్ది రోజులుగా అన్నామలై తదుపరి అడుగులపై సాగుతున్న ఉత్కంఠకు ఈ నిర్ణయంతో తెరపడింది. గత ఆరేళ్లుగా తమిళనాట బీజేపీకి 'స్టార్' ఇమేజ్ తెచ్చిన అన్నామలై, తాజాగా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను కలిసి రాజీనామా లేఖను అందజేశారు. ఐదు పేజీల సుదీర్ఘ లేఖలో ఆయన పార్టీ కేంద్ర నాయకత్వంతో తనకు ఉన్న వ్యూహాత్మక విభేదాలను స్పష్టంగా **మిగతాది 2లో...**

# బంగారం రీసైకిల్ చేద్దాం

**: ప్రధాని మోదీ పిలుపు**

**బంగారం దిగుమతులు తగ్గించి విదేశీ మారక నిల్వలను కాపాడటమే లక్ష్యం**

**ఒక శాతం బంగారం రీసైకిల్ చేసినా దిగుమతులు 30% తగ్గుతాయని నిపుణుల అంచనా**




2లో.

# అకాల వర్షాలతో రైతులు కన్నీరు

**తడిసి ముద్దవుతున్న వరి ధాన్యం**

**ధాన్యం కుప్పల చుట్టూ వర్షపు నీరు**

**హైదరాబాద్, జూన్ 2**
ఆరుగాలం కష్టపడి పండించిన పసిడిపంట చేతికొచ్చే సమయానికి అన్నదాతను ప్రకృతి పగబట్టి ఆడుకుంటోంది. ఉదయం పూట భగభగ మండుతున్న ఎండలు కమ్మేస్తుంటే.. రాత్రి కాగానే విరుచుకుపడుతున్న కారుమబ్బులు, భయపెడుతున్న ఈదురుగాలులు, అకాల వర్షాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాతావరణం పూర్తిగా అతలాకుతలమైంది. పగలు దంచికొడుతున్న ఎండల తీరు ఒకలా ఉంటే రాత్రివేళ ముంచుకొస్తున్న అకాల వర్షాలు రైతన్నల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.**మిగతాది 2లో...**



# ఇంకెంత కాలం ఆంధ్రావాళ్లను తిడతారు

- జనసేన పుట్టిందే తెలంగాణలో
- అందుకే ఇక్కడి ఎన్నికల్లో పోటీ చేస్తుంది
- తెలంగాణ గడ్డపై నుంచే పోరాటం పుణికి పుచ్చుకున్నా
- తెలంగాణ అంటే గౌరవంతోనే కొండగట్టుకు కోట్ల విరాళం
- తెలంగాణను వ్యతిరేకించిన వారే ఎమ్మెల్యేలుగా ఉన్నారు
- తెలంగాణకు ద్రోహం జరిగితే గొంతు లేపేది జనసేనే
- తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతం
- ఎవరి తాటాకు చప్పళ్లకు భయపడేది లేదు
- మీడియా సమావేశంలో పవన్ కళ్యాణ్ స్పష్టీకరణ



**హైదరాబాద్, జూన్ 2**
: తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని ఆ పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. తెలంగాణలో పోటీ చేస్తామని ఆయన కుండ బద్దలు కొట్టారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. దేశంలో అంతర్భాగం తెలంగాణ అని స్పష్టం చేశారు. **మిగతాది 2లో...**




2లో.

# భారత్‌లో ఎబోలా కేసులు లేవు.. కానీ!

**: కేంద్రం కీలక అడ్వైజరీ**

- అంతర్జాతీయ ప్రయాణికుల కోసం కేంద్ర ఆరోగ్య శాఖ మార్గదర్శకాలు
- ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించడంతో అప్రమత్తత
- ఈ వైరస్‌కు టీకాలు లేకపోవడంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన

# సంక్షేమం నుంచి సంక్షోభంలోకి తెలంగాణ

**పుష్కర తెలంగాణ కాస్తా ముష్కర తెలంగాణ**

**తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ నేత కెటిఆర్**



**హైదరాబాద్, జూన్ 2** తెలంగాణ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు తెలంగాణ కళాకారులకు కేటీఆర్ **మిగతాది 2లో...**

# ప్రజాకాంక్షలు నెరవేరుస్తాం



(మొదటి పేజీ తరువాయి)
పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని ఈ వేదికగా హామీ ఇచ్చారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఇప్పటివరకు 67 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త అందించారు. ఈ నెలలోనే టీజీపీఎస్సీ ద్వారా ఇంజినీరింగ్, పీసీబీ, అటవీశాఖ, టౌన్‌ప్లానింగ్, విద్యాశాఖల్లో ఖాళీలకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ప్రకటించారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, విద్యా రంగంలో భాగంగా ఇప్పటికే 1,362 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ క్లాసులు ప్రారంభించామన్నారు. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని, త్వరలోనే జూనియర్ కాలేజీల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అద్దె ఇళ్ల బాధలు, కష్టాల నుండి పేదలకు విముక్తి కలిగించేందుకు గత 13 నెలల కాలంలో 1.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించగా, ఇందుకోసం రూ.22 వేల కోట్లు ఖర్చు చేశామని ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 3.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఈసారి క్యూఆర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని చెప్పారు. కొత్త రేషన్‌కార్డులను కూడా పంపిణీ చేసి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ఈ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం వెల్లడించారు. ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం సహించదన్న రేవంత్, ప్రభుత్వం అంటే నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదని స్పష్టం చేశారు. తమది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వమన్న సీఎం, గత 30 నెలల్లో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విజయవంతం అయ్యామన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యం సాధించే దిశగా వెళు_న్నామని స్పష్టం చేశారు. రైతులను వ్యవసాయ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం తెలిపారు. జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టులు పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి మళ్లీ కృషి చేస్తున్నామని చెప్పారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిందని సీఎం ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఒకేసారి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తి చేశామని సీఎం తెలిపారు. తొలి ఏడాదిలోనే రైతుల ఖాతాల్లో రూ.22 వేల కోట్లు జమ చేసినట్లు చెప్పారు. రైతుల పంటలు చివరి గింజ వరకు కొనేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు రూ.11,300 కోట్లు జమ చేశామని తెలిపారు. మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నట్లు రేవంత్? రెడ్డి తెలిపారు. మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు ఇచ్చామని చెప్పారు. తెలంగాణ మహిళ దేశ పారిశ్రామికరంగంలో కీలకంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు రూ.10 వేల కోట్లు ఆదా చేసుకున్నారన్న ముఖ్యమంత్రి, 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. రెండున్నరేళ్లలో ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయం సాధించాం. రాష్ట్రంలో రైతుల్ని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నాం. గత ప్రభుత్వం లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయింది. మరమ్మతులు చేయించే భారం ప్రభుత్వంపై పడింది. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను విజయవంతంగా చేపట్టాం. రికార్డు సమయంలో 67,763 పోస్టులను భర్తీ చేశాం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా విద్యా వ్యవస్థ మరి బలోపేతం కానుంది. పేదలను అద్దె బాధలనుంచి విముక్తి చేయాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు.

కాగా.. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ముందుగా అసెంబ్లీ సమీపంలోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాల్లో సంబంధిత మంత్రులు జాతీయ జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాత్రి వేళల్లో హైదరాబాద్‌లోని సచివాలయం, అసెంబ్లీ భవనాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తొలి విడతలో 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, రూ.22 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. హనుమకొండలో అమరవీరుల స్థూపానికి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వద్ద నివాళి అర్పించి జెండాను ఆవిష్కరించారు. నల్గొండ క్లాక్ టవర్ కూడలి వద్ద అమరవీరుల స్థూపానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నివాళి అర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి పుష్పాలతో నివాళి అర్పించారు. అనంతరం పోలీసు పరేడ్ మైదానంలో జాతీయపతాకావిష్కరణ చేశారు. నల్గొండలోని కలెక్టరేట్?లో ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. అమరవీరుల త్యాగ ఫలితమే మన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమని తెలిపారు. తెలంగాణ చరిత్ర గురించి మాట్లాడాలంటే నల్గొండ ప్రస్తావన లేకుండా ఒక్క పేజీ కూడా ముందుకు సాగదన్నారు. నల్గొండ కేవలం జిల్లా కాదని విప్లవాల పురిటి గడ్డ, అన్యాయంపై తిరగబడ్డ వీరుల అడ్డా అని వెంకట్?రెడ్డి చెప్పారు. నా భూమి జోలికొస్తే ఆ భూమిలోనే నీ గోరీ కడతాం అని దొరల గుండెల్లో వణుకు పుట్టించిందన్నారు. నల్గొండ గడ్డ మన పిల్లలు లాఠీ దెబ్బలు తింటే, శ్రీకాంతాచారి తన ప్రాణాన్ని త్యాగం చేస్తుంటే చూస్తూ ఊరుకోలేదని అన్నారు. తానెప్పుడూ పదవుల కోసం ఆశపడలేదని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్ష నెరవేరకపోతే ఈ పదవులు ఎందుకని నాడు మంత్రి పదవిని విసిరికొట్టి ఉద్యమంలోకి దిగిన చరిత్ర తనదన్నారు.

## బీజేపీకి సింగం అన్నామలై గుడ్‌బై!

(మొదటి పేజీ తరువాయి)
ప్రస్తావించినట్లు తమిళ మీడియా వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేకించి ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో ఏఐఏడీఎంకే తో పొత్తు పెట్టుకోవాలన్న ఢిల్లీ పెద్దల నిర్ణయంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బీజేపీ స్వతంత్రంగా ఎదగాలని తాను కోరుకుంటే, అధిష్ఠానం మాత్రం ద్రావిడ పార్టీలపై ఆధారపడటాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, సీట్ల కేటాయింపులో అన్నామలై అభిప్రాయాలను కేంద్ర నాయకత్వం పక్కన పెట్టింది. తనకు కేవలం ఆరు స్థానాల బాధ్యతలు మాత్రమే అప్పగించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి చెందారు. ఫలితంగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ కేవలం ఒక్క స్థానానికే పరిమితం కావడం, పార్టీ ఘోర పరాజయం పాలుకావడంతో అన్నామలై వాదన నిజమైంది. బీజేపీలో తనకు తగినంత స్వేచ్ఛ, భవిష్యత్తు లేవని భావించిన ఆయన, సుదీర్ఘ చర్చల అనంతరం కమలం గూటి నుంచి బయటకు రావడమే ఉత్తమమని భావించారు. అన్నామలై రాజకీయాల నుంచి తప్పుకోవడం లేదు, పైగా మరింత దూకుడు పెంచబోతున్నారు. రాబోయే ఉపఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా లేదా సరికొత్త వేదిక ద్వారా పోటీ చేసేందుకు ఆయన సన్నాహాలు చేసుకుంటున్నారు. రాబోయే 6 నుంచి 8 నెలల కాలంలో ఒక కొత్త ప్రాంతీయ పార్టీని స్థాపించే యోచనలో ఆయన ఉన్నారు. తమిళ అస్థిత్వం – జాతీయ దృక్పథం అనే సరికొత్త స్లోగన్‌తో, ఒక సెక్యులర్ ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేయడమే ఆయన తదుపరి కార్యాచరణగా తెలుస్తోంది. ప్రముఖ నటుడు విజయ్ రాజకీయ అరంగేట్రం చేసి ఘనవిజయం సాధించడంతో తమిళనాడు రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ద్రావిడ పార్టీలైన డీఎంకే, ఏఐఏడీఎంకే , బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ఒక కొత్త శక్తి వైపు యువత మొగ్గు చూపుతోందని అన్నామలై గమనించారు. బీజేపీ సిద్ధాంతాల ముద్ర వల్ల తమిళనాడులో ఎదగడం కష్టమని గ్రహించిన ఆయన, విజయ్ తరహాలోనే ద్రావిడ సంస్కృతి, అవినీతి రహిత పాలన అజెండాతో యువతను ఆకట్టుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే పలువురు యువ నిపుణులు, అసంతృప్త నేతలు ఆయనతో టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. తమిళనాడు బీజేపీకి అన్నామలై రాజీనామా చేయడం ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బే. ఐపీఎస్ ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చిన ఈ యువనేత, ఇప్పుడు బీజేపీ చట్రం నుంచి బయటకు వచ్చి ఒంటరి పోరాటానికి సిద్ధమయ్యారు. కోయంబత్తూరుతో సహా తమిళనాడు అంతటా ఆయన మద్దతుదారులు ఇప్పటికే అన్నామలై 2.0 పోస్టర్లతో హల్‌చల్ చేస్తున్నారు. మరి ఈ సింగం సొంతంగా పార్టీ పెట్టి ద్రావిడ కోటలను బద్దలు కొడుతుందో లేదో చూడాలి.

## భారత్‌లో ఎబోలా కేసులు లేవు.. కానీ! : కేంద్రం కీలక అడ్వైజరీ

గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చిన వారు లేదా ఆ దేశాల మీదుగా ప్రయాణించిన వారు తమ ఆరోగ్యాన్ని స్వయంగా పర్యవేక్షించుకోవాలని సూచించింది. ఎబోలా ప్రభావిత దేశాల్లో ప్రయాణించినవారు స్వీయ నిర్బంధంలోకి వెళ్ళాలని సూచించింది. జ్వరం, తీవ్రమైన బలహీనత, కండరాల నొప్పి, తలనొప్పి, గొంతునొప్పి, వాంతులు, విరేచనాలు, దద్దుర్లు లేదా కారణం లేకుండా రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరింది. ముందస్తు సమాచారంతో మీ ప్రాణాలను కాపాడుకోవడంతోపాటు వ్యాధి వ్యాప్తిని కూడా నిరోధించవచ్చని తెలిపింది. అధికారుల సాయం కోసం హెల్ప్ లైన్ నెంబర్ 1075కు కాల్ చేయాలని సూచించింది. డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్‌సీ), ఉగాండా, దక్షిణ సూడాన్‌లలో కొత్త రకం ఎబోలా వైరస్ వ్యాప్తి చెందుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) మే 17న దీనిని ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించింది. ఈ ప్రత్యేక వైరస్‌కు ప్రస్తుతం ఆమోదిత టీకాలు లేదా నిర్దిష్ట చికిత్సలు అందుబాటులో లేకపోవడం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన పెంచుతోంది.

## సంక్షేమం నుంచి సంక్షోభంలోకి తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)
సన్మానం చేశారు. అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు అభివృద్ధి, సంక్షేమానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభంలోకి నెట్టబడిందని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నో పాటలు రాశారని కేటీఆర్ గుర్తు చేశారు. ఉద్యమ ప్రస్థానంలో కేసీఆర్ అనేక పాత్రలు పోషించారని, తెలంగాణ సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో ముందుకు సాగి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. కేసీఆర్ జీవిత గాథపై సినిమా తీయాలని ఒక దర్శకుడు తనను కలిసిన సందర్భాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఆలోచిద్దామని కేసీఆర్ చెప్పారని, తెలంగాణ ఆవిర్భావం అనేది అన్ని ప్రతికూల పరిస్థితులను ఛేదించి సాధించిన చారిత్రక విజయమని ఆ దర్శకుడు అభిప్రాయపడ్డారని తెలిపారు. కేసీఆర్ అనే మూడు అక్షరాల ముందు 'ముఖ్యమంత్రి' అనే పదవి చాలా చిన్నదిగా కనిపిస్తుందని ఆయన వ్యాఖ్యానించినట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసిన కేటీఆర్.. 'పుష్కర తెలంగాణ ఇప్పుడు ముష్కరుల తెలంగాణగా మారిపోయింది. నిష్ఫల తెలంగాణగా మారిపోయింది' అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం పదవిని మాత్రమే కాదు.. అవసరమైతే ప్రాణత్యాగానికీ సిద్ధపడ్డ నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యతో బాధపడిన ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించి వేలాది కుటుంబాల కష్టాలను తీర్చిన నాయకుడు కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొందరు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ పరిస్థితులపై స్పందిస్తూ.. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే విజయం సాధించిందని, 2023 ఎన్నికల్లో కూడా ఒంటరిగానే పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందని ఆరోపిస్తూ, ప్రస్తుతం రాష్ట్రాన్ని వెనక్కి నెట్టే విధంగా పాలన సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తూ.. గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక, పరిపాలనా వ్యవస్థలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. 'వడ్డించిన విస్తరి లాంటి తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిగా మార్చుతున్నారు' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సంక్షేమం, అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభంలో కూరుకుపోయిందని కేటీఆర్ అన్నారు.

## బంగారం రీసైకిల్ చేద్దాం : ప్రధాని మోదీ పిలుపు

(మొదటి పేజీ తరువాయి)
ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో దేశ విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని తగ్గించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు ఒక కీలక పిలుపునిచ్చారు. కొత్తగా బంగారం దిగుమతి చేసుకునే బదులుగా ఇళ్లలో, దేవాలయాల్లో నిరుపయోగంగా ఉన్న బంగారాన్ని రీసైక్లింగ్ చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన సూచించారు.

ఈ విధానం ద్వారా బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ప్రధాని అభిప్రాయపడ్డారు. భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగారం వినియోగదారుగా ఉన్నప్పటికీ, దేశీయంగా ఉత్పత్తి చాలా స్వల్పం. ఈ కారణంగా ఏటా బిలియన్ల కొద్దీ డాలర్లను వెచ్చించి బంగారాన్ని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో మన దేశం సుమారు 72.4 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకుంది. ఇది ముడి చమురు తర్వాత దేశ దిగుమతి బిల్లులో అతిపెద్దది. బంగారం దిగుమతులకు చెల్లింపులు యూఎస్ డాలర్లలో చేయాల్సి రావడం వల్ల, రూపాయి విలువపై ఒత్తిడి పెరిగి, కరెంట్ అకౌంట్ లోటు విస్తరిస్తోంది. ఈ సమస్యకు పరిష్కారంగానే ప్రధాని రీసైక్లింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. అంచనాల ప్రకారం ప్రస్తుతం దేశంలోని గృహాలు, దేవాలయాల్లో దాదాపు 30,000 నుంచి 32,000 టన్నుల బంగారం నిరుపయోగంగా ఉంది. ఈ పాత ఆభరణాలు, నాణేలు, మరియు ఇతర బంగారు వస్తువులను కరిగించి, శుద్ధి చేసి, 99.9% స్వచ్ఛమైన బంగారంగా మార్చవచ్చు. ఈ బంగారాన్ని తిరిగి కొత్త ఉత్పత్తుల తయారీకి ఉపయోగించడం వల్ల దిగుమతుల అవసరం తగ్గుతుంది. రీసైక్లింగ్ విధానం ఆర్థిక వ్యవస్థకు ఎంతో ఉపయోగకరం

పరిశ్రమ నిపుణులు సైతం ప్రధాని ప్రతిపాదనను సమర్థిస్తున్నారు. ముత్తూట్ ఎగ్జిమ్ సీఈఓ కీయూర్ షా అంచనా ప్రకారం దేశంలో ఉన్న మొత్తం బంగారంలో కేవలం 1% ఏటా రీసైక్లింగ్‌కు వచ్చినా, మన దిగుమతులు 25 నుంచి 30 శాతం వరకు తగ్గుతాయి. స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ పరిశోధన హెడ్ సంతోష్ మీనా మాట్లాడుతూ, వ్యవస్థీకృత రీసైక్లింగ్ విధానం విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని తగ్గించడమే కాకుండా వాణిజ్య లోటును నియంత్రించి, దేశాన్ని ఆత్మనిర్భర్ దిశగా నడిపిస్తుందని వివరించారు. ప్రధాని పిలుపును జ్యువెలరీ సంఘాలు స్వాగతించాయి. పాత బంగారాన్ని మార్చుకునే వారికి తక్కువ తరుగుతో కొత్త డిజైన్లు అందించే కార్యక్రమాలను ఇప్పటికే ప్రారంభించాయి. మరోవైపు బంగారం ధరలు రికార్డు స్థాయిలో ఉండటంతో వివాహాలు, ఉన్నత విద్య వంటి అవసరాల కోసం పాత నగలను మార్చుకోవడం వినియోగదారులకు కూడా లాభదాయకంగా మారింది. మొత్తంమీద దిగుమతి చేసుకునే వినియోగదారుగా కాకుండా, దేశంలో ఉన్న వనరులనే సమర్థంగా వాడుకునే ఆర్థిక వ్యవస్థగా మారాలనేది ఈ పిలుపు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.

## అకాల వర్షాలతో రైతులు కన్నీరు

(మొదటి పేజీ తరువాయి)
ప్రకృతి కన్నెర్ర చేయడంతో స్వేదం చిందించి పండించిన ధాన్యం రాశులు కళ్ల ముందే తడిసిపోతుంటే ఆ దృశ్యాలు చూసి కర్షకులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విభిన్న వాతావరణ పరిస్థితులు జిల్లావ్యాప్తంగా రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.

కల్లాల్లో, వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ధాన్యం విక్రయించడానికి వచ్చిన కర్షకులు చెప్పనలవికాని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో పగలు రాత్రి కష్టపడి సాధించిన దిగుబడులను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. రోజుల తరబడి మార్కెట్ యార్డుల్లోనే పడిగాపులు కాస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. కల్లాల వద్ద, రోడ్ల పక్కన కుప్పలు పోసిన ధాన్యం వర్షానికి తడవకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పుతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు. రోడ్లపైనే వరి కుప్పలు భారీగా పేరుకుపోవడంతో అటు వాహనదారులకు సైతం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. గత రెండు మూడు రోజులుగా విరామం లేకుండా కురుస్తున్న అకాల వర్షాలకు జిల్లాలోని సాత్నాల, బేలా, జైనథ్, భోరజ్ మండలాల్లో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మార్కెట్ కేంద్రాల వద్ద ఆరుబయట నిల్వ ఉంచిన ధాన్యం కుప్పల చుట్టూ వర్షపు నీరు వాగుల్లా ప్రవహించడంతో వడ్లు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. ముఖ్యంగా తాంసి మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ ఆరబోసిన జొన్న పంటతో, నిస్సహాయ స్థితిలో ఉన్న రైతులతో కిటకిటలాడుతోంది. కంటికి రెప్పలా కాపాడుకున్న జొన్న కుప్పలు అడపాదడపా కురుస్తున్న వానలకు తడిసిపోతుండటంతో వాటిని పదేపదే ఎండబెట్టుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తూ అలిసిపోతున్నారు. కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగడానికి ప్రధానంగా గన్నీ బ్యాగులు, లారీలు, హమాలీల కొరత కారణమని స్పష్టమవుతోంది. నిండిన బస్తాలను తరలించేందుకు లారీలు సకాలంలో రాకపోవడం, తూకాలు వేసేందుకు తగినంత మంది కూలీలు దొరకకపోవడంతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం పదిహేను ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు.. ఇప్పటి వరకు సుమారు రెండు లక్షల క్వింటాళ్ల వరిని మాత్రమే కొనుగోలు చేయగలిగారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఏమాత్రం పరిష్కారం కాకపోవడంతో వారం రోజులు గడిచినా రైతుల నిరీక్షణ యథాతథంగా కొనసాగుతూనే ఉంది. బస్తాల కొరత అన్నదాతల పాలిట పెను శాపంగా మారింది. క్షణం క్షణం మారుతున్న వాతావరణ పరిస్థితులు, అధికారుల నిర్లక్ష్యం వెరసి రైతుల సహనాన్ని తీవ్రంగా పరీక్షిస్తున్నాయి. పగలు ఎండకు ఎండుతూ, రాత్రి వానకు తడుస్తూ దిక్కుతోచని స్థితిలో ఉన్న కర్షకులు చివరికి తమ ఆగ్రహాన్ని ప్రదర్శిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని డిమాండ్ చేస్తూ పలుచోట్ల రోడ్డెక్కి ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు. వాన ఎప్పుడు ముంచుకొస్తుందో, గాలి దుమారం ఎప్పుడు కమ్ముకొస్తుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో అధికారులు తక్షణమే స్పందించాలని వారు వేడుకుంటున్నారు. లారీలు, గోనెసంచులు తగినన్ని అందుబాటులో ఉంచి, నిబంధనలు సడలించి తడిసిన పంటను సైతం వెంటనే కొనుగోలు చేసి తమను తక్షణమే ఆదుకోవాలని రైతన్నలు ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## ఇంకెంత కాలం ఆంధ్రావాళ్లను తిడతారు

(మొదటి పేజీ తరువాయి)
తెలంగాణను వ్యతిరేకించిన వారే.. పదవుల్లో ఉన్నారని.. ఎమ్మెల్యేలు అయ్యారని పవన్ కల్యాణ్ వివరించారు. తెలంగాణ అంటే గౌరవం ఉంది కనుకే కొండగట్టు ఆలయానికి కోట్ల రూపాయిలు విరాళంగా ఇచ్చామన్నారు. మీ తాటాకు చప్పుళ్లకు జనసేన పార్టీ భయపడదన్నారు. భయపడేవాడినే అయితే పార్టీ పెడతానా? అని ప్రశ్నించారు. తెలంగాణకు ద్రోహం జరిగితే మొట్టమొదట గొంతులేపేది జనసేన పార్టీనే అని స్పష్టం చేశారు. ఏం చేసినా ఓట్ల కోసం కాదు.. తనకు తెలంగాణపై ప్రేమ, మమకారం ఉన్నాయన్నారు. గుంటూరులో టీఆర్ఎస్ కార్యాలయం పెడితే స్వాగతించామని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. ఇక్కడ ఏమైనా చేస్తే తాను సీఎం అయిపోతానా? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. తెలంగాణను తానెప్పుడు అవమానించానని ఆయన స్థానిక నేతలను ప్రశ్నించారు. తన పీక కోసినా కూడా భయపడేది లేదన్నారు. తనకు రెచ్చగొట్టడం ఇష్టం లేదని తెలిపారు. తనను ఎన్ని తిట్టినా పట్టించుకోనన్నారు. తెలంగాణలో ఉపాధి లేకపోతే తాను కారణమా? అని రాజకీయ పార్టీల నాయకులను ఆయన సూటిగా నిలదీశారు. మద్రాస్‌లో ఉన్న చిత్రపరిశ్రమ ఇక్కడికి ఎలా వచ్చిందన్నారు. ఆంధ్రా వాళ్లను తిడుతుంటే వాళ్లు ఇక్కడెలా ఉంటారన్నారు. ఇంకెంతకాలం ఆంధ్రావాళ్లను తిడుతూ కాలక్షేపం చేస్తారంటూ తెలంగాణలోని నాయకులకు ఆయన సూటిగా ప్రశ్నించారు. సడెన్‌గా ఇక్కడికి రావొద్దంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో ఏపీ కాంట్రాక్టర్లు బాగానే ఉన్నారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తనకు గౌరవం ఉందన్నారు. తాను చెరువును కబ్జా చేశానని కొందరు అంటున్నారని.. అలా చేస్తే తనను ఇక్కడ ఉండనిస్తారా? అని ఆయన సూటిగా నిలదీశారు. తన ఫామ్‌హౌస్ కబ్జా అని తేలిస్తే.. దానిని రాష్ట్ర ప్రభుత్వానికే రాసిస్తానన్నారు. గద్దర్‌తో తనకు చాలా సాన్నిహిత్యం ఉందని గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందే తనకు గద్దర్ తెలుసునన్నారు. గద్దర్ ఒంట్లో బుల్లెట్లు దిగినప్పుడు ఎందుకు మాట్లాడలేదని రాజకీయ పార్టీల నేతలను పవన్ కల్యాణ్ సూటిగా ప్రశ్నించారు. గద్దర్ తమ పార్టీ కార్యాలయానికి వచ్చేవారని గుర్తు చేశారు. గద్దర్ బతికున్నప్పుడు మీరంతా ఎక్కడున్నారు? అంటూ తనను ప్రశ్నిస్తున్న నేతలకు పవన్ కల్యాణ్ చురకలంటించారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఉత్తేజం పొందామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతమైనదన్నారు. తెలంగాణపై తనకు కొత్తగా వచ్చిన ప్రేమ కాదని పేర్కొన్నారు. 13వ ఏట అడుగుపెడుతున్న తెలంగాణకు శుభాకాంక్షలు తెలిపారు. లక్ష మందికిపైగా జనసేన నాయకులు, సైనికులు ఉన్న.. తెలంగాణలో కేడర్ తరఫున ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణలో జనసేన పార్టీ పుట్టిందని గుర్తు చేశారు. ఇక్కడి నాయకులంతా 2007-08 నుంచి.. అప్పటి యువరాజ్యంలో సభ్యులని వివరించారు. తెలంగాణ నలుమూలలా పెరిగిన వాడిని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తెలంగాణ బాగుండాలనే ఎప్పుడూ కోరుకున్నానని తెలిపారు. తన సినిమాల్లో తెలంగాణ స్ఫూర్తి కనిపిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ తాండాల్లో గడిపిన వాడిని.. ఆ తాండాల్లో దాహార్తి తీర్చిన వాడినని ఏపీ డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ విభజన తీరుకు తాము వ్యతిరేకమన్నారు. పార్లమెంట్ తలుపులు మూసి రాష్ట్ర విభజించిన తీరును ప్రశ్నించామని చెప్పారు. తనకు వారాహి యాత్రకు అనుమతి ఇచ్చింది తెలంగాణ అని వ్యాఖ్యానించారు.

# తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో సీపీఐ పోరాటాలే పునాది

- రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వానికి కీలక విజ్ఞప్తులు
- రాష్ట్ర సాధనలో సీపీఐ పోరాటాలు చిరస్మరణీయం.. మండల కార్యదర్శి జి. కృష్ణ




**బాలానగర్ జూన్ 03 ( పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కూకట్ పల్లి మండలం బాలానగర్ శ్రీశ్రీ నగర్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం జాతీయ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి కామ్రేడ్ దావీదు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ కూకట్ పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సీపీఐ పార్టీ అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిందని, ఎందరో అమరవీరుల త్యాగాలు, ప్రజల ఆకాంక్షల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, తెలంగాణ ఉద్యమ ఆశయాల సాధన దిశగా ప్రభుత్వం కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రత్యేకంగా "నిధులు -- నియామకాలు" అనే తెలంగాణ ఉద్యమ ప్రధాన లక్ష్యాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని పేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందజేయడంతో పాటు, నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా స్పష్టమైన కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికీ చేరేలా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తరించాలని నాయకులు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను ఈ సందర్భంగా స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాస్, గంగన్న, పాండు, రాములు, మహిళా నాయకులుఉమాదేవి,నాగమణి పాల్గొన్నారు.

# బాలానగర్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణపై రాజకీయ చర్చ

**-- కాంగ్రెస్ పార్టీ బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్నకుమార్**



**బాలానగర్ జూన్ 03 ( పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బాలానగర్ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పార్టీ జెండా ప్రదర్శన అంశంపై కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జూన్ 2 తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే రోజు అని, ఈ దినోత్సవం ఏ ఒక్క రాజకీయ పార్టీకి పరిమితం కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావం కోసం ఉద్యమంలో పాల్గొన్న ప్రజలు, విద్యార్థులు, అమరవీరుల త్యాగాలను స్మరించుకునే సందర్భంగా రాష్ట్ర భావనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర పండుగల సందర్భంగా జాతీయ పతాకానికి, తెలంగాణ ఆవిర్భావ స్ఫూర్తికి ప్రాధాన్యత ఇవ్వడం అవసరమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ అందరి సొత్తు అనే భావనను ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మరోవైపు, బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ రాష్ట్ర సాధనలో తమ పార్టీ కీలక పాత్ర పోషించిందని, ఆ చరిత్రను గుర్తు చేసుకుంటూ పార్టీ కార్యకర్తలతో కలిసి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించడం సహజమేనని అభిప్రా యపడుతున్నారు. తెలంగాణ ఉద్యమంలో బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్) పాత్రను ప్రజలకు గుర్తు చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలా, లేక తెలంగాణ ఉద్యమంలో పాత్ర వహించిన రాజకీయ శక్తులు తమ గుర్తింపుతో నిర్వహించుకోవచ్చా అనే అంశంపై స్థానికంగా చర్చ కొనసాగుతోంది. ఈనేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కారణమైన ఉద్యమకారులు, అమరవీరుల త్యాగాలను గౌరవిస్తూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కలిసి పనిచేయాలని పలువురు స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# తెలంగాణ వ్యవహారాల్లో ఆంధ్ర పాలకుల జోక్యాన్ని సహించబోము

**- తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు, జెఎన్టీయూహెచ్ ఐకస రాష్ట్ర చైర్మన్ ఎరవెల్లి జగన్.**



**కూకట్ పల్లి, జూన్ 2 (పీపుల్స్ న్యూస్) :**
తెలంగాణ వ్యవహారాల్లో ఆంధ్ర పాలకుల జోక్యాన్ని సహించబోమని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు, జెఎన్టీయూహెచ్ ఐకస రాష్ట్ర చైర్మన్ ఎరవెల్లి జగన్ అన్నారు. మంగళవారం తెలంగాణ అవతరణ దినోత్సవం వేడుకల సందర్భంగా జెఎన్టీయూహెచ్ యూనివర్సిటీ హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జె.ఎన్టీ.యూ.హెచ్ ఐకస రాష్ట్ర చైర్మన్, తెలంగాణ రాష్ట్ర ఉద్యకారుడు ఎరవెల్లి జగన్ పాల్గొని మాట్లాడుతూ వేలాది అమరుల త్యాగఫలం, లక్షలాది ఉద్యమకారుల పోరాటం, కోట్లాది ప్రజల ఆకాంక్షల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని అన్నారు. నేటికీ ఆంధ్ర పాలక వర్గాలకు తెలంగాణ వనరులపై కన్ను ఉందని, తెలంగాణపై ఆధిపత్యం కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ విషయంలో భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తూ, ఆ సాకుతో తెలంగాణ వ్యవహారాల్లో జోక్యం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ఆంధ్ర పాలక వర్గాలకు మద్దతుగా నిలుస్తూ తెలంగాణ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఆంధ్ర పాలక వర్గాల సహకారంతో తెలంగాణపై పెత్తనం చెలాయించాలని బీజేపీ చూస్తోందని అన్నారు. పదేపదే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కించపరిచే విధంగా కేంద్రంలోని బీజేపీ నాయకులు వ్యాఖ్యలు చేయడం తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అవమానించడమేనని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం వెలుగులో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.తెలంగాణపై బీజేపీ మరియు ఆంధ్ర పాలక వర్గాలు చేస్తున్న ఇటువంటి కుట్రలను తెలంగాణ సమాజం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యవహారాల్లో ఆంధ్ర పాలకుల అనవసర జోక్యాన్ని సహించబోమని హెచ్చరించారు. ఉద్యమకారులకు భరోసా కల్పించేలా అవకాశాలు కల్పిస్తూ, విద్యార్థి ఉద్యకారులను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో కీలకం చెయ్యాలని రాష్ట్ర ప్రభుత్వంని కోరారు. తెలంగాణ ఉద్యమ ఆశయాల సాధన, సమగ్ర తెలంగాణ నిర్మాణం కోసం విద్యార్థులు, యువకులు ప్రజలందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిస్తూ రాష్ట్ర ప్రజలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎఫ్ ప్రెసిడెంట్ రాహుల్ నాయక్, జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం ప్రెసిడెంట్ సురేష్ నాయక్, ఓబీసీఎఫ్ ప్రెసిడెంట్ సందీప్, సాగర్ నాయక్, డిఎస్ఎఫ్ ప్రెసిడెంట్ వివేక్ పటేల్, సాయి రాజ్, సుజయ్ పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

**- అడ్డగుట్ట మాజీ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్**



**అడ్డగుట్ట, జూన్ 2 (పీపుల్స్ న్యూస్ ):** ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అడ్డగుట్ట మాజీ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్ అన్నారు. సికింద్రాబాద్ శాసనసభ్యులు తెగుళ్ల పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు అడ్డగుట్ట మాజీ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్ కార్యాలయం వద్ద మంగళవారం ఎస్ ఐ ఆర్ పై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. అదేవిధంగా జూన్ 3వ తేదీ (బుధవారం) సీతాఫల్మండి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ లో జరిగే సికింద్రాబాద్ బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంపై చర్చించారు. ఈ సందర్భంగా అడ్డగుట్ట మాజీ కార్పొరేటర్ లింగాన్ని ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ పేరుతో ఓట్లను తొలగించే ప్రక్రియ నడుస్తుందని, కావున ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు అందరూ అండగా నిలబడి ఓట్లను తొలగించకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని ఆమె సూచించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే తెగుళ్ల పద్మారావు గౌడ్ ఆధ్వర్యంలో జరిగే బిఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి అడ్డగుట్ట డివిజన్ నుండి పార్టీ శ్రేణులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పరిశీలకులు రాజు సుందర్, రాజేందర్, నాయకులు లింగాని శ్రీనివాస్, నక్కమధు, సత్తయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఎల్లయ్య, దేవయ్య, పొన్నాల రాజు, అమర్, మహమ్మద్, శ్రీరాములు, దాసరి శ్రీనివాస్, బాల రాజ్, విజయ,విమల, రమా, భాగ్య, చిన్న, రజిని, పాల్గొన్నారు.

# అమరవీరుల ఆశయాల సాధన కోసం నిరంతరం శ్రమించాలి

**- నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్**










**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూన్ 2 (పీపుల్స్ న్యూస్) :**
అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, వారు కలలుగన్న ఆశయాల సాధన కోసం నిరంతరం శ్రమించాలని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ పేట్ల బురుజులోని సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ (సీఏఆర్) హెడ్ క్వార్టర్స్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ హాజరై.. జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరులకు నివాళులర్పించారు. అనంతరం పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సుదీర్ఘమైన, చారిత్రాత్మకమైన పోరాటం ద్వారా సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభ సందర్భంలో, ఉద్యమ అమరవీరులందరికీ హైదరాబాద్ సిటీ పోలీస్ తరపున ఘన నివాళులర్పించారు. నగర ప్రజలకు మెరుగైన శాంతిభద్రతల సేవలను అందించేందుకు, ప్రభుత్వ ప్రజా పాలనా విధానాలకు అనుగుణంగా ప్రజలను భాగస్వామ్యం చేస్తూ హైదరాబాద్ పోలీస్ చేపడుతున్న పలు సంస్కరణలు, సాధించిన పురోగతిని ఈ సందర్భంగా వివరించారు. సిబ్బంది ఆరోగ్యం కోసం 'గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్' ద్వారా దాదాపు 20 వేల మంది సిబ్బందికి పూర్తి స్థాయి వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి ఏ, బీ, సీ, డీ, ఈ కేటగిరీలుగా విభజించి ప్రతి ఒక్కరికీ హెల్త్ ప్రొఫైలింగ్ చేసినట్లు వివరించారు. ప్రతి పీఎస్ లో ఒక హెల్త్ వలంటీర్ ను నియమించి.. వారికి వైద్య సాయం లేదా జీవనశైలి మార్పులు అవసరమో నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధునిక పోలీసింగ్‌లో సాంకేతిక విప్లవాన్ని తీసుకురావడంలో భాగంగా హైదరాబాద్ సిటీ పోలీస్ ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకుంటోందన్నారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు రాకుండానే ఏఐ సాంకేతికత సాయంతో ఇంటి నుంచే సులభంగా ఫిర్యాదు సిద్ధం చేసుకుని ఎఫ్ఐఆర్ నమోదు చేసుకునేలా దేశంలోనే తొలిసారిగా 'సీ-మిత్ర' వర్చువల్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను ప్రారంభించినట్లు గుర్తుచేశారు. దీని ద్వారా ఇప్పటివరకు 1130 'జీరో ఎఫ్ఐఆర్'లతో పాటు సైబర్ క్రైమ్ పీఎస్ లో 380 కేసులను నమోదు చేసినట్లు వివరించారు. బాధితుల ఫిర్యాదులను అత్యంత వేగంగా, క్రమబద్ధంగా నమోదు చేయడానికి రూపొందించిన 'ఏఐ కాప్‌రైటర్' యాప్ పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తోందని వివరించారు. సమాజ శాంతిని కాపాడేందుకు, ముఖ్యంగా మహిళలు, చిన్నారుల భద్రతకు విఘాతం కలిగించే ఆన్‌లైన్ అంశాలను, సోషల్ మీడియా పోస్టులను నిరంతరం పర్యవేక్షించడానికి 'సాక్-ఐ' అనే ఏఐ ఆధారిత అప్లికేషన్‌ను వినియోగిస్తూ డిజిటల్ భద్రతను పటిష్టం చేశామని చెప్పారు. నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన 'హెచ్-ఫాస్ట్' విభాగం ద్వారా కొద్దిరోజుల్లోనే 173 కేసులు నమోదు చేసి, సుమారు 95 టన్నుల కల్తీ పదార్థాలను స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. త్వరలోనే 300 మంది మహిళా సిబ్బందికి డ్రైవింగ్ శిక్షణ ఇచ్చి పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సేవల్లో భాగస్వాములను చేయనున్నట్లు వెల్లడించారు. సిబ్బందిలో వృత్తి నైపుణ్యాలను, లీడర్‌షిప్, సాఫ్ట్ స్కిల్స్, ఇన్వెస్టిగేషన్ నైపుణ్యాలను పెంపొందించడానికి 'పవర్', 'ఒక గొప్ప మార్పునకు ఇదే శ్రీకారం' వంటి 14 వినూత్న శిక్షణ కార్యక్రమాల ద్వారా సిబ్బందికి రికార్డు స్థాయిలో 2.30 లక్షల గంటల శిక్షణ అందించినట్లు తెలిపారు. సైబర్ నేరాల పట్ల 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటిస్తూ, 'సైబర్ సింబా' వలంటీర్ల ద్వారా క్షేత్రస్థాయిలో ప్రతి శనివారం ప్రజల ముంగిటకే వెళ్లి సైబర్ అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం హెచ్ న్యూ విభాగాన్ని బలోపేతం చేశామని, డ్రగ్స్ విషయంలో ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను సురక్షితమైన విశ్వనగరంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, డ్రగ్స్, ఆహార కల్తీ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల సమాచారాన్ని 'డయల్ 100' ద్వారా పోలీసులకు అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ సిపి క్రైం అండ్ సిట్.యం శ్రీనివాస్, అడిషినల్ సిపి లా అండ్ ఆర్డర్ తఫ్సీర్ ఇక్బాల్ , జాయింట్ సిపి ట్రాఫిక్.డి.జోయల్ డెవిస్, జాయింట్ సిపి నార్త్ రేంజ్ , ఎన్. శ్వేత, డిసిపి సిఎఆర్ హెడ్ క్వార్టర్స్ ఆర్.వెంకటేశ్వర్లు, తో పాటు జోనల్ , ట్రాఫిక్, సిసిఎస్, సైబర్ క్రైం డిసిపిలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# అడ్డగుట్ట లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**అడ్డగుట్ట, జూన్ 2 (పీపుల్స్ న్యూస్) :**
తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని అడ్డగుట్ట బస్టాప్ వద్ద మాజీ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ పదేళ్ల పాలనలో కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి పథంలో నడిపారని ఆమె అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో అభివృద్ధి అన్నిరంగాల్లో కుంటుపడిందని ఆమె తెలిపారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని ఆమె విమర్శించారు. పేరుకేమో మాది ప్రజా పాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు ఆచరణలో మాత్రం ప్రజల బాధలను ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆమె అన్నారు. రాబోయేది మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వమే అని, ప్రజలంతా బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ యే మళ్లీ రావాలని కోరుకుంటున్నారని ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు

బుధవారం, జూన్ 03, 2026

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి
- అమరవీరుల త్యాగాలను స్మరించిన పోలీస్ అధికారులు..



**బాలానగర్ జూన్ 03 ( పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వేడుకలలో భాగంగా బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేశభక్తి, రాష్ట్రాభిమానాన్ని ప్రతిబింబించేలా జరిగిన ఈ కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మంగళవారం బాలానగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమం అత్యంత గౌరవప్రద వాతావరణంలో సాగింది. తొలుత తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఏసీపీ నరేష్ రెడ్డి, అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ గీతం, తెలంగాణ రాష్ట్ర గీతాల ఆలాపనతో పోలీస్ స్టేషన్ ఆవరణ దేశభక్తి భావాలతో మార్మోగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకున్నారు. ఎన్నో సంవత్సరాల సుదీర్ఘ ఉద్యమం, వేలాది మంది ప్రజల ఆకాంక్షలు, అమరవీరుల త్యాగాల ఫలితంగానే 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. తెలంగాణ సాధనలో తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదా యకమని అన్నారు. అలాగే రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ లో తెలంగాణ పోలీస్ శాఖ దేశవ్యా ప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని, ప్రజల భద్రత కోసం పోలీసులు అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. తెలంగాణ మరింత అభివృద్ధి సాధించి దేశంలో అగ్రగామి రాష్ట్రంగా నిలవాలంటే ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరి ంచాలని, పోలీస్ అధికారులు కూడా ప్రజాసేవను మరింత సమర్థవంతంగా కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ ఇన్‌స్పెక్టర్ టి. నర్సింహా రాజు, డీఐ సక్రమ్‌తో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ స్టేషన్ ఆవరణ పండుగ వాతావరణాన్ని సంతరించుకోగా అధికారులు మరియు సిబ్బంది పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# డిజిపి కార్యాలయంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు






**హైదరాబాద్,క్రైమ్ బ్యూరో, జూన్ 2 (పీపుల్స్ న్యూస్) :**
తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం డిజిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఐజిపి (పి అండ్ ఎల్) గజరావు భూపాల్ పాల్గొని జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ (లీగల్) సతీష్, ఏఐజి రమణ కుమార్, సిఎస్ఓ సి. హెచ్ యోగేశ్వరరావు, డీఎస్పీ ఉదయభాస్కర్ లతో పాటు డిజిపి కార్యాలయానికి చెందిన పలువురు అధికారులు ,సిబ్బంది పాల్గొని రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# ఇళ్లలో దొంగతనాలకు పాల్పడే మహిళ అరెస్టు.

**దొంగిలించబడిన బంగారు , వెండి ఆభరణాలను స్వాధీనం.**






**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూన్ 2 (పీపుల్స్ న్యూస్):**
రాత్రి వేళలో తాళాలు వేసి ఉన్న ఇండ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న నింధితురాలిని రాజేంద్రనగర్ జోన్ పోలీసులు అత్యంత వేగంగా ఛేదించి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఆమె వద్ద నుండి దొంగిలించబడిన బంగారు , వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం.... హైదరాబాద్, బండ్లగూడ, గౌస్ నగర్, ఈడబ్ల్యుఎస్ కాలనీ నివాసి ఎన్. గిరి బాబు తన కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 30న ఉదయం 09:00 గంటలకు యాదగిరిగుట్ట దేవాలయ దర్శనానికి వెళ్ళారు. వారు ఆలయం వద్ద ఉండగా, గత నెల 31న తెల్లవారుజామున ఆయన వదిన ఫోన్ చేసి, ఇంటి ప్రధాన తలుపు తాళం పగలగొట్టి ఉన్నట్లు సమాచారం ఇచ్చారు. బాధితుడు వెంటనే ఇంటికి వచ్చి పరిశీలించగా, ప్రధాన తలుపు , బీరువా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. అందులోని సుమారు 91 గ్రాముల బంగారు ఆభరణాలు, 100 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బండ్లగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు సమయంలో, ఫిర్యాదుదారుడు తన పొరుగున ఉండే కాపరి నర్సమ్మపై అనుమానం వ్యక్తం చేశారు. గతంలో ఆమెకు , ఫిర్యాదుదారుడి కుటుంబానికి మధ్య ఉన్న పాత గొడవలు, అలాగే గతంలో ఆమెపై ఉన్న దొంగతనం కేసుల నేపథ్యాన్ని బట్టి ఈ అనుమానం వ్యక్తపరిచారు. విశ్వసనీయ సమాచారం , దర్యాప్తులో సేకరించిన ఆధారాల ప్రకారం బండ్లగూడ పోలీసులు తక్షణమే రంగంలోకి దిగి మహబూబ్ నగర్ జిల్లా ఖానాపూర్ గ్రామానికి చెందిన కాపేరి నర్సమ్మ (44) గౌస్ నగర్, బండ్లగూడ లో నివాసం ఉంటుంది. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల శైలిలో విచారించగా ఆమె తన నేరాన్ని అంగీకరించింది. ఫిర్యాదుదారుడి కుటుంబంతో ఉన్న పాత కక్షల నేపథ్యంలో, వారు యాదగిరిగుట్టకు వెళ్లిన విషయాన్ని గమనించి, ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకుని మధ్య రాత్రి వేళలో ఇనుప పైపు , కొడవలి సహాయంతో ఇంటి తాళాలు, బీరువా పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించినట్లు నిందితురాలు ఒప్పుకుంది. నిందితురాలి అంగీకార వాంగ్మూలం ప్రకారం, ఆమె దాచిపెట్టిన చోటు నుండి 8.2 తులాల బంగారు ఆభరణాలు, 1 కేజీ 80 గ్రాముల వెండి ఆభరణాలను, అలాగే తాళాలు పగలగొట్టడానికి ఉపయోగించిన ఇనుప పైపు , కొడవలిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రికవరీ చేసిన ఈ మొత్తం సొత్తు విలువ సుమారు ?15,00,000 ఉంటుంది. నిందితురాలిని తదుపరి జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం న్యాయస్థానం ముందు ప్రవేశపెడుతున్నారు. ఈమెకు ఇతర ఏవైనా నేరాలతో లేదా క్రిమినల్ కేసులతో సంబంధం ఉందా అనే కోణంలో తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. సౌకర్యార్థం ప్రజలు ఊర్లకు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తమ ఇళ్లకు సరైన భద్రతా తాళాలు ఉండేలా చూసుకోవాలని, తాము ఇంట్లో లేని విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే, వీలైనంత వరకు ఇళ్ల వద్ద సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, కాలనీల్లో ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు , సంచారాలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. హైదరాబాద్ సిటీ, రాజేంద్రనగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్. శ్రీనివాస్, ప్రత్యక్ష పర్యవేక్షణలో , అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎ. సుధాకర్ నేతృత్వంలో ఈ సమగ్ర దర్యాప్తు జరిగింది. కేసును అత్యంత వేగంగా ఛేదించి, దొంగిలించబడిన సొత్తును రికవరీ చేసిన బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆర్. దేవేందర్, డిఐ ఎస్. విష్ణు వర్ధన్ రెడ్డి , వారి సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ డా,, గడ్డం శ్రీనివాస్ కు ఘన సన్మానం



**హైదరాబాద్, జూన్ 2 (పీపుల్స్ న్యూస్) :**
తెలంగాణ స్టేట్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ గా సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీ డా,, గడ్డం శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జవహర్ నగర్ నాయకులు మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు దామాలప్రభాకర్ రావు , మాజీ అధ్యక్షులు కోళ్ల నాగరాజు , సంఘం జనరల్ సెక్రెటరీ జోరుక సారంగపాణి , వేల్పుల ప్రసాద్ , డానియల్ , రమణ , మధుసూదన్ రావు , మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి దండ్ల మురళి , తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు వాసంశెట్టి శ్రీనివాసరావు తదితర నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ఘన సన్మానం చేశారు. అనంతరం డాక్టర్ గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం దళితులకు చేపట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను అట్టడుగు దళిత ప్రజలకు చేరే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

# కుత్బుల్లాపూర్ డివిజన్‌లో ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు






**కుత్బుల్లాపూర్, జూన్ 2 (పీపుల్స్ న్యూస్) :**
తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు కట్టా కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జాతీయ పతాకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి హాజరై, అందరికీ తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కట్టా కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో బిజెపి రాష్ట్ర నాయకులు ఒక్కంటి దయాకర్,బీజేపీ పార్టీ నాయకులు, బీఎంఎస్ యూనియన్ సభ్యులు, సాయిబాబా నగర్ డివిజన్ బీజేపీ నాయకులు సౌరభ్ సింగ్ , ఇతర ప్రముఖులు, కార్యకర్తలు విశేషంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా స్థానికులకు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేసి, తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ, ప్రజలందరికీ కట్టా కుమార్ , నాయకులు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# 70 సంవత్సరాల నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష.

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, జూన్ 2 (పీపుల్స్ న్యూస్) :**



మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో 70 సంవత్సరాల నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ హైదరాబాద్‌లోని ౹XX అదనపు సెషన్స్ జడ్జి , పోక్సో కేసుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కుమారి ఎం. అర్చన కుమారి చారిత్రాత్మక తీర్పును వెలువరించారు. చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మొదట నమోదైనకేసు, తదుపరి అధికార పరిధి నిబంధనల ప్రకారం జీఓ నెం. 32 హోం లీగల్ డిపార్ట్‌మెంట్ ద్వారా సంతోష్ నగర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ కేసు కోర్టులో విచారణకు వచ్చింది. కేసు పూర్వాపరాల ప్రకారం, 11-05-2023 తేదీ రాత్రి సమయంలో గుల్షన్ ఇక్బాల్ కాలనీలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చిన మైనర్ బాలిక, పాలు ప్యాకెట్ కొనడానికి స్థానిక కిరాణా దుకాణానికి వెళ్ళింది. అక్కడ దుకాణ యజమాని అయిన మహ్మద్ జమీరుద్దీన్ (70) బాలికను లోపలికి పిలిచి, బలవంతంగా లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా అశ్లీల వీడియోలు చూపిస్తూ బెదిరింపులకు గురిచేశాడు. బాలిక ఏడుస్తూ ఇంటికి వచ్చి తన బాబాయ్‌కి , తల్లిదండ్రులకు విషయం తెలపడంతో వారు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. విచారణను సమగ్రంగా పరిశీలించిన గౌరవ న్యాయస్థానం నిందితుడిపై మోపబడిన ఐపీసీ సెక్షన్ 376(2)(ట) మరియు పోక్సో (గూజూూ) చట్టం 2012 లోని సెక్షన్ 3 తీ/ష 4 కింద నేరం రుజువైనట్లు నిర్ధారించింది. నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు రూ. 5,000/- జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మరో ఆరు (6) నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది ఈ కేసులో నిందితుడికి కఠిన శిక్ష పడేలా సమర్థవంతంగా పనిచేసిన అధికారులను హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. కేసును పకడ్బందీగా దర్యాప్తు చేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ పి. శివ చంద్ర (ప్రస్తుతం ఇన్‌స్పెక్టర్, సైబర్ క్రైమ్, హైదరాబాద్), కోర్టులో బలమైన సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎ. రామ్ రెడ్డి ,జె. రామకృష్ణ ల కృషిని కొనియాడారు. వీరితో పాటు సాక్షులను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టేందుకు ,సమన్వయం కోసం శ్రమించిన లీగల్ సపోర్ట్ ఆఫీసర్లు టి. కల్పన, ఎ.ఆర్. హిమ మీనన్, నౌషీన్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ డి. నాగరాజు , ప్రాసెస్ డ్యూటీ ఆఫీసర్ పూర్ణచందర్ రావు లను అభినందించారు.

# ఉపాధికి బాటలు వేస్తున్న ఎలక్ట్రిక్ బస్సు - నైపుణ్యం ఉన్నవారికి ఉద్యోగావకాశాలు




**హైదరాబాద్ :** పెరుగుతున్న ఇంధన ధరలు, వాతావరణ కాలుష్య వంటి అనేక సమస్యలను నివారించి దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగానే గ్రేటర్ పరిధిలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశ పెట్టింది. ఈ బస్సుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో ఈ రంగంలో ఉపాధి కోసం నగరానికి వచ్చే వారి సంఖ్య సైతం నిరంతరం పెరుగుతూ వస్తోంది.నగరంలోని మియాపూర్, హెచ్‌సీయూ, రాణిగంజ్, కంటోన్మెంట్, హయత్‌నగర్ డిపోల నుంచి 440 ఎలక్ట్రిక్ బస్సుల్లు అందుబాటులో ఉన్నారు. ఇప్పటికే '2.6' నిబంధన ప్రకారం 1100 మంది డ్రైవర్లను నియమించారు. అయితే ఇందులో వికారాబాద్, నల్గొండ, సంగారెడ్డి, సిద్దిపేట్, మహబూబ్‌నగర్ వంటి పొరుగు జిల్లాల నుంచి వచ్చినవారే అధిక సంఖ్యలో ఉన్నారు. వీరంతా బాలానగర్, ఎల్బీనగర్, కూకట్‌పల్లి, మియాపూర్, ఉప్పల్ డిపోల చుట్టుపక్కల ప్రాంతాల్లోనే స్థిరపడ్డారు. ఇటీవల కూకట్?పల్లి డిపోలో 60 బస్సులను ప్రారంభించారు. అయితే దీని కోసం నియామక ప్రక్రియను ప్రారంభించారు. దీంతో మరో 150 మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లైంది.మరో 5 వేల మందికి ఉద్యోగాలు : రానున్న రెండు సంవత్సరాల్లో సుమారు 2 వేలకు పైగా ఎలక్ట్రిక్ బస్సులు తీసుకురానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరో 5 వేల మందికి ఉద్యోగాలు రాబోతున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా డ్రైవింగ్ ఉద్యోగాలతోపాటు మెకానిక్, టెక్నీషియన్, ఛార్జింగ్ స్టేషన్ ఆపరేటర్, నిర్వహణ విభాగాల్లో మరిన్ని ఉపాధి అవకాశాలు పెరగనున్నాయని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. దీనితో నగరంలో మరింతగా వలసలు పెరగనున్నట్లు అంచనా. మెరుగైన వేతనంతో : వీటికి సంబంధించిన డ్రైవర్? నియామక ప్రక్రియలో హెవీ మోటార్ వెహికిల్ లైసెన్స్ ఉండి, డ్రైవింగ్‌లో కనీసం 18 నెలలు, అంతకంటే ఎక్కువ అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తారు. ఈ నియామక ప్రక్రియ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు నగరంలోని హకీంపేట కేంద్రంలో శిక్షణ ఇస్తారు. అన్ని అర్హత సాధించినవారికి ఎలక్ట్రిక్ బస్సులు అప్పగిస్తారు. ఇతర జిల్లాలతో పోల్చితే నగరంలో మెరుగైన వేతనం, జీరో యాక్సిడెంట్ అలవెన్స్, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. దీంతో హైదరాబాద్?లో స్థిరపడాలని కుటుంబంతో సహా వచ్చేస్తున్నారు. వీటిలో సైతం : ఎలక్ట్రిక్ బస్సులలో ప్రత్యేక బ్యాటరీ, ఎలక్ట్రానిక్ విడి భాగాలు ఉంటాయి. దీంతో ఎలక్ట్రిక్ వాహనాల సర్వీసింగ్‌లో నైపుణ్యం ఉన్నవారికి ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. గ్రేటర్ పరిధిలోని ఆరు డిపోల్లో ఇప్పటికే ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. వీటిని మరిన్ని డిపోల్లో అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, వాటి నిర్వహణ కోసం నిపుణులను నియమించుకోనున్నారు.
డిసెంబరు నెలాఖరులోగా అమలు : ఎలక్ట్రిక్ బస్సులు ఒకవైపు ఉపాధి అవకాశాలు పెంచేందుకు దోహద పడుతుంటే మరో వైపు ప్రజల్లో ఎలక్ట్రి వాహనాలపై అవగాహన పెరిగింది. పైగా ప్రభుత్వం ప్రభుత్వానికి భారీగా ఆదాయాన్ని తీసుకొచ్చే ప్రధానమైన శాఖల్లో రవాణాశాఖ ఒకటి. ఈ శాఖకు వచ్చే ఆదాయంలో 75% వాహనాల లైఫ్, క్వార్టర్లీ ట్యాక్స్ నుంచే వస్తుంది. అయినప్పటికీ కాలుష్య సమస్య నియంత్రణకు ఈవీ పాలసీ తెచ్చి ట్యాక్స్, ఫీజుల మినహాయింపు ఇస్తోంది. తద్వారా ఇప్పటికే సుమారు రూ.860 కోట్ల ఆదాయాన్ని వదులుకుంది. ఈ పాలసీ ఈ సంవత్సరం డిసెంబరు నెలాఖరు వరకు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.కొనుగోలు చేసేందుకు ఆసక్తి : ఈవీల్లో ఖరీదైనవే కాకుండా తక్కువ ధరలకు లభించేవి కూడా అందుబాటులో ఉన్నాయి. దీంతో మధ్యతరగతి ప్రజలు సైతం వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పైగా డీజిల్, పెట్రోల్ ధరలు రోజు రోజుకూ పెరుగుతుండటం, ప్రపంచదేశాల్లో యుద్ధ ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని ఈవీల వైపు ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే వివిధ ఈవీ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 10-20% రాయితీని తాజాగా ప్రకటించాయి. ప్రభుత్వం సైతం కొత్తగా కొనుగోలు చేసే వాహనాల్లో ఈవీలనే ఎంపిక చేయాలని నిర్ణయించింది. దీంతో రానున్న నెలల్లో ఈవీల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది.

# తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్























**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, జూన్ 2 (పీపుల్స్ న్యూస్) :**
ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ పిలుపునిచ్చారు. 12వ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం పరేడ్ కమాండర్ నుండి పోలీసు గౌరవ వందనాన్ని సీపీ స్వీకరించారు. తదనంతరం పోలీసు అధికారులు, సిబ్బంది సమక్షంలో తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' ఆలపించడంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భం గా సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నేటికి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రజలందరికీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.. భారతదేశంలో 29వ రాష్ట్రంగా 2014 జూన్ 2న ఆవిర్భవించిన తెలంగాణ నేడు దేశవ్యాప్తంగా నూతన ఆవిష్కరణలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు వేదికగా నిలిచిందని పేర్కొన్నారు. అభివృద్ధి, భద్రతలో తెలంగాణ పోలీసులు దేశానికి ఆదర్శమ న్నారు. తెలంగాణ రాష్ట్రం ఆర్థికాభివృద్ధి, శాంతిభద్రతల పరి రక్షణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి అనేక రంగాల్లో దేశా నికి ఆదర్శంగా నిలుస్తోందని సీపీ తెలిపారు. గత పదేళ్లలో తెలం గాణ పోలీసులు అనేక జాతీయ స్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలవడం రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతిభకు నిదర్శ నమన్నారు. ప్రజలకు భద్రత కల్పించడంలో, పెట్టుబడులను ఆకర్షించడంలో, అభివృద్ధికి అనుకూల వాతావరణం సృష్టించడంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్, తలసరి ఆదాయం వంటి కీలక సూచీలలో తెలంగాణ సాధిస్తున్న ప్రగతి ప్రతి తెలంగాణ వాసి గర్వించదగ్గ విషయమని సీపీ అభివర్ణిశీచారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పేర్కొన్నారు. పోలీసుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు. అలాగే బలిమెల ఘటనలో అమరులైన పోలీసు సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం ఇంటి స్థలాలను కేటాయించడం పోలీసు కుటుంబాల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం విధి నిర్వహణలో విశిష్ట ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు, సిబ్బందికి మహోన్నత సేవా పతకాలు, ఉత్తమ సేవా పతకాలు , సేవా పతకాలను సీపీ చేతుల మీదుగా ప్రదానం చేశారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా 2026 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీసు సేవా పతకాలలో సైబరాబాద్ పోలీస్ కమిషన రేట్‌కు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది ఎంపికయ్యారు. మహోన్నత సేవా పతకానికి అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్. రవికుమార్, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి. అశోక్ ఎంపిక కాగా, ఉత్తమ సేవా పతకాలకు ఎస్‌ఐలు కె. శ్రీనివాస్, ఎస్. రాంబాబు, మహ్మద్ హాజీ మియా, ఏఆర్‌ఎస్‌ఐ కృష్ణ నరేడ్ల, ఏఎస్‌ఐ వి. వెంకట సూర్యనారాయణ రాజు ఎంపికయ్యారు. అదేవిధంగా సేవా పతకాలకు సైబరాబాద్ కమిషనరేట్‌కు చెందిన మరో 37 మంది అధికారులు, సిబ్బంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న వారిని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అభినందిస్తూ, వారి సేవలు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో హైదరాబాద్ జిల్లా మహిళా మండలుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీమతి షహీన్ అఫ్రోజ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న వృద్ధాశ్రమం , అనాథాశ్రమానికి చెందిన మొత్తం 28 మంది సభ్యులు (చిన్నారులు, సిబ్బంది) నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సీపీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి షహీన్ అఫ్రోజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం మరియు సామాజిక పురోగతి కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రతి ఒక్కరినీ ఆమె అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక ప్రదర్శనలను ఆసక్తిగా వీక్షించి, రాష్ట్ర ప్రగతి పట్ల తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. సైబరాబాద్ పోలీసుల ఆహ్వానం మేరకు ఈ వేడుకల్లో పాల్గొనడం తమకు ఎంతో సంతోషంగా ఉందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్., అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఐపీఎస్., శేరిలింగంపల్లి డీసీపీ సి. హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్., కూకట్పల్లి డీసీపీ రితి రాజ్, ఐపీఎస్., డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, డబ్ల్యు అండ్ సీఎస్డబ్ల్యూ డీసీపీ సృజన కరణం, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, ఎస్‌ఓటీ డీసీపీ శోభన్ కుమార్, సైబరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్ ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహణ

- బాలానగర్‌లో జాతీయ జెండా ఆవిష్కరించిన కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్
- అమరవీరులకు నివాళులు, కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు



**బాలానగర్ జూన్ 03 ( పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్‌లో పి.జె.ఆర్. విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించిన వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో బండి రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అనేక మంది ఉద్యమకారుల త్యాగాలు, పోరాటాలు, బలిదానాల ఫలితంగా ఆవిర్భవించిందని గుర్తు చేశారు. అయితే గత పదేళ్లపాటు రాష్ట్రం ఒకే కుటుంబం ఆధిపత్యంలో ఉండి అవినీతి, బంధుప్రీతి కారణంగా అభివృద్ధిలో వెనుకబడిందని విమర్శించారు. ప్రస్తుతం ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండున్నర సంవత్సరాలుగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలను అమలు చేస్తూనే, సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించడం ద్వారా రైతును ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వర మహిళలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. విద్య, వైద్యం రంగాలకు పెద్దపీట వేస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని, ఆ లక్ష్యం త్వరలోనే సాకారమవుతుందని బండి రమేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏఎంసీ చైర్మన్ కొండకింది పుష్పారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మయ్య, జావేద్ అలీ, శ్రీకాంత్ పటేల్, శివకుమార్ గౌడ్, జి.వి.ఆర్., ప్రసన్న కుమార్, బాల నరసింహ, జల్లా శివ, శేఖర్ తదితరులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులపై మోదీ ఎందుకు మౌనం



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస తులు, లెబనాన్‌పై ఇజ్రాయెల్ సైనిక చర్యల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహి స్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అమెరికా --ఇరాన్ మధ్య కొనసాగుతున్న దౌత్య చర్చలు విజయవంతమైతే ప్రాంతీయ యుద్ధానికి ముగింపు పలకడంతో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా సానుకూల ప్రభావం పడుతుందని ఆయన పేర్కొన్నారు. మం గళవారం ఎక్స్ వేదికగా స్పందించిన జైరాం రమేశ్, పశ్చిమాసియాలో యుద్ధాన్ని నిలిపి వేసేందుకు అమెరికా, ఇరాన్ దేశాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ చర్చలు సఫలమైతే అత్యంత కీలకమైన హా ర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలపై ఒత్తిడి తగ్గి ధరలు దిగివస్తాయని, ఇది భారత్‌కు ఎంతో ప్రయోజనకరంగా మారుతుందని అభిప్రాయప డ్డారు. అయితే ఈ దౌత్య ప్రయత్నాలు ఇంకా కొలిక్కి రాకపోవడానికి ప్రధాన కారణం లెబనాన్‌లో ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న సైనిక చర్యలేనని జైరాం రమేశ్ ఆరోపించారు. ఇజ్రా యెల్ దళాలు లెబనాన్ భూభాగంలో అపూర్వ స్థాయిలో చొరబాట్లు, దాడులు నిర్వహి స్తున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల వల్లే అమెరికా--ఇరాన్ చర్చల్లో తుది ఒప్పందం కుదరడం లేదని అన్నారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను ప్రపంచంలోని అనేక దేశాలు బహిరంగంగా ఖండిస్తున్నాయని జైరాం గుర్తు చేశారు. అయితే ఈ అంశంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ పూర్తిగా మౌనం వహిస్తున్నారని విమర్శించారు. ఇజ్రాయెల్ చర్యల వల్ల లెబనాన్ తీవ్ర నష్టాన్ని చవిచూస్తో ందని, అదే సమయంలో అమెరికా--ఇరాన్ మధ్య కుదిరే అవకాశమున్న ఒప్పందాన్ని కూడా ఈ దాడులు దెబ్బతీస్తున్నాయని వ్యాఖ్యానించా రు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ స్పందిం చకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోందని జైరాం రమేశ్ అన్నారు. రాజకీయంగా తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ "సో-కాల్డ్ ఫాదర్ ల్యాండ్ ఆయనకు మాతృ భూమి కంటే ముఖ్యమై ందా?" అంటూ ప్రధాని మోదీని ప్రశ్నించారు. ఇదిలా ఉం డగా, అమెరికా అధ్యక్షుడు డొ నాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మధ్య కూడా ఇటీవల ఉద్రిక్త సంభాషణ జరిగినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువడ్డాయి. లెబనాన్‌లో కొనసాగుతున్న సైనిక చర్యల కారణంగా అమెరికా--ఇరాన్ మధ్య దౌత్య ప్రక్రియకు ఆటంకాలు ఏర్ప డుతున్న నేపథ్యంలో ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు వార్తలు పేర్కొన్నాయి. సోమవారం జరిగిన టెలిఫోన్ సంభాషణలో నెతన్యాహుపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. లెబనాన్‌లో హెజ్?బొల్లా కమాండర్‌ను లక్ష్యంగా చేసుకుని చేపట్టిన దాడుల్లో భారీ స్థాయిలో భవనాలు ధ్వంసం కావడం, బీరూట్‌పై పెరుగుతున్న బెదిరింపులు తనకు ఆందోళన కలిగించాయని ట్రంప్ వ్యాఖ్యానించినట్లు నివేదికలు వెల్లడించాయి. ఇజ్రాయెల్ చర్యల కారణంగా ప్రపంచవ్యా ప్తంగా ఆ దేశంపై వ్యతిరేక భావన పెరుగుతోందని కూడా ట్రంప్ వ్యాఖ్యాని ంచినట్లు కథనాలు పేర్కొన్నాయి. నెతన్యాహుతో జరిగిన ఈ సంభాషణ తన రెండో అధ్యక్ష పదవీకాలంలో అత్యంత ఉద్రిక్తమైన వాటిలో ఒకటిగా నిలిచిందని అమెరికా పరిపాలన వర్గాలకు చెందిన అధికారులు చెప్పినట్లు సమాచారం. అనంతరం సోషల్ మీడియా వేదికగా స్పందించిన ట్రంప్, బీరూట్‌పై పెద్ద ఎత్తున దాడులు చేపట్టవద్దని తాను కోరిన తర్వాత ఇజ్రాయెల్ తన దళాల కదలికలను వెనక్కి మళ్లించినట్లు తెలిపారు. మరోవైపు ఇరాన్‌తో చర్చలు వేగంగా కొనసాగుతున్నాయని కూడా వెల్లడించారు. కాగా, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ప్రపంచ ఇంధన మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయి. హర్మూజ్ జలసంధి గుండా ప్రపంచ ముడి చమురు సరఫరాలో గణనీయమైన భాగం రవాణా అవుతుండటంతో అక్కడి పరిస్థితులను భారత్ సహా అనేక దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా--ఇరాన్ చర్చలు, లెబనాన్‌లో పరిస్థితులపై అంతర్జాతీయ దృష్టి కేంద్రీకృతమైంది.

# దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలు ఢిల్లీలో సమావేశమవుతాయి



**పశ్చిమబంగాల్:** ఎన్నికల్లో బీజేపీ రిగ్గింగ్ చేసి విజయం సాధించిందని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ తీవ్రమైన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని 294 అసెంబ్లీ స్థానాల్లో 177 చోట్ల కమలం పార్టీ ఓట్ల లెక్కింపులో రిగ్గింగ్ చేసిందని కోల్‌కతాలో చేపట్టిన ధర్నాలో మమత తెలిపారు. తన జీవితంలో ఎవరికైతే తాను అండగా నిలిచానో వారే ఇప్పుడు ఒక ద్రోహితో చేతులు కలపడం విచారంగా ఉందని సీఎం సువేందు అధికారిని ఉద్దేశించి మమత వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరే కంగా పోరాడుతున్న పార్టీలు ఢిల్లీలో సమావే శమవుతాయని తెలిపారు. దేశవ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలు ఢిల్లీలో సమావేశమవుతాయని తెలిపారు. ప్రదర్శనల్లో పాల్గొనవద్దని టీఎంసీ కార్యకర్తలను పోలీసులు బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని బెదిరిం పులు వచ్చినా తన నిరసన మాత్రం కొనసాగు తుందని మమత తేల్చిచెప్పారు. పునరావాసం చూపకుండా వీధి వ్యాపారాలను తొలగించడం అన్యాయమని తెలిపారు. ఈ పద్ధతిని టీఎంసీ ప్రభుత్వం ఎప్పుడూ అవలం బించలేదని స్పష్ట ంచేశారు. వీధి వ్యాపారుల పట్ల టీఎంసీ ప్రభు త్వం మానవీయతతో మెలిగినట్లు చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో తాను కార్యకర్తలకు మద్ద తుగా కలిసి పోరాడతానని వెల్లడించారు.

# టార్గెట్ దాడులపై కోల్‌కతాలో మమత బైఠాయింపు నిరసన



**కోల్‌కతా:** తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు అభిషేక్ బెనర్జీ, కల్యాణ్ బెనర్జీపై దాడులకు నిరసనగా ఆ పార్టీ అధినేత్రి, మాజీ ముఖ్య మంత్రి మమతా బెనర్జీ కోల్‌కతాలో మంగ ళవారంనాడు బైఠాయింపు దీక్షకు దిగారు. రాణి రష్మోని ఎవెన్యూ వద్ద నిరసన దీక్షకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో ధర్మతలా ప్రాంతంలోని బస్టాండ్ సమీపంలో బైఠాయింపు నిరసన చేపట్టారు. టీఎంసీ సీనియర్ నేతలు డెరిక్ ఒబ్రెయిన్, చంద్రిమ భట్టాచార్య, శోభన్ దేబ్ చటోపాధ్యాయ తదితరులు పాల్గొన్నారు. సిటీలోని పలు ప్రాంతాలకు చెందిన పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. నిరసన దీక్షకు ముందు భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మమతా బెనర్జీ నివాళులర్పించారు. అనంతరం భారత రాజ్యాంగం పుస్తకాన్ని చేతిలో ఉంచుకుని దీక్షాస్థలికి వెళ్లారు. మమతాబెనర్జీ నిరసన ర్యాలీతో పోలీసులు పెద్దఎత్తున మోహరించారు. దీనికి ముందు మమతా బెనర్జీ సోషల్ మీడియాలో ఒక వీడియో పోస్ట్ చేశారు. కోల్‌కతాలో ధర్నా చేపట్టేందుకు పోలీసులు అనుమతి నిరాకరించారని, అనుమతి ఇవ్వకున్నా ధర్మా నిర్వహిస్తామని, కావాలంటే అరెస్టు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజాస్వా మ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు అనుమతిం చకుంటే ఢిల్లీకి వెళ్తామని హెచ్చరించారు. రెండవ అతిపెద్ద విపక్ష పార్టీ ఎంపీలపై దాడి జరిగిన తీరు దిగ్భ్రాంతి కలిగిస్తోందని, డాక్టర్లను ట్రీట్‌మెంట్ ఇవ్వద్దని ఆదేశాలు వెళు తున్నాయని, ఇదెలాంటి నిరంకుశ ధోరణి అని ప్రశ్నించారు. కొద్ది మంది ఎంపీలనో, ఎమ్మెల్యే లనో బయపెట్టి, డబ్బులు చూపించినంత మాత్రాన తమ పార్టీ బలహీన పడదని, పార్టీ మరింత బలంగా పుంజుకుంటుందని అన్నారు.

# మక్కల్ శక్తి అయ్యక్కం అన్నామలై కొత్త పార్టీ పేరు ఇదేనా?

**చెన్నై:** తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కె. అన్నా మలై కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు ఆ రాష్ట్రంలో జోరుగా ప్రచారం జరుగుతోంది. కాషాయ పార్టీని వీడి తన పుట్టిన రోజున (జూన్ 4న) అన్నామలై 'మక్కల్ శక్తి అయ్యక్కం' పేరిట కొత్త పార్టీని స్థాపించబోతున్నట్లు తమిళనాడు చర్చ మొదలైంది. అన్నామలై బీజేపీలో అసంతృప్తితో ఉన్నారని వస్తున్న ఊహాగానాల నడుమ ఈ వా ర్తలు వెలువడ్డాయి. అయితే ఇదే విషయంపై అన్నామలైను చెన్నై విమానాశ్రయంలో మీడియా ప్రశ్నించగా, రెండు రోజుల్లో తన వైఖరిని స్పష్టం చేస్తానని సమాధానమిచ్చారు. దీంతో అన్నామలై విజయ్‌లా కొత్త పార్టీ పెడతారా? లేదంటే బీజేపీలోనే కొనసాగుతారా? అనే విషయం మరికొద్ది రోజుల్లో తేలిపోనుంది. తమిళనాడులో మరోసారి రాజకీయ ఉత్కం ఠప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు త్రిభాషా విధానాన్ని అమలు చేయడంపై సీబీఎస్ఈ చేసిన ప్రక టనను అన్నామలై వ్యతిరేకించడం, ఆ నోటి ఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేయ డం వంటి అంశాలు ఆయన తన సొంత పార్టీని ప్రారంభించేందుకు సన్నద్ధమవుతూ కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నారనే ఊహాగానాలకు మరింత ఆజ్యం పోశాయి. దీంతో



తమిళనాడులో మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. డీఎంకేపై దూకుడుగా 2021లో తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అన్నామలై అప్పటి అధికార డీఎంకే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ అనేక సమావేశాలు నిర్వహించారు, అలాగే 'ఎన్ మణ్ ఎన్ మక్కల్' (నా నేల, నా ప్రజలు) పేరిట పాదయాత్ర చేశారు. డీఎంకే ప్రభుత్వంలో అవినీతి జరుగుతోందంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ విమర్శలు ప్రజల్లో బాగా చర్చనీయాంశం అయ్యాయి. దీని ఫలితంగా అన్నామలైపై డీఎంకే పరువునష్టం దావా కూడా వేసింది. 2021లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం టీటీవీ దినకరన్, మాజీ ముఖ్యమంత్రి ఓ. పన్నీర్‌సెల్వంలను అన్నాడీఎం కేలోకి తీసుకురావడంలో కూడా అన్నామలై కీలక పాత్ర పోషించారు. బీజేపీతో విభేదాలు ఎప్పుడు మొదలంటే? 2026 తమిళనాడు శాసనసభ ఎన్నికలకు ముందు అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకోవాలని బీజేపీ నిర్ణయిం చింది. ఆ సమయంలో అన్నామలైని తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించింది. నైనార్ నాగేంద్రన్‌ను కొత్త బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించింది. తన స్థానంలో నాగేంద్రన్‌ను రాష్ట్ర బీజేపీ చీఫ్‌గా నియమించినప్పటి నుంచి ఆయన బీజేపీతో అంటిముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనట్లేదు. ఈ అంతర్గత విభేదాలకు నిదర్శనంగానే ఇటీవల జరిగిన తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయకూడదని అన్నామలై నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అన్నామలై పోటీ చేయాలని బీజేపీ జాతీయ నాయకత్వం పదేపదే పట్టుపట్టినప్పట ికీ, ఆయన ఆ అభ్యర్థనను పూర్తిగా తిరస్కరించారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి మూడో స్థానానికి పరిమితం అయ్యింది. బీజేపీ కేవలం ఒక్క నియోజక వర్గంలో మాత్రమే విజయం సాధించింది. ఈ నేపథ్యంలో అన్నామలై తన పుట్టినరోజున (జూన్ 4వ తేదీన) 'మక్కల్ శక్తి అయ్యక్కం' అనే తాత్కాలిక పేరుతో ఒక కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించ నున్నారని గత వారం రోజులుగా ఊహాగానాలు వినిపిస్తున్నా యి. అయితే అన్నామలైకి పార్టీలో మరింత కీలకమైన బాధ్యతలు అప్పగించే అవకాశం ఉండడంతో ఆయన పార్టీని వీడే అవకాశం లేదని బీజేపీకి చెందిన ఒక వర్గం తెలిపింది. విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగంకు ప్రత్యామ్నాయంగా అన్నామలై కొత్త పార్టీని స్థాపించాలని కోయంబత్తూరులోని ఆయన మద్దతుదారులలో కొందరు అభిప్రాయపడుతు న్నారు. కోయంబత్తూరు వీధుల్లో అన్నామలై ఫొటోలతో ఉన్న పోస్టర్లను పెట్టారు. మంచి ఉద్యోగాన్ని వదులుకుని!ఐపీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసిన అన్నామలై కొన్నేళ్ల క్రితం బీజేపీలో చేరారు. అనతి కాలంలో పార్టీపై పట్టు సాధించి తమిళనాడు బీజేపీ యూనిట్‌కు అధ్యక్షుడు అయ్యారు. ఆ తర్వాత విపక్షాలను ఎండగడుతూ పార్టీని ముందుకు తీసుకెళ్లారు. అయితే తాజాగా ఆయన కాషాయ పార్టీని వీడనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒక వేళ అన్నామలై బీజేపీని వీడితే ఆ పార్టీని చాలా

# డ్రగ్స్ నియంత్రణే ధ్యేయం : హైదరాబాద్ సిటీ పోలీస్

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, జూన్ 2 (పీపుల్స్ న్యూస్) :**









హైదరాబాద్ నగరాన్ని డ్రగ్స్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ చట్టాన్ని అమలు చేసే పోలీసు విభాగాలకు పూర్తి స్థాయిలో సహకరించాలని హైదరాబాద్ సిటీ పోలీస్ టాస్క్‌ఫోర్స్ హైదరాబాద్ సిటీ పోలీస్ విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై సాగుతున్న నిరంతర నిఘా , ఉక్కుపాదంలో భాగంగా.. ఇటీవల కాలంలో డ్రగ్స్ అలవాటు పడిన 100 మంది వినియోగదారులు , పెద్దర్లకు కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ (శంషాబాద్ మరియు రాజేంద్రనగర్ జోన్లు) ఆధ్వర్యంలో ఒక సమగ్ర కౌన్సిలింగ్ , పునరావాస సదస్సును నిర్వహించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో , పరిసర ప్రాంతాలలో డ్రగ్స్, గంజాయి మహమ్మారిని పూర్తిగా నిర్మూలించాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. వ్యసనాలకు బానిసలైన వారు ఆ అలవాట్ల నుండి బయటపడి, తిరిగి సమాజంలో గౌరవప్రదమైన సాధారణ జీవితాన్ని గడపడానికి అవసరమైన ప్రేరణను అందించడమే లక్ష్యంగా ఈ సదస్సు సాగింది. ఈ కౌన్సిలింగ్ సదస్సులో ప్రముఖ నిపుణులు హాజరై, హాజరైన వారికి విలువైన అవగాహన కల్పించారు. శంషాబాద్ మరియు రాజేంద్రనగర్ జోన్ల టాస్క్‌ఫోర్స్ అధికారుల సమన్వయంతో, ఇన్‌స్పెక్టర్ కె. వెంకట్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ కె. రవి , వారి బృందం ఈ కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా పర్యవేక్షించారు.

# అనవసర బలవంతం తగదు.



**తిరువనంతపురం:** కేరళలో 'వందేమాతరం' గేయంపై వివాదం చెలరేగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వందేమాతరం గేయంలోని ఐదు చరణాలతో పూర్తి గేయాన్ని పాడాలని ఆదేశించడం అనవసరమైన బలవంతమవుతుందని అభిప్రాయపడ్డారు. వందేమాతరం గేయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవిస్తారని, అయితే ప్రతి కార్యక్రమంలోనూ పూర్తి గేయం పాడాలంటూ తప్పనిసరి చేయడాన్ని సమర్థించడం కష్టమని అన్నారు'వందేమాతరం జాతీయ గేయం. దీనిని ఆలపించేటప్పుడు గౌరవంతో లేచి నిలబడతాం. మొదటి రెండు శ్లోకాలు జాతీయగీతానికి సమానమైన గౌరవాన్ని ఇస్తాయి. చాలా మందికి నోటికి కూడా వచ్చి ఉంటుంది' అని శశిథరూర్ పేర్కొన్నారు. సాంప్రదాయబద్ధంగా వందేమాతరం గేయాన్ని కార్యక్రమం ప్రారంభంలో పాడతారని, జాతీయగీతాన్నిచివర్లో పాడతారని అన్నారు. అయితే ఇప్పుడు వందేమాతరం గేయంలోని ఐదు శ్లోకాలను ఈవెంట్ ప్రారంభంలో, మళ్లీ చివరల్లో పాడాలని అంటున్నారనీ, ఇది బలవంతంగా రుద్దడమే అవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ఉక్రెయిన్ నగరాలపై రష్యా భీకర దాడి.. 9 మంది మృతి



**కీవ్:** మిస్సైళ్లు, డ్రోన్లతో ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై మంగళవారం రాత్రి రష్యా దాడి చేసింది. కీవ్‌తో పాటు పలు నగరాలపై దాడులు జరిగాయి. ఆ దాడుల్లో సుమారు 9 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. బిల్డింగ్ శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నట్లు తెలుస్తోంది. సుమారు 29 మంది గాయపడినట్లు సమాచారం ఉంది. కీవ్‌లో రెసిడెన్షియల్ బిల్డింగ్‌లు డ్యామేజ్ అయ్యాయి. కొన్ని పాక్షికంగా కూలిపోయాయి. దీంతో ఆ శిథిలాల్లో స్థానికులు చిక్కుకున్నారు. కీవ్‌లో అనేక జిల్లాలో ఆ దాడులు ప్రభావం చూపినట్లు సైనిక అధికారి తైముర్ తాచెంకో తెలిపారు. దిన్ప్రోలో అయిదుగురు మృతిచెందారు. అక్కడ 25 మంది గాయపడ్డారు. కీవ్‌లో నలుగురు మృతిచెందారు. 51 మంది గాయపడ్డారు. రెండు బహుళ అంతస్థుల భవనాలు దెబ్బతిన్నాయని కీవ్ విటాలీ క్లిచ్‌కోవ్ తెలిపారు. తెల్లవారుజాము వరకు కీవ్‌పై రష్యా దాడులు కొనసాగించింది. డ్రోన్ల శబ్ధం భారీగా వినిపించింది. డజన్ల సంఖ్యలో భారీగా డ్రోన్ల పేలుళ్లు జరిగాయి.

# జూన్ 4న కేరళలోకి నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా భారీ వర్షాలు

**కేరళ:** దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు స్వల్ప ఆలస్యంతో కేరళలోకి ప్రవేశించేందుకు సిద్ధమ వుతున్నాయి. భారత వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం జూన్ 4న కేరళ తీరాన్ని రుతుపవనాలు తాకే అవకాశం ఉంది. దీంతో దేశంలో అధికారికంగా వర్షాకాలం ప్రారంభం కానుంది. రుతుపవనాల రాకతో దక్షిణ భారత రాష్ట్రాల్లో వచ్చే ఆరు నుంచి ఏడు రోజుల పాటు విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా కేరళలో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 7 సెంటీమీటర్ల నుంచి 20 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని



అధికారులు వెల్లడించారు. అరేబియా సముద్రం మీదుగా తేమతో కూడిన గాలులు బలపడుతుం డటంతో రుతుపవనాల కదలిక వేగవంతమవు తోంది. దీని ప్రభావంతో కేరళతో పాటు తమి ళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశముం దని హెచ్చరించింది. అయితే రుతుపవనాల ప్రారంభంతో పాటు పలు ప్రాంతాల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితులు కూడా ఏర్పడే అవకాశ ముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దేశంలోని వాయువ్య, మధ్య, తూర్పు ప్రాంతాలతో పాటు దక్షిణ ద్వీపకల్ప ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురుగాలుల వేగం గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని అంచనా వేసింది. దీంతో విద్యుత్ స్తంభాలు, తాత్కాలిక నిర్మాణాలు, వ్యవసాయ పంటలకు నష్టం కలిగే అవకాశం ఉందని పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, స్థానిక అధికారుల సూచనలు పాటించాలని సూచించింది. ఉత్తరాదిలోని దిల్లీ- ఎన్‌సీఆర్, రాజస్థాన్, పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో ఇటీవల నమో దైన తీవ్ర ఎండల నుంచి ఉపశమనం కొనసా గనుంది. ఆ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపు లతో కూడిన వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించి ంది. గత కొన్ని రోజులుగా అక్కడ గరిష్ఠ ఉష్ణోగ్ర తలు తగ్గుముఖం పట్టినట్లు తెలిపింది. అదేవిధ ంగా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి మధ్య భారత రాష్ట్రాల్లో కూడా వర్షాలు కురిసే అవక శాలు కనిపిస్తున్నాయి. తూర్పు భారతదేశంలోని బిహార్, ఝార్ఖండ్, బంగాల్‌లో రాష్ట్రాల్లో ఉరు ములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం అధికారులు అంచనా వేస్తున్నారు.

# పెట్రోల్ రేషనింగ్ పెడితేనే మేలు !

చమురు మంటలు చల్లారేలా లేవు. ఇప్పటికే వరుసగా నాలుగుసార్లు పెట్రో ధరలను పెంచేశారు. వాణిజ్య సిలిండర్ ధరలు అమాంతంగా పైకి ఎగబాకాయి. పెట్రో సంక్షోభం ఇంకెన్నాళ్లో తెలియదు. అంతర్జాతీయం గా ముడి చమురు ధరలు పెరగడంతో భారత్ లాంటి దేశాలకు గుదిబండగా మారింది. ధరల దాడి ఇప్పట్లో ఆగేలా లేదు. పొదుపు మంత్రం పాటించిన ప్రధాని మోడీ అన్నింటా విఫలం అవుతోంది. పొదుపు ప్రభుత్వంలో కానరావడం లేదు. ధరలను అదుపు చేసే చిత్తశుద్ది కనిపించడం లేదు. పెట్రో ధరలతో అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఉప్పులు, పప్పులు మొదలుకుని అన్నీ పెరుగుతున్నాయి. వంటనూనెల ధరలు సలసల కాగుతున్నాయి. వీటిపై సమీక్షించాల్సిన కేంద్రం మిన్నకుంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగినా, వాటి డిమాండ్ తగ్గడం లేదు. ఎందుకంటే ప్రతి ఒక్కరికీ పెట్రో, డీజిల్, గ్యాస్ అనివార్యం అయ్యింది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగడంతో వినియోగదారులు వేరే సరుకుల కొనుగోలు తగ్గించి పెట్రో ఉత్పత్తులను కొనుగోలు చేస్తారు. అందుచేత పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగి నప్పుడు వాటి డిమాండ్ తగ్గకపోగా ఇతర సరుకుల డిమాండ్ పడిపోతుంది. దాని ఫలితంగా ఆర్థిక వ్యవస్థ మాంద్యం దిశగా అడుగులు వేస్తుంది. చమురు ఉత్పత్తుల సరఫరా ఎంతగా తగ్గితే అంతగా వాటి ధరలు పెరుగుతాయి. తగ్గిపోయిన సరఫరాకు తగ్గట్టు వాటి డిమాండ్ తగ్గిపోవాలంటే అంత ఎక్కువగా వాటి ధరలు పెరగాలి. అప్పుడు ఆర్థిక వ్యవస్థ అంత తీవ్రంగా మాంద్యంలో కూరుకుపోతుంది. దీనిపై ఆర్‌బిఐ గానీ, కేంద్రం కానీ సమీక్షించి చర్యలకు ఉపక్రమించడం లేదు. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధంతో ప్రపంచ ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కు దాటేసింది. ప్రజలపైకి పెరిగిన చమురు భారాలను నెట్టడం అనివార్యంగా అనుసరిస్తున్నారు. ధరలు పెంయడం మినహా మిగతా చర్యలపై కేంద్రంలోని ఏ పాలకులు ఆలోచన చేయడం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థ గురించి వారి అవగాహన రాహిత్యం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవాలి. చమురు ధరలు పెరగడం అనేది దాని సరఫరా తగ్గినందువలన సంభవించేది కాదు. నిజానికి ఇప్పుడు ఒకవైపు యుద్ధం కొనసాగుతున్నా, చమురు నిల్వలు సరఫరాను కొనసాగించగల స్థాయిలోనే ఉన్నాయి. చమురు నిల్వలకు కొరత ఏర్పడబోతుందన్న అంచనాలతో ధరలు పెంచేస్తున్నారు. సరఫరా తగ్గడం, అంతర్ఆజతీయంగా బ్యారెల్ ధరలు పెరగడంతో ఆ భారం ప్రజలపై నెట్టేస్తున్నారు. వాస్తవానికి ఆర్థిక మాంద్యం వల్లే చమురు సరఫరాకు, డిమాండ్‌కు మధ్య సమతూకం ఏర్పడుతుంది. పెట్రో కొరత ఏర్పడినప్పుడు విచ్చలవిడి వినయోగాన్ని అదుపు చేయాలి. ప్రధానంగా సంపన్న వర్గాల వినియోగాన్ని నియంత్రించాలి. చమురు దిగుమతులు తగ్గినప్పుడు ఆ ప్రభావం వలన వినిమయం కూడా తగ్గిపోయి, ప్రత్యామ్నాయాల వైపు దృష్టి మళ్ళి దేశీయ ఉత్పత్తుల కోసం డిమాండ్ పెరుగుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థ మీద ఈ విధానం




ప్రభావం చూపుతుంది. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరిగినప్పుడు దేశీయంగా పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచకపోతే ఆ పెట్రో ఉత్పత్తులను దేశీయంగా ఉత్పత్తి చేసేవారు. పంపిణీ చేసేవారు నష్టపోతారు. ఆ నష్టాన్ని ప్రభుత్వం సబ్సిడీ ద్వారా భరించవచ్చు. అప్పుడు చమురు దిగుమతులకు మనం డాలర్ల రూపంలో చెల్లించవలసినది 8 శాతం పెరుగుతుంది. పెట్రో ఉత్పత్తుల రేషనింగ్ ద్వారా సంపన్నుల వినిమయాన్ని అదుపు చేస్తే అప్పుడు వారి వినిమయం వేరే ఉత్పత్తులవైపు మరలుతుంది. ఉపాధి కూడా పెరగవచ్చు. అంతే కాదు, శ్రామిక ప్రజల కొనుగోలు శక్తి, జీవన ప్రమాణాలు పడిపోకుండా నిలబడతాయి. కేవలం సంపన్నుల వినిమయాన్ని మాత్రమే రేషనింగ్ ద్వారా అదుపు చేస్తే దానివల్లే పెట్రో వినిమయం అవసరమైన మోతాదు మేరకు తగ్గిపోతుందని కూడా చెప్పలేము. ఇది అందరికీ వర్తించాలి. ఇక్కడ మోడీ ప్రకటించిన పొదుపును అందరూ పాటించేలా తప్పనిసరి చేయాలి. పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచడం గాని, తద్వారా కోట్లాదిమంది ప్రజల మీద భారాలను మోపడం కాని, దేశ ఆర్థిక వ్యవస్థలో మాంద్యం పెరగడానికి దోహదపడుతుంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగడంతో, తక్కిన ఉత్పత్తుల వినియోగం బాగా తగ్గిపోయింది. పైగా వినియోగదారులే పెట్రో ధరల పెంపు భారాన్ని కూడా భరించవలసి వచ్చింది. దాంతో సర్వత్రా ద్రవ్యోల్బణ పరిస్థితులు నెలకొన్నాయి. ఢిల్లీలో కాలుష్యాన్ని కంట్రోల్ చేయడానికి వాహనాలపై ఆంక్షలు విధించారు. ఇప్పుడు పెట్రోల్ కోసం కూడా ఇలా అంక్షలు విధించి ప్రజలను భాగస్వాములను చేయాలి. తగిన పద్ధతిలో కట్టుదిట్టంగా దానిని అమలు చేయడం సాధ్యమే. ఇలా చయడంతో పాటు, కాలర్ల అమ్మకాలనపైనా ఆంక్షలు విధించాలి. దీంతో పెట్రో ఆదాతో పాటు, కాలుష్యం కూడా తగ్గగలదు. ఎన్నో ప్రత్యమ్నాయ పద్ధతులను అధ్యయనం చేయాల్సి ఉంది. అప్పుడే ధరల భారాన్ని ప్రజలపై పడకుండా చూడవచ్చు. నిల్వలు కరిగిపోకుండా చేయవచ్చు.

## సీబీఎస్ఈ అన్ స్క్రీన్ మార్కింగ్ వివాదం

**• నివేదిక కోరిన కేంద్ర ప్రభుత్వం**




న్యూఢిల్లీ,జూన్2: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఆన్-స్క్రీన్ మార్కింగ్ కు సంబంధించిన వివాదం మరింత ముదురుతోంది. కోఎంప్ట్ ఎడ్యుటెక్ సంస్థకు కాంట్రాక్ట్ కేటాయించిన విధానంపై సీబీఎస్ఈ నుంచి కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పూర్తి నివేదిక కోరింది. ఈ వ్యవహారంలో అవకతవకలు జరిగాయని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రం హెచ్చరించింది. కోఎంప్ట్ కు కాంట్రాక్టును కేటాయించేటప్పుడు అనుసరించిన విధానాలు, నిర్ణయం తీసుకునే ప్రక్రియలో పాల్గొన్న అధికారులతో సహా, టెండర్ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని సీబీఎస్ఈని మంత్రిత్వ శాఖ కోరింది. తొలిసారిగా అమలు చేసిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ విధానంపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వేల ఫిర్యాదులు వచ్చాయి. కొన్ని సమాధాన పత్రాలు సరిగా స్కాన్ కాకపోవడం, పేజీలు కనిపించకపోవడం, మార్కుల లెక్కల్లో పొరపాట్లు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. కొన్ని వేల జవాబు పత్రాలను తిరిగి మాన్యువల్‌గా మూల్యాంకనం చేయాల్సి వచ్చింది . వివాదం రాజకీయ రంగు కూడా పులుముకుంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు (అఃౕుఇ బిినిటిస ఇనీనిబిసనీలిసబా). ఓఎస్ఎమ్ టెండర్ ప్రక్రియలో మార్పులు చేసి కోఎంప్ట్‌కు అనుకూలంగా నిబంధనలను సడలించారని ఆరోపించారు. టెండర్ నిబంధనల్లో పలు మార్పులు జరిగాయని, దీంతో సంస్థకు అర్హత లభించిందని ఆయన పేర్కొన్నారు. సీబీఎస్ఈ ఈ ఆరోపణలను ఖండించింది. అన్ని నిబంధనలను అనుసరించే కాంట్రాక్ట్ కేటాయించామని, ఎలాంటి అవకతవకలూ జరగలేదని పేర్కొంది. ఈ మొత్తం వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ అంతర్గత విచారణకు ఆదేశించింది.

## అమెరికాలో కాల్పుల కలకలం

**- మస్కటీన్‌లో కాల్పులకు ఏడుగురు మృతి**



**వాషింగ్టన్,జూన్2:** అమెరికాలో వరుస కాల్పుల ఘటనలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. తాజాగా అయోవాలో మస్కటీన్‌లోని పలు ప్రాంతాల్లో కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. వారిలో అనుమానిత నిందితుడు కూడా ఉన్నట్లు మస్కటీన్ పోలీసులు తెలిపారు. 210 పార్క్ అవెన్యూలోని ఓ నివాసంలో కాల్పులు జరిగాయని పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు, వైద్యసిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొన్నారు. అక్కడ తుపాకీ గాయాలతో ఉన్న నలుగురిని గుర్తించారు. వారిని ఆస్పత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయారు. మస్కటీన్‌కు చెందిన ర్యాన్ విల్లీస్ (52)ను నిందితుడిగా గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొనేలోపే అతడు అక్కడినుంచి పరారయ్యాడు. అతడి కోసం గాలిస్తుండగా.. మరో ప్రాంతంలో విల్లీస్ తుపాకీతో కాల్చుకొని ప్రాణాలు కోల్పోయాడు. ఇక, మస్కటీన్‌లోని ఓ నివాసంలో, గ్రాండ్‌వ్యూ అవెన్యూలోని ఓ వ్యాపార సముదాయంలో తుపాకీ గాయాలతో ఇద్దరు వ్యక్తులు మరణించారు. ఒక కుటుంబంలోని వివాదం వల్ల ఈ కాల్పులు జరిగాయని ప్రాథమిక దర్యాప్తులో తెలిసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

## కట్‌మనీ వ్యవహారంపై విమర్శలు

**• వసూళ్లను వెనక్కి ఇచ్చేస్తున్న టిఎంసి నేతలు**

**కోల్‌కతా,జూన్2:** పశ్చిమబెంగాల్‌లో పదిహేనేళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలన ఎన్నో అవినీతి ఆరోపణలను మూటగట్టుకుంది. ముఖ్యంగా సామాన్య ప్రజల నుంచి తృణమూల్ నేతలు, కార్యకర్తలు 'కట్ మనీ' పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఎప్పట్నుంచో ఉన్నాయి. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ అధికారం కోల్పోయింది. దీంతో తృణమూల్ అగ్ర నేతలపై కూడా ప్రజలు దాడులు చేస్తున్నారు. ఈ దాడుల భయంతో కొందరు తృణమూల్ నేతలు ప్రజాగ్రహాన్ని చల్లబరిచేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. గతంలో తాము వసూలు చేసిన డబ్బును తిరిగి ఇచ్చెయ్యాలని నిర్ణయించు కున్నారు.

బెంగాల్‌లోని కూచ్ బెహార్ జిల్లాలోని మాతాభంగాలోని తృణమూల్ నేతలు గతంలో తాము వసూలు చేసిన డబ్బును ప్రజలకు తిరిగి ఇచ్చేశారు. గ్రామస్తులను ఒక మైదానంలో సమావేశానికి పిలిచి, అక్కడ డబ్బులను పంపిణీ చేశారు. కూచ్ బెహార్ జిల్లాలోని ఓ తృణమూల్ నేత గ్రామస్తుల నుంచి రూ.80 లక్షలు వసూలు చేశాడని, తాజగా అందులో సగం డబ్బును వెనక్కి తిరిగి ఇచ్చేశాడని స్థానిక బీజేపీ నేత తెలిపారు. చాలా గ్రామాల్లో ఇలా 'కట్ మనీ'ని వెనక్కి ఇచ్చేశారట. ప్రజాగ్రహానికి భయపడి తృణమూల్ నేతలు బయటకు రాలేని చోట్ల.. వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులు డబ్బును పంపిణీ చేశారట. ఈ పరిణామం ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## ఇజ్రాయిల్-హిజ్బుల్ మధ్య కాల్పుల విరమణ

**- శాశ్వతంగా కొనసాగాలని ట్రంప్ ఆకాంక్ష**



**వాషింగ్టన్,జూన్2:** ఇజ్రాయెల్, ఇరాన్ మద్దతు ఉన్న హెజ్‌బొల్లా మధ్య జరుగుతున్న ఘర్షణలు శాశ్వతంగా ముగియాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆకాంక్షించారు. ఇరుపక్షాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని ఆయన పేర్కొన్నారు. హెజ్‌బొల్లా-ఇజ్రాయెల్ మధ్య దాడులు ఆగిపోవడంతో శాంతి చర్చల్లో ఇరాన్ చురుకుగా పాల్గొంటోందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతా 'ట్రూత్'లో ఓ పోస్ట్ చేశారు. 'ఇజ్రాయెల్‌పై కాల్పులు ఆపేందుకు హెజ్‌బొల్లా అంగీకరించింది. అలాగే ఇజ్రాయెల్ కూడా హెజ్‌బొల్లాపై దాడులు నిలిపివేయడానికి ఒప్పుకుంది. ఇది ఎంతకాలం కొనసాగుతుందో చూడాలి. ఇది శాశ్వతంగా కొనసాగాలని ఆశిస్తున్నాను' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుతో చాలా మంచి సంభాషణ జరిగిందని ట్రంప్ చెప్పారు. అయితే పరిస్థితి పూర్తిగా ప్రశాంతంగా మారలేదని అంతర్జాతీయ మీడియా నివేదికలు చెబుతున్నాయి. కాల్పుల విరమణ ప్రకటన వచ్చిన తర్వాత కూడా దక్షిణ లెబనాన్ ప్రాంతాల్లో దాడులు, రాకెట్ ప్రయోగాల వార్తలు వెలువడ్డాయి. దీంతో ఈ ఒప్పందం ఎంతకాలం నిలుస్తుందన్న దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా లెబనాన్‌లో ఉద్రిక్తతలు తగ్గించడం అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న చర్చలకు కీలకమని విశ్లేషకులు భావిస్తున్నారు.

## వామ్మో 'జూన్'!

జూన్ నెల వస్తోందంటే ఒకప్పుడు పిల్లల్లో కొత్త తరగతుల ఉత్సాహం, కొత్త పుస్తకాల సువాసన, కొత్త స్నేహాల సందడి కనిపించేది. కానీ, ఇప్పుడు జూన్ పేరు వినగానే తల్లిదండ్రుల గుండెల్లో గుబులు మొదలవుతోంది. పిల్లల చదువు కోసం డబ్బు ఎంత సమకూర్చాలి? ఫీజులు ఎంత పెరిగాయి? పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంల కోసం ఇంకెంత ఖర్చవుతుంది? -- ఈ ప్రశ్నలే వారిని వేధిస్తున్నాయి. ఓవైపు అంతర్జాతీయంగా యుద్ధ ప్రభావంతో పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయి. మరోవైపు ఈఎంఐలు, అప్పులు, కుటుంబ పోషణకే నెలజీతం సరిపోని పరిస్థితి ఉంది. ఇలాంటి స్థితిలో పిల్లల భవిష్యత్తు కోసం పడుతున్న ఈ ఆర్థిక పోరాటం జూన్‌లో మరింత తీవ్రంగా మారుతోంది. ఈ రోజు పిల్లలను పాఠశాలలకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారంటే -- అది ముమ్మాటికీ పాలకుల వైఫల్యమే తప్ప వేరేకాదు ప్రభుత్వాలు విద్యను మౌలిక హక్కుగా చెబుతున్నప్పటికీ, ఆచరణలో విద్య క్రమంగా వ్యాపార వస్తువుగా మారిపోవడం విచారకరం. ముఖ్యంగా ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రతి ఏడాది ఫీజులను ఇష్టానుసారంగా పెంచడం తల్లిదండ్రులకు అదనపు భారం హైదరాబాద్‌లోని ఒక ప్రయివేటు పాఠశాలలో ఒకటో తరగతి ఫీజు అక్ష?రాల రెండులక్ష?ల నలభై వేల రూపాయలు నిజంగా ఆశ్చర్యం. ఒక్కఫీజే కాదు, ట్యూషన్ ఫీజు, అడ్మిషన్ ఫీజు, ల్యాబ్ ఫీజు, యాక్టివిటీ ఫీజు, ట్రాన్స్‌పోర్టు ఫీజు, డిజిటల్ క్లాస్‌రూమ్ ఫీజు అంటూ ఏడదంతా వసూళ్ల పర్వం నడుస్తూనే ఉంటుంది. ఫీజుల సమస్యతో పాటు పుస్తకాల భారం కూడా పెరుగుతోంది. పాఠ్యపుస్తకాలతో పాటు అదనపు నోటుబుక్స్, వర్క్‌బుక్స్, ప్రాక్టీస్ మెటీరియల్ పేరుతో వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. చాలాచోట్ల పాఠశాల యాజమాన్యాలే నిర్దేశించిన దుకాణాల నుంచి మాత్రమే పుస్తకాలు కొనాలని ఒత్తిడి చేస్తున్నాయి. మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే




అవకాశం ఉన్నా, తల్లిదండ్రులకు ఆ స్వేచ్ఛ ఉండటం లేదు. విద్యార్థుల భుజాలపై మోయలేని పుస్తకాల బరువు పెరుగుతుంటే, కుటుంబాలపై ఆర్థిక భారం మరింత పెరుగుతోంది. కొన్ని పాఠశాలల్లో యాజమాన్యాలే పుస్తకాల అమ్మకానికి తెరదీశాయి. తల్లిదండ్రుల స్థానంలో ఉండి ఆలోచిస్తేనే వారి ఆవేదన అర్థమవు తుంది. ఒకేసారి ఫీజులు చెల్లించాలి. పుస్తకాలు కొనాలి. యూనిఫాంలు సిద్ధం చేయాలి. రవాణా ఖర్చులు భరించాలి. చాలామంది ఇది పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిగా మారుతోంది. ఈ పరిస్థితులకు ప్రధాన కారణం ఫీజుల నియంత్రణపై ప్రభుత్వాల నిర్లక్ష్యం. చాలా ఏండ్లుగా ప్రయివేటు విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే సమగ్ర చట్టం అవసరమని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల కమిటీలు డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వంటి చోట ఫీజులు తగ్గించాలని ఆందోళనకు కూడా దిగారు. కోర్టులు కూడా పలుమార్లు ప్రభుత్వాలకు మార్గదర్శకాలి చ్చాయి. అయినప్పటికీ కఠినమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో పాలకులు విఫలమవు తున్నారు. విద్యారంగంలో పెరుగుతున్న వ్యాపార ధోరణి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి? ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తే ఈ పరిస్థితి ఉండేది.

బుధవారం, జూన్ 03, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# గురు సంచారంతో పుష్కరాలు ఎలా వస్తాయి? ద్వాదశ రాశులతో వాటి సంబంధం ఏంటి?



ప్రతి పన్నెండేళ్లకోసారి ప్రతి నదికి పుష్కరాలు వస్తాయి. ప్రతి సంవత్సరం భారతదేశంలోని పుణ్యనదుల్లో ఏదో ఒక నదికి పుష్కరాలు వస్తాయి. ఈ ఏడాది యమునా నదికి పుష్క రాలు రానున్న నేపథ్యంలో అసలు పుష్కరం అంటే ఏంటి, పుష్కరాలు ఎలా ఏర్పడుతాయి, పుష్క రాలకు, ద్వాదశ రాశులకు ఉన్న సంబంధం ఏంటి అనే విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

**పుష్కరం అంటే ఏంటి?**

నదులను దేవతలుగా ఆరాధించే గొప్ప సంప్రదాయం మన సొంతం

ప్రాణికోటి సమస్తం మనుగడకు ఆధారం జలం. జలం పుట్టిన తరవాతే జీవకోటి ఉద్భవించింది. జలాధారాల వెంటనే తొలుత నాగరీకత విస్తరించింది. అలాంటి జలాన్ని దేవత రూపాలనిచ్చి తల్లిగా ఆరాధించడం హిందూ సంప్రదాయం. అలాగే నదీ స్నానాలు, సముద్ర స్నానాలు, మంగళ స్నానాలు పేరిట హిందూ సాంప్రదాయం మొత్తం నీటితో ముడి పడి ఉంది. అలాగే తీర్థయాత్రలు పేరిట పుణ్యక్షేత్రాల దర్శనం కూడా నీటితో ముడిపడి ఉంది. నదీ స్నానాలలో పుష్కర స్నానం పుణ్యప్రదమని హిందువుల విశ్వాసం. జీవరాశులకు ప్రధానమైన జలం, స్నానం ప్రాముఖ్యతను గుర్తు చేసేవే పుష్కరాలు. ఈ సందర్భంగా పుష్కరం అంటే ఏమిటో చూద్దాం.

**పుష్కరం అంటే ఏమిటి?**

పుష్కరం అంటే పన్నెండు సంవత్సరాల కాలం. ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి భారతదేశంలో 12 ముఖ్యమైన నదులన్నింటికీ 'పుష్కరాలు' వస్తాయి. పుష్కర సమయంలో ఆయా నదులలో స్నానం చేస్తే ప్రత్యేక పుణ్యఫలం ప్రాప్తిస్తుందని హిందువులు భావిస్తారు. ఈ సందర్భంగా అసలు నదికి పుష్కరాలు ఎలా వస్తాయో చూద్దాం.

**గురు సంచారంతో ఏర్పడే పుష్కరాలు?**

ప్రతి సంవత్సరం దేవ గురువు బృహస్పతి ఒక రాశి నుంచి ఇంకో రాశిలోకి ప్రయాణిస్తుంటాడు. ఇలా గురువు రాశి మార్చుకున్నప్పుడల్లా ఒక్కో నదికి పుష్కరాలు వస్తుంటాయి. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం మనకు ద్వాదశ రాశులున్నాయి. బృహస్పతి ఒక్కో రాశిలో ప్రవేశించినప్పుడు ఒక్కో రాశికి పుష్కరాలు వస్తాయి. ఈ సందర్భంగా బృహస్పతి ఏ రాశిలో ప్రవేశిస్తే ఏ నదికి పుష్కరాలు వస్తాయో చూద్దాం.

**బృహస్పతి మేష రాశిలోకి ప్రవేశించినప్పుడు గంగా నదికి పుష్కరాలు వస్తాయి.**

బృహస్పతి వృషభ రాశిలోకి ప్రవేశించినప్పుడు నర్మదా నదికి పుష్కరాలు వస్తాయి.

బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించినప్పుడు సరస్వతి నదికి పుష్కరాలు వస్తాయి.

బృహస్పతి కర్కాటక రాశిలోకి ప్రవేశించినప్పుడు యమునా నదికి పుష్కరాలు వస్తాయి.

బృహస్పతి సింహ రాశిలోకి ప్రవేశించినప్పుడు గోదావరి నదికి పుష్కరాలు వస్తాయి.

బృహస్పతి కన్య రాశిలోకి ప్రవేశించినప్పుడు కృష్ణా నదికి పుష్కరాలు వస్తాయి.

బృహస్పతి తులా రాశిలోకి ప్రవేశించినప్పుడు కావేరి నదికి పుష్కరాలు వస్తాయి.

బృహస్పతి వృశ్చిక రాశిలోకి ప్రవేశించినప్పుడు భీమా అమరజ నదికి పుష్కరాలు వస్తాయి.

బృహస్పతి ధనుస్సు రాశిలోకి ప్రవేశించినప్పుడు రాజస్థాన్ లోని పుష్కరానికే పుష్కరాలు వస్తాయి.

బృహస్పతి మకర రాశిలోకి ప్రవేశించినప్పుడు తుంగభద్రా నదికి పుష్కరాలు వస్తాయి.

బృహస్పతి కుంభ రాశిలోకి ప్రవేశించినప్పుడు సింధు నదికి పుష్కరాలు వస్తాయి.

బృహస్పతి మీన రాశిలోకి ప్రవేశించినప్పుడు ప్రాణహిత నదికి పుష్కరాలు వస్తాయి.

'ఆది', 'అంత్య' పుష్కరాలు!

బృహస్పతి ఆయా రాశులలో ప్రవేశించినప్పుడు ఆయా నదికి పుష్కరాలు వస్తాయి. బృహస్పతి ఆ రాశిలో ఉన్నంత కాలం ఆ నది పుష్కరంలో ఉన్నట్టే. పుష్కరకాలం సాధారణంగా ఒక సంవత్సరం పాటు ఉన్నప్పటికీ పుష్కర కాలం లోని మొదటి పన్నెండు రోజులను ఆది పుష్కరం అని, చివరి పన్నెండు రోజులను అంత్య పుష్కరం అని వ్యవహరిస్తారు. ఈ మొదటి పన్నెండు రోజులు, చివరి పన్నెండు రోజులు మరింత ప్రత్యేకమైనవి.

**పుష్కర ప్రాశస్త్యం**

పురాణాల ప్రకారం పూర్వం పుష్కరుడు అనే బ్రాహ్మణుడు శివుడి కోసం ఘోర తపస్సు చేసాడు. అతడి భక్తికి మెచ్చిన శివుడు ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకొమ్మన్నాడు. అందుకు పుష్కరుడు, జీవులు చేసిన పాపాలతో నదులు అపవిత్రమవుతున్నాయనీ నదులు పునీతమైతే దేశం సుభిక్షంగా ఉంటుందని ఆలోచించి 'మహదేవా నా శరీర స్పర్శ చే నదులు సర్వం పునీతం అయ్యేట్టు వరమివ్వు' అని ప్రార్థించాడట. అప్పుడు శివుడు 'నీవు ఏ నదిలో ప్రవేశిస్తే ఆ నది పుణ్య తీర్థమవుతుంది. ఆ నదిలో స్నానమాచరించిన వారంతా పాప విముక్తులవుతారు' అని వరమిచ్చాడట!

**పుష్కరత్వం కోసం బ్రహ్మను ప్రార్థించిన బృహస్పతి**

పుష్కరుడు వరం పొందిన సంగతి తెలుసుకున్న బృహస్పతి తనకు కూడా పుష్కరత్వం ప్రసాదించమని బ్రహ్మ గురించి తపస్సు చేస్తాడు. అయితే పుష్కరుడు ఇందుకు అంగీకరించడు. అప్పుడు బ్రహ్మ పుష్కరునికి, బృహస్పతికి నచ్చచెప్పి వారిద్దరికీ సమాన ప్రాతినిధ్యం కల్పించాడట. బృహస్పతి ఏడాదికి ఒక్కో రాశి చొప్పున 12 రాశుల్లో సంచరిస్తాడు. ఆ మేరకు, బృహస్పతి ఆయా రాశుల్లో చేరిన తొలి పన్నెండు రోజులను ఆది పుష్కరాలు గానూ చివరి పన్నెండు రోజులను అంత్య పుష్కరాలు గా వ్యవహరించి పుష్కర వేడుకలు నిర్వహిస్తారు. ఇది పుష్కరాల చరిత్ర! ఇంతటి విశిష్టమైన పుష్కరాలలో మనం కూడా పవిత్ర స్నానాలు చేసి తరిద్దాం.ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే

# యమునోత్రి క్షేత్రం ఎక్కడ ఉంది? యమునా దేవి జన్మ స్థలమైన ఆ పవిత్ర ధామ్ విశేషాలు తెలుసా

హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరు జీవితంలో ఒక్కసారైనా చేయాలని పరితపించే యాత్ర చార్ ధామ్ యాత్ర. హిమాలయ పర్వత సానువుల్లోని గర్వాల్ ప్రాంతంలో వెలసిన గంగోత్రి, యమునోత్రి, కేదారనాథ్, బదరీనాథ్ అనే నాలుగు పుణ్య క్షేత్రాల సందర్శనార్థం చేసే యాత్రను చార్ ధామ్ యాత్ర అంటారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, అత్యంత వ్యయ ప్రయాసల దృష్ట్యా చార్ ధామ్ యాత్ర చాలా కఠినమైన యాత్ర మాత్రమే కాదు ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. జూన్ 2, మంగళవారం నుంచి యమునా నదికి పుష్కరాలు ప్రారంభం కానున్నాయి.ఎవరీ యమున?సాధారణంగా మన నదులన్నీ మహిళా స్వరూపాలుగానే ఉంటాయి. మన పురాణాల ప్రకారం యమున సూర్య భగవానుని కుమార్తె, నరకాధిపతి యమధర్మరాజు సోదరి. అదేవిధంగా శ్రీకృష్ణుని అష్టభార్యలలో ఒకరిగా భావిస్తారు. ఈమెనే కాళింది అని కూడా అంటారు. భాగవతం ప్రకారం శ్రీకృష్ణుడు కాళియ మర్దనం చేసింది యమున నదిలోనే అని అందుకే ఆ విషసర్పం కారణంగా యమున నది జలాలు నల్లగా మారాయని అంటారు. వామన పురాణం ప్రకారం సతీదేవి వియోగంతో దుఃఖితుడైన పరమ శివుడు యమున నదిలోకి దూకగా, ఆయన బాధ, దుఃఖంతో యమునా నదీ జలాలు నల్లగా మారాయని తెలుస్తోంది. ఏది ఏమైనా యమునా నదీ జలాలు నల్లగా ఉంటాయన్న సంగతి ప్రస్ఫుట మవుతోంది.యమునోత్రి ఎక్కడుంది?ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని గర్వాల్ ప్రాంతంలో, సముద్ర మట్టానికి దాదాపు 3,293 మీటర్ల ఎత్తులో యమునోత్రి ఉంది. యమునా నది 'చంపసర్ గ్లేసియర్' మన పురాణాల ప్రకారం కాళింది పర్వతం నుంచి ఉద్భవించింది. యమునోత్రికి ఎలా వెళ్లాలి? ఉత్తరకాశీ నుంచి యమునోత్రికి సుమారు 129 కి.మీ దూరం ఉంటుంది. రోడ్డు మార్గం కొంత ప్రయాణం తర్వాత, జానకి చట్టి నుండి 6 కి.మీ ట్రెక్కింగ్ ద్వారా కానీ, మనుషులు మోసుకెళ్లే డోలీలలో కానీ ఆలయానికి చేరుకోవచ్చు. రిషికేశ్ నుంచి బస్సులో హనుమాన్ చట్టి వరకు



ప్రయాణించవచ్చు. ఇక్కడి నుంచి 14 కి. మీ. దూరంలో ఉన్న యమునోత్రికి వివిధ మార్గాల్లో చేరుకోవచ్చు.ఆలయ విశేషాలుయమునా నది ఉద్భవించిన యమునోత్రికి సమీపంలోనే యమునా దేవి ఆలయం ఉంది. ప్రస్తుతం ఉన్న ఆలయాన్ని 19వ శతాబ్దంలో జైపూర్ మహారాణి గులారియా నిర్మించారు. ఆలయంలో యమునా దేవిని దర్శించుకునే ముందు భక్తులు సమీపంలోని యమునా నదీపాయలో పవిత్ర స్నానాలు ఆచరిస్తారు. అనంతరం భక్తులు యమునా దేవిని దర్శించుకుంటారు. ప్రతి ఏడాది అక్షయ తృతీయ రోజు యమునోత్రి ఆలయం తెరుచుకుంటుంది. తిరిగి దీపావళికి ఈ ఆలయాన్ని మూసేస్తారు. ఈ ఆలయంలో తలుపులు మూయడానికి ముందు వెలిగించిన దీపం ఆరు నెలల తరువాత కూడా వెలుగుతూ దర్శనమివ్వడం విశేషం. అలాగే అమ్మవారికి అలంకరించిన పువ్వులు కూడా తాజాగా చెక్కు చెదరకుండా ఉంటాయి. ఆలయ తలుపులు మూసి ఉంచిన ఆరు నెలల సమయంలో దేవతలు, గంధర్వులు అమ్మవారిని పూజిస్తారని విశ్వాసం.సూర్యకుండంయమునోత్రి ఆలయ ప్రాంగణంలో ఉండే సూర్యకుండం ఇక్కడ మహాత్యానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తుంది. ఎముకలు గడ్డ కట్టే చలిలో కూడా ఈ సూర్యకుండంలో నీరు సెగలు, పొగలతో మరుగుతూ ఉండడం విశేషం. ఆలయ అర్చకులు ఒక తెల్లని పలుచని వస్త్రంలో బియ్యాన్ని మూట కట్టి ఈ గుండంలో 10 నిమిషాలు ఉంచగానే స్వచ్ఛమైన తెల్లని అన్నం సిద్ధమవుతోంది. అలాగే బంగాళాదుంపలు కూడా ఉడికిస్తారు. ఈ అన్నాన్ని, దుంపలను అమ్మవారికి ప్రసాదంగా నివేదించి అనంతరం భక్తులకు పంచి పెడతారు. ఇంత చల్లని ప్రదేశంలో వేడి నీటి బుగ్గ ఎలా ఏర్పడిందో ఎవరికీ అంతు చిక్కని మిస్టరీ! అలాగే ఇక్కడ గౌరీ దేవి స్నానం ఆచరించినట్లుగా భావించే గౌరీకుండ్?ను కూడా భక్తులు దర్శించుకుంటారు. పురాణాల ప్రకారం యమునోత్రి దర్శనం మోక్షానికి ప్రథమ ద్వారమని తెలుస్తోంది. యమునా నది పుష్కరాల సందర్భంగా మనం కూడా యమునోత్రికి వెళ్లి యమునా దేవిని దర్శించుకుని తరిద్దాం.ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# ప్రపంచ నవ్వుల దినోత్సవం" - నవ్వకపోవడంతో ఏం కోల్పోతున్నారో తెలుసా?



"నవ్వడం యోగమో కాదో తెలియదుగానీ.. నవ్వకపోవడం మాత్రం ఖచ్చితంగా రోగమే"! అవును మరి, మనస్ఫూర్తిగా నవ్వితే మెదడులో మన మనసుకు నచ్చిన దోస్తులాంటి బీటా-ఎండార్ఫిన్స్ రిలీజ్ అవుతాయి. బ్రెయిన్?ను ప్రెషర్?లోకి నెట్టే కార్టిసాల్, ఎపినెఫ్రిన్ వంటి ఎనిమీ హార్మోన్స్ తగ్గిపోతాయి. ఫస్ట్ ఇవి రెండూ జరిగితే చాలు, రోజంతా మనస్సు హాయిగా ఉంటుంది. ఇక ఆ తర్వాత అన్నీ లాభాలే అంటే నమ్మాల్సిందే.మరి, ఇంతకీ మీలోని ఆ మనిషి "మర మనిషి"లా ఎందుకు మారిపోతున్నాడట? కేవలం టాస్క్? యాక్సెప్టెడ్?, టాస్క్? కంప్లీటెడ్ అని పలకడానికి మాత్రమే పెదాలను వాడుతూ.. ఎలాంటి ఫీలింగ్స్ లేని రోబో వెర్షన్?లా ఎందుకు బిహేవ్? చేసున్నాడట? ఈ పరిస్థితి లాంగ్? టైమ్?లో ఎలాంటి సమస్యలను.. కాదు కాదు, ఎంతటి ముప్పును తెచ్చి పెడుతుందో ఆ మనిషి కాస్తైనా ఐడియా ఉందా?? మనసులోకి బందిపోట్ల తీరుగా చొరబడే నెగెటివ్ థాట్స్?ను.. ఒఆ మనిషికి తెలుసంటనా..? లేదంటనా?? సరే, ఇప్పటిదాకా జరిగిందేదో జరిగిపోయింది. ఇవాళ "ప్రపంచ నవ్వుల దినోత్సవం". ప్రతి ఏటా మే ఫస్ట్ సండేను ఇలా స్నేంత వరకూ టాస్క్ ఉంటుంది. ఇంకా చెప్పాలంటే జీవించి ఉన్నంత వరకూ ఏదో ఒక టాస్క్? రన్? అవుతూనే ఉంటుంది. దానికి నవ్వడాన్ని ఆపడం ఎందుకు? ఇవి రెండూ వేర్వేరు విషయాలు కదా! మీకు తెలుసా? సీరియస్?గా, మానసిక ఒత్తిడితో పనిచేయడం కన్నా, ఆహ్లాదకర వాతావరణంలో పనిచేస్తే ఔట్? పుట్? క్వాలిటీగా వస్తుందని రీసెర్చ్?లు చెబుతున్నాయి. సంతోషంగా పనిచేసే ఉద్యోగులు ఇతరులకన్నా 13% ఎక్కువ రిజల్ట్? తెస్తున్నారని ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన "సైద్ బిజినెస్ స్కూల్" రీసెర్చ్ వెల్లడించింది. సో.. నీ టాస్క్? పర్ఫెక్ట్?గా కంప్లీట్? కావడానికి కూడా నువ్వు నవ్వాలంట గురూ!చైన్ లింక్..ఇక నీ పర్సనల్?, ఫ్యామిలీ, రిలేషన్స్.. వీటన్నింటినీ బలంగా లింక్? చేసే అత్యంత బలమైన గొలుసు ఏదైనా ఉందంటే, చెబితే నమ్మవుగానీ అది నీ నవ్వేనట! ముఖంలో చిరునవ్వుతో కనిపించే వారిని చూస్తే ఎదుటివారికి ఒక రిలాక్సేషన్? ఫీల్? కలుగుతుందట. అప్రయత్నంగా వారి పెదాలపైనా ఒక స్పార్క్? జనరేట్? అవుతుందట. కాలిఫోర్నియా యూనివర్సిటీ పరిశోధకులు దాదాపు 30 ఏళ్ల పాటు నిర్వహించిన లాంగిట్యూడినల్ అధ్యయనం ప్రకారం.. మనస్ఫూర్తిగా నవ్వుతూ కనిపించే వారు ఇతరులతో పోలిస్తే మెరుగైన మానసిక ఆరోగ్యాన్ని కలిగి ఉంటారని తేల్చింది. నవ్వేవారు అందరికీ నచ్చేస్తారు. అందరికీ లవబుల్? అయిపోతారట. అంతే మరి.. ఎక్కడ చూసినా రాళ్లు కుప్పలు తెప్పలు. రత్నాలు మాత్రమే అక్కడక్కడా! పక్కవాళ్లు కూడా పట్టుకుంటారు.. కాస్త జారనివ్వ బాసూ!

# చదువుల్లో అద్భుతంగా రాణించాలా? పరిహారాలు చేసుకోండిలా!

'ఏకాగ్రత, జ్ఞాపకశక్తి' తగ్గిపోతోందా – ఈ పనులతో మీ బ్రెయిన్ షార్ప్‌గా పనిచేస్తుందట!

జ్ఞాపకాలు పదేపదే గుర్తుకొస్తూ మనల్ని ఉక్కిరిబిక్కిరి చేసే అరుదైన ఆస్తులు. జ్ఞాపకశక్తిని కలిగి ఉండటం ఓ అరుదైన వరం. అదే లేకుంటే మన జీవితానికి ఎలాంటి విలువ లేదు. వ్యక్తి సామాజిక, భావోద్వేగ స్పందనల్లో, అర్థవంతమై పనితీరుల్లో జ్ఞాపకశక్తి కీలక పాత్ర పోషిస్తుంది. మరి ఇంతటి శక్తి సాధనం మన బ్రెయిన్?లో ఎలా పనిచేస్తుంది? ఎప్పుడో జరిగిన సంఘటనల్ని సైతం ఇప్పటికీ ఎలా గుర్తుంచుకుంటుంది? లాంటి విషయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!జ్ఞాపకాలు 3 రకాలు :సెన్సువల్ మెమొరీ : దీన్నే ఇంద్రియ జ్ఞానం లేదా షార్ట్ టర్మ్ మెమొరీ అని కూడా అనొచ్చు. కొన్ని మిల్లీసెకన్లు మాత్రం ఇది ఉంటుంది. వాసన, శబ్దాలు, దృశ్యాలు లాంటి వాటిని అర్థం చేసుకునేంత సేపు మాత్రమే ఈ జ్ఞాపకం పనిచేస్తుంది. కళ్లు, ముక్కు, నాలుక, చెవులు, చర్మం నుంచి వచ్చే సమాచారాన్ని మెదడులోని ఐదు ఇంద్రియా జ్ఞాన ప్రాంతాలు ప్రాసెస్ చేయడానికి ఇది ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు.వర్కింగ్ మెమొరీ : మెదడులోని సమాచారాన్ని కొద్ది సేపు మాత్రమే తాత్కాలికంగా గుర్తుంచుకుని, దాన్ని ఉపయోగించడానికి సహాయపడే మానసిక వ్యవస్థ ఇది. ఎలాగంటే, ఓ వ్యక్తి చెప్పిన మొబైల్ నంబరు లేదా చిరుమానాను రాసే వరకు గుర్తుంచుకుంటుంది. ఇది బలహీనంగా ఉంటే చదవడం, నేర్చుకోవడం, దృష్టి కేంద్రీకరించడంలో ఇబ్బందులు రావొచ్చని నిపుణులు చెబుతున్నారు.లాంగ్ టర్మ్ మెమొరీ : జీవితంలో చోటు చేసుకున్న సంఘటనలు, అలవాట్లు, నైపుణ్యాలు, సమాచారం, అనుభవాలు, వాస్తవాలు, భావోద్వేగ అనుబంధాలు లాంటి వాటిని బ్రెయిన్?లో సుదీర్ఘకాలం నిక్షిప్తం చేసే సామర్థ్యం దీనిది. అపరిమితమైన సమాచారాన్ని ఇది భద్రపరుస్తుందంటున్నారు నిపుణులు. జ్ఞాపకాల్ని స్టోరేజ్ చేయడం, అవసరమైనప్పుడు రీకాల్ చేసుకోవడం దీని విధులని పేర్కొంటున్నారు.మీ పిల్లల్లో ఈ లక్షణాలు ఉన్నాయా? – అయితో పోషకాహర లోపం ఉన్నట్టేనట!వర్కింగ్ మెమొరీ పరిమితం : మనం ఎంత సమర్థంగా చదవగలం, గుర్తుంచు కోగలం అన్న దానిని వర్కింగ్ మెమొరీ నిర్ధారిస్తుందని నిపుణులు చెబుతున్నారు. మన అలవాట్లను మార్చుకోవడం, కొన్ని రకాల సులభతర పద్ధతుల్ని అలవరచుకోవడం ద్వారా వర్కింగ్, దీర్ఘకాల జ్ఞాపకాల సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని అంటున్నారు.ఫోన్లకు దూరంగా జరగండి : స్మార్ట్?ఫోన్లు మీ వర్కింగ్ మెమొరీ సామర్థ్యాన్ని తగ్గిస్తాయని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ముఖ్యంగా, లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేస్తున్నప్పుడు ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుందట. చివరికి ఫోన్ మీకు దగ్గరలో ఉన్నా, సైలెంట్ మోడ్?లో పెట్టినా, జ్ఞాపకశక్తిని అందుకునే సామర్థ్యాన్ని హరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే, మనకు తెలియకుండానే మెదడు స్మార్ట్?ఫోన్ల వైపు లాగుతుంటుంది. కనీసం నోటిఫికేషన్లు అయినా చూద్దామనే భావన మనసులో కలుగుతూ ఉంటుంది. కాబట్టి, ఒక అంశంపై దృష్టి సారించాలనుకున్నప్పుడు ఫోన్?ను దగ్గరలో లేకుండా చూసుకోవాలి.మెదడుతో పరుగులు వద్దు : చదువు, ఉద్యోగం,



ఉద్వేగాల ఒత్తిడి మన బ్రెయిన్?లోని జ్ఞాపకశక్తి జాగాను చాలా వరకు కబ్జా చేస్తాయి. ఏ విషయంలోనైనా మీరు ఆందోళన చెందుతున్నా, పరుగులు తీసే ఆలోచనలతో పక్కదోవ పడుతున్నా, వర్కింగ్ మెమొరీని చాలా వరకు ఖర్చు అవుతుందని నిపుణులు చెబుతున్నారు. మెదడు ఆలోచనల్ని అదుపులో పెట్టుకోవడం, సేదతీరడం లాంటి సాధనాల ద్వారా క్రియాశీలక జ్ఞాపకశక్తిని పెంచుకోవచ్చని, ఒత్తిడిని తగ్గించుకోవచ్చంటున్నారు. యోగా, ధ్యానం, బ్రీతింగ్ టెక్నిక్?లు దీనికి సహాయపడతాయట. ముక్కు ద్వారా లోతైనా శ్వాస తీసుకొని, కొద్ది సేపు ఆపి, నోటి ద్వారా నెమ్మదిగా గాలి వదలడం లాంటి సాధనాలు చేయొచ్చు. ఇలా 5 నిమిషాల పాటు పునరావృతం చేసినట్లయితే నాడీ వ్యవస్థపై ఒత్తిడి తగ్గి, అభ్యసన అవకాశాలు మెరుగుపడతాయని పలు అధ్యయనాల్లో తేలింది. చంకింగ్?ను (విభజన) పాటించండి : పెద్ద సమాచారం లేదా డేటాను చిన్నచిన్న అర్థవంతమైన ముక్కలుగా విభజించి సులభంగా గుర్తు పెట్టుకునే, ప్రాసెస్ చేసే ప్రక్రియను అలవాటు చేసుకోమంటున్నారు నిపుణులు. ఎలాగంటే, కొన్ని ఫోన్ నంబర్లు లేదా జాబితాలు/పదాల్ని గుర్తు పెట్టుకోవాలనుకోండి. వాటిని చిన్న చిన్న ముక్కలుగా విడగొట్టి గ్రూపులుగా మెదడులో భద్రపరచుకుంటే, వాటిని జ్ఞాప్తికి తెచ్చుకోవడం ఈజీ అవుతుంది. ఈ క్రమంలో స్టేజీ ఎక్కి ఒక ప్రజంటేషన్ ఇవ్వాలన్నా ఇదే పద్ధతిని పాటిస్తే, మీరు చెప్పే ముఖ్యమైన పాయింట్లు వినే వారికి చక్కగా అర్థమవుతాయి. అర్థవంతమైన సమాచారాన్ని ఒక క్రమ పద్ధతిలో విభజించే విధానాన్ని అలవరచుకోవడం ఇక్కడ చాలా కీలకం. దీనివల్ల బ్రెయిన్?పై భారం తగ్గి సునాయసంగా జ్ఞాపకం చేసుకోగలుగుతామట.తిరిగి పొందడం అలవరుచుకోండి : ఒక విషయాన్ని నేర్చుకున్న తర్వాత దాన్ని ఎంత త్వరగా మరిచిపోతామో 19వ శతాబ్దంలో జర్మనీ మానసిక శాస్త్రవేత్త హెర్మన్ ఎబింగాస్ (ఆధారాలతో రుజువు చేశారు. మనం నేర్చుకున్న విషయాల్లో కొన్నింటిని కనీసం 30 నిముషాల్లోపే, దాదాపు సగభాగం వరకు మరిచిపోతామని ఆయన శాస్త్రీయంగా నిరూపించారు. మిగిలిన వాటిని మరుసటి రోజుకు మరిచిపోతామని పేర్కొన్నారు. స్వల్ప సమయంలో ఎక్కువ విషయాన్ని నేర్చుకోవాలనుకున్నప్పుడు ఒకసారి విన్న, చూసిన, నేర్చుకున్న దానిని తిరిగి పొందడం ద్వారా సాధన చేయాలన్నారు. నోట్స్?ను మళ్లీ రివిజన్ చేయడానికి బదులుగా వాటిని పక్కనబెట్టి, ముఖ్యమైన భావనల్ని మననం చేసుకోవడానికి ప్రయత్నించాలంటున్నారు నిపుణులు. నోట్స్ చూడకుండా, మీరు ఒక విషయాన్ని వేరొకరికి బోధిస్తున్నట్లుగా, చురుకుగా బిగ్గరగా అంటూ ఉండమని సూచిస్తున్నారుమధ్యలో విరామం తీసుకోండి : ఒకేసారి మొత్తం చదవకండి. విషయాన్ని దీర్ఘకాలికంగా గుర్తుంచుకోవడం కోసం, మధ్యనోట్స్?ను మళ్లీ రివిజన్ చేయడానికి మధ్యలో విరామం తీసుకుంటూ రివిజన్ చేయండి. దీనివల్ల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందంటున్నారు నిపుణులు. కొత్త విషయాన్ని నేర్చుకున్న 2 రోజులు, 7 రోజులు, చివరగా 30 రోజుల తర్వాత రివిజన్ చేయండి. ఈ రోజు, రేపు, ఎల్లుండి చదివి, 7వ రోజున ఆ విషయం గుర్తుందో లేదా తనిఖీ చేయడానికి పేపర్ లేదా కంప్యూటర్?పై రాయండి.సరిగా నిద్రపోండి : గాఢ నిద్రలో జ్ఞాపకాలు స్థిరపడతాయంటున్నారు నిపుణులు. క్రమబద్ధమైన నిద్రవేళలు జ్ఞాపక శక్తి పెరుగుదలకు దోహదపడతాయని సూచిస్తున్నారు.వ్యాయామం : ఏరోబిక్ వ్యాయామం మెదడుకు రక్త ప్రసరణను పెంచి జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుందని పేర్కొంటున్నారు.జ్ఞాపకం అనేది కేవలం మేధస్సుకు సంబంధించిన విషయం ఒక్కటే కాదని, అది వ్యూహానికి సంబంధించిందని తెలియజేస్తున్నారు. మన జీవన విధానంలో, చదువులో, పనిలో చిన్న చిన్న మార్పులు చేసుకుంటే జ్ఞాపక శక్తిని గణనీయంగా మెరుగుపరచుకోవచ్చునని సలహా ఇస్తున్నారు.

ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**కూకట్పల్లి జూన్ 02 :** అల్లాపూర్ 255 డివిజన్ పరిధిలోని వి.రమారావు నగర్ చౌరస్తాలో అల్లాపూర్ 255 డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు లిలక్ష్మణ్ గౌడ్ లి అధ్యక్షన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ , తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు శ్రీ బండి రమేష్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు, అల్లాపూర్ డివిజన్ లోని సీనియర్ నాయకులు మహిళలు , యువకులు , తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా



**కూకట్పల్లి :** కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నియోజకవర్గంలోని కె.పి.హెచ్.బి , రోడ్.నెం.1 దగ్గర జెండా ఆవిష్కరించి తెలంగాణ తల్లికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.. కూకట్పల్లి జూన్ 02 ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాణాలకు తెగించి పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని, ఎంతోమంది అమరవీరుల త్యాగ ఫలితం నేడు వారి త్యాగాన్ని భావితరాలకు తెలియజేసే బాధ్యత మనపై ఉందని గుర్తు చేశారు... ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, పగుడాల శిరీషా బాబు రావు, కృష్ణారెడ్డి, ప్రభాకర్ గౌడ్, సురేష్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...వఅం అవఊం

## వృద్ధురాల పై యువకుడు దాడి...
### వివరాలు సేకరిస్తున్న సిఐ వెంకటేష్ ఎస్సై శ్రీకాంత్..



**గంభీరావుపేట :** మండలం లోని బీసీ కాలనీడబుల్ బెడ్ రూమ్ కాలనీలో వృద్ధురాలపై ఓ యువకుడు దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. వివరాలకు వెళితే బిసి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో బల్క్ నెంబర్ 8 లో రూమ్ నంబర్ 12 గల సాహెబ్ గారి పుష్పలత ( 60) భర్త నాంపల్లి గౌడ్ వృద్ధురాలుపై మధ్యాహ్నం ఎవరు లేని సమయంలో ఓ యువకుడు దాడి చెయ్యగా ఆ వృద్ధురాలికి తనకు తీవ్ర గాయాలతో ప్రాణఆపాయ స్థితిలో కింద పడిపోయి ఉండగా వృద్ధురాలు కొడుకు వచ్చి చూడగా తల్లి రక్తపు మడుగులో కిందపడి ఉండడంతో వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్కు సమాచారం అందించిగా పోలీసులు వెంటనే సం ఘటన స్థలానికి చేరుకొని వృద్ధురాలిని సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. దాడి చేసిన యు వకుడ్ని అదుపులోకి తీసుకొని సీఐ వెంకటేష్ ఎస్సై శ్రీకాంత్. పోలీసు సిబ్బంది దర్యాప్తు చేపట్టారు.

## ఎస్సై జ్యోతి ని మర్యాదపూర్వకంగా కలిసి గాడిచెర్ల రామచంద్రం




**ముస్తాబాద్ :** మండలానికి నూతన సబ్ ఇన్స్పెక్టర్ జి జ్యోతి ని ముదిరాజ్ మండల ఉపాధ్యక్షులు సింగిల్ విండో డైరెక్టర్ గాడిచెర్ల రామచంద్రం ఎస్సై జ్యోతి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ఆమెను శాలువాతో సత్కరించారు.

## మాజీ జెడ్పిటిసి కొమిరిశెట్టి విజయ లక్ష్మణ్. జన్మదిన వేడుకలు

**- వృద్ధులకు భోజనం పంపిణీ**




**/ గంభీరావుపేట మండల :** మాజీ జెడ్పిటిసి సభ్యురాలు కొమిరిశెట్టి విజయ- లక్ష్మణ్ ను జన్మదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మా అనాధ వృద్ధాశ్రమంలో వృద్ధు లతో కేక్ కట్ చేయించి ,ఒక పూట మధ్యాహ్నం భోజనం వడ్డించారు.ఈ సం దర్భంగా వృద్ధులు వారిని ఆశీర్వదించి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇరిగి సందీప్ ,ఎగదండి రవి, ఖుషిగుంపుల కిషన్ గౌడ్ యూసఫ్ అరుణ్ ఉదయ్ అక్షయ్ యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల జీతాలపై ప్రభుత్వం దారిదోపిడీ

**-బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రభా గౌడ్**



**హైదరాబాద్, జూన్ 02 :** ఉద్యోగుల హెల్త్ కేర్ ట్రస్ట్(ఈహెచ్ టీసీ) పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల జీతాల్లో కోతలు విధించి దారిదోపిడీ చేస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రభా గౌడ్ ఆరోపించారు. మంగళవారం నాడిక్కడ నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సరైన విధివిధానాలు, జీఓలు, ఎంపానెల్డ్ ఆసుపత్రుల జాబితా లేకుండానే పథకాన్ని అమలు చేయడం ఉద్యోగులను మోసం చేయడమేనని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భారత్' ద్వారా ఉచిత వైద్యం అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులపై అదనపు భారం మోపుతోందని అన్నారు. హెల్త్ కేర్ ట్రస్ట్కు సంబంధించిన ప్రీమియం పరిమితి, కుటుంబ సభ్యుల అర్హత వంటి అంశాలపై స్పష్టత లేదని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల్లో పెరుగుతున్న అసంతృప్తిని ప్రభుత్వం గుర్తించి, ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభా గౌడ్ డిమాండ్ చేశారు.

# తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గజ్వేల్‌లో బీఆర్ఎస్ వేడుకలు

**- "తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీయే శ్రీరామరక్ష" వంటేరు ప్రతాప్ రెడ్డి"**

**రాయపోల్, 02 జూన్ :**గజ్వేల్ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గజ్వేల్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ పతాకావిష్కరణ, పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ యాదవ్ రెడ్డితో కలిసి గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

అనంతరం గజ్వేల్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణతో పాటు జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వం కీలకమైందని, ఆయన సారథ్యంలో సాగిన ఉద్యమ ఫలితంగానే



ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైందని అన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, రైతు సంక్షేమ పథకాలు, గురుకుల విద్యాసంస్థల విస్తరణ, తాగునీటి సరఫరా, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి వంటి కార్యక్రమాల ద్వారా రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిచిందని తెలిపారు. రైతుబంధు, రైతు బీమా, ఆసరా పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చాయని పేర్కొన్నారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసిన ఆయన, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతుల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి నర్సింగరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మేరా, మండల అధ్యక్షుడు బెండ మధు, మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నోటి దుర్వాసన నలుగుట్లో ఇబ్బంది పెడుతోందా.. అయితే ఈ చిట్కాలు మీ కోసమే..!

నోటి దుర్వాసన చాలామంది ఇబ్బంది పడుతుంటారు. నలుగుట్లో మాట్లాడాలంటే నమోషీగా ఉంటుంది. మన నోటి నుంచి వచ్చే దుర్వాసన కారణంగా ఎదుటివాళ్లు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతుంటారు. జీర్ణకోశం బలంగా లేకపోతే నోటి దుర్వాసన అధికంగా వుంటుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. అయితే ఈ నోటి దుర్వాసన సమస్య నుంచి బయటపడేందుకు కొన్ని చిట్కాలు ఉన్నాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..1. కొబ్బరిపాల (కొబ్బరిని కోరి మెత్తగా రుబ్బి పిండితే వచ్చే రసం) లో తగినంత పచ్చ కర్పూరం వేసుకొని తాగాలి. ఈ కొబ్బరి పాలను పచ్చిగా అయినా తాగవచ్చు, వేడి చేసుకుని అయినా తాగవచ్చు. ఇలా తరచూ చేయడంవల్ల నోటి దుర్వాసన తగ్గుతుంది.2. అదేవిధంగా గజ నిమ్మకాయ (దబ్బ నిమ్మకాయ) ను ముందు నాలుగు ముక్కలుగా కోయాలి. ఆ తర్వాత దాన్ని చిన్న ముక్కలుగా తరుగుకుని, ఒక్కో ముక్కను



దవడకు వేసుకుని చప్పరిస్తే నోరు శుభ్రపడుతుంది. తద్వారా నోటి దుర్వాసన తగ్గుతుంది.3. జాజికాయ, జాపత్రీ, పచ్చ కర్పూరం కొద్దికొద్దిగా తీసుకొని దంచుకోవాలి. అనంతరం ఆ పొడిని ఎండుద్రాక్షలతో కలిపి నూరాలి. ఈ మిశ్రమాన్ని చిన్నచిన్న గోళీల్లా చుట్టుకుని, ఒక్కో గోళిని దవడకు పెట్టుకొని చప్పరిస్తుండాలి. దాంతో క్రమంగా నోటి దుర్వాసన నుంచి ఉపశమనం లభిస్తుంది.4. తరచూ దాల్చిన చెక్క చిన్నముక్కను తీసుకుని దవడకు పెట్టుకుని నములుతుంటే కూడా నోరు శుభ్రంగా పడుతుంది. ఫలితంగా నోటి దుర్వాసన నుంచి ఉపశమనం కలుగుతుంది.5. తమలపాకులు కూడా నోటి దుర్వాసనను పోగొట్టడంలో తోడ్పడుతాయి. ఇవి నాలుకమీద జిగురును హరిస్తాయి. తమలపాకుపై పచ్చకర్పూరం వేసిన కిళ్లీ తింటే నోటిలో మంచి సువాసన వస్తుంది. దాంతో నోటి దుర్వాసన తగ్గుతుంది.6. అంతేగాక ఏలకులు, లవంగం కూడా నోటి దుర్వాసనని తగ్గిస్తాయి. కాబట్టి తరచూ ఏలకులు గానీ, లవంగాలు గానీ నోట్లో వేసుకోవాలి. ముఖ్యంగా నలుగుట్లోకి వెళ్లేటప్పుడు ఇలా ఇబ్బంది నుంచి బయటపడవచ్చు.

# వాతావరణ మార్పుల వల్ల కీళ్ల నొప్పులు పెరుగుతాయా?

వాతావరణంలో అకస్మాత్తుగా వచ్చే మార్పులు కేవలం జలుబు, దగ్గు వంటి సమస్యలకే కాకుండా కీళ్ల ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతాయని నిపుణులు చెబుతున్నారు. మరి ఈ సమస్యను తగ్గించుకోవడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే విషయాలను తెలుసుకుందాం..

ఇంటర్నెట్ డెస్క్: ఇటీవలి కాలంలో దేశంలోని పలు ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు తరచూ మారుతున్నాయి. ఎండలు, వర్షాలు, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఉష్ణోగ్రతలో వచ్చే మార్పులు కొంతమందిలో కీళ్ల నొప్పులను పెంచే అవకాశం ఉంది. ముఖ్యంగా చల్లటి వాతావరణం లేదా తేమ అధికంగా ఉన్న రోజుల్లో కీళ్లలో బిగుతు, నొప్పి, భారంగా అనిపించడం వంటి సమస్యలు కనిపించవచ్చు. ఉదయం నిద్రలేచిన వెంటనే లేదా ఎక్కువసేపు ఒకే భంగిమలో కూర్చున్న తర్వాత ఈ లక్షణాలు మరింత ఎక్కువగా అనిపిస్తాయి. అయితే వాతావరణ మార్పుల ప్రభావం ప్రతి ఒక్కరిపై ఒకే విధంగా ఉండదు. కొందరికి ఎలాంటి



ఇబ్బందులు లేకపోయినా, మరికొందరు మాత్రం కీళ్ల నొప్పులతో ఎక్కువగా ఇబ్బంది పడే అవకాశం ఉంటుంది. ఎవరికి ఎక్కువగా ప్రభావం ఉండొచ్చు?కింది సమస్యలు ఉన్నవారిలో వాతావరణ మార్పుల ప్రభావం ఎక్కువగా కనిపించే అవకాశం ఉంది.

కీళ్లవాతం (ఆర్థరైటిస్)ఆస్టియో ఆర్థరైటిస్రుమటాయిడ్ ఆర్థరైటిస్వృద్ధాప్యంలో కీళ్ల సమస్యలతో బాధపడేవారుఇలాంటి వారిలో కీళ్ల నొప్పి, బిగుతు, కదలికల్లో ఇబ్బంది వంటి లక్షణాలు ఎక్కువయ్యే అవకాశం ఉంది.కీళ్ల నొప్పులను తగ్గించుకోవడానికి సూచనలురోజూ తేలికపాటి వ్యాయామం లేదా నడక చేయాలి.ఎక్కువసేపు ఒకే భంగిమలో కూర్చోవడం లేదా నిలబడటం మానుకోవాలి.రోజంతా తగినంత నీరు తాగాలి.కాల్షియం, విటమిన్-డి ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి.

చల్లటి వాతావరణంలో శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవాలి.నొప్పి ఎక్కువైతే వైద్యుల సలహా తీసుకోవాలి.

గుర్తుంచుకోవాల్సిన విషయంవాతావరణం మారినప్పుడు కీళ్ల నొప్పులు కొంతమందిలో పెరగడం సాధారణమే. అయితే నొప్పి ఎక్కువకాలం కొనసాగినా, రోజువారీ పనులకు ఆటంకం కలిగించినా నిర్లక్ష్యం చేయకూడదు. సరైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలితో కీళ్ల ఆరోగ్యాన్ని మెరుగ్గా కాపాడుకోవచ్చు.

# శ్వాస తీసుకోవడంలో ఇబ్బందా? ఎంఫిసెమా వ్యాధి గురించి తెలుసుకోండి

ఈ రోజుల్లో ధూమపానం చేసే వారి సంఖ్య పెరుగుతోంది. అయితే సిగరెట్ అలవాటు వల్ల ఊపిరితిత్తులకు తీవ్రమైన నష్టం కలిగించే వ్యాధుల్లో ఎంఫిసెమాఒకటి. ఇది దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధి. దీనివల్ల శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. ఒకసారి ఊపిరితిత్తులు దెబ్బతింటే పూర్తిగా నయం చేయడం సాధ్యం కాదు. అయితే సరైన చికిత్సతో వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చు.ఎంఫిసెమా అంటే ఏమిటి?మన ఊపిరితిత్తుల్లో ఉండే చిన్న గాలి సంచులను ఆల్వియోలీ అంటారు. సాధారణంగా ఇవి గాలిని లోపలికి తీసుకుని బయటకు పంపడంలో సహాయపడతాయి. కానీ ఎంఫిసెమా వ్యాధి వచ్చినప్పుడు ఈ గాలి సంచులు దెబ్బతింటాయి. దీంతో ఊపిరితిత్తుల నుంచి గాలిని పూర్తిగా బయటకు పంపడం కష్టమవుతుంది. ఫలితంగా శరీరానికి అవసరమైన ఆక్సిజన్ సరిపడా అందదు. ఈ వ్యాధి క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (జూపాణ)లో ఒక ప్రధాన రకం. ఇది నెమ్మదిగా అభివృద్ధి చెందే వ్యాధి.ఎంఫిసెమా లక్షణాలువ్యాధి ప్రారంభ దశలో లక్షణాలు పెద్దగా కనిపించకపోవచ్చు. అయితే వ్యాధి ముదిరే కొద్దీ ఈ సమస్యలు కనిపిస్తాయి.

చిన్న పని చేసినా ఆయాసం రావడంశ్వాస తీసుకునేటప్పుడు



లేదా వదిలేటప్పుడు ఈల లాంటి శబ్దం రావడంతరచూ దగ్గు రావడంఛాతీలో బిగుతు లేదా భారంగా అనిపించడంఎక్కువ అలసటగా ఉండటంబరువు తగ్గడంకాళ్ల చీలమండల వద్ద వాపు రావడంవ్యాధి తీవ్రత పెరిగితే విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు కూడా శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది.ఎంఫిసెమాకు ప్రధాన కారణాలుధూమపానంఎంఫిసెమాకు అత్యంత ప్రధాన కారణం సిగరెట్ తాగడం. ధూమపానం ఊపిరితిత్తుల కణజాలాన్ని క్రమంగా దెబ్బతీస్తుంది.రసాయనాలు, ధూళిపని ప్రదేశాల్లో ఉండే రసాయన పొగలు, ధూళి, ఆవిర్లు కూడా ఈ వ్యాధికి కారణమవుతాయి.జన్యుపరమైన కారణాలుచాలా అరుదుగా కొంతమందిలో జన్యుపరమైన లోపాల వల్ల కూడా ఎంఫిసెమా వచ్చే అవకాశం ఉంటుంది.ఎలా నివారించాలి?ధూమపానానికి పూర్తిగా దూరంగా ఉండాలి.ఇతరులు తాగే పొగను కూడా పీల్చకుండా జాగ్రత్త పడాలి.రసాయనాలు లేదా ధూళి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పనిచేసేవారు మాస్కులు ధరించాలి.

వాయు కాలుష్యానికి సాధ్యమైనంత దూరంగా ఉండాలి.క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి.ఎప్పుడు వైద్యుడిని సంప్రదించాలి?కొన్ని నెలలుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే లేదా రోజువారీ పనులు చేసుకోవడం కష్టంగా మారితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. దీనిని వయసు ప్రభావం లేదా సాధారణ బలహీనతగా భావించి నిర్లక్ష్యం చేయకూడదు. సరైన సమయంలో చికిత్స తీసుకుంటే వ్యాధి తీవ్రతను తగ్గించుకోవచ్చు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు కొత్వాల



**పాల్వంచ, జూన్ 2:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. కాలనీ), 7వ డివిజన్ (వనమా కాలనీ), 35వ డివిజన్ (సీతారాంపట్నం), 40వ డివిజన్ (రాం నగర్) ప్రాంతాల్లో సోమవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ డివిజన్ సమావేశాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్లకు ఉచిత విధ్యుత్, సన్న బియ్యం, తెల్ల రేషన్ కార్డుల పంపిణి, ఆసరా పింఛన్లు, రైతులకు రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు భీమా, ఇందిరమ్మ ఇండ్లు, సన్న ధాన్యానికి క్వింటాకు 500 రూపాయలు బోనస్ వంటి అనేక సంక్షేమ పథకాలు చేపడుతున్నదని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని కొత్వాల కోరారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేటర్లు దున్నపోతుల మణి, జిల్లా లేబర్ సెల్ చైర్మన్ సాదం రామకృష్ణ, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్, కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, నూకల రంగారావు, నరహరి, కోండం వెంకన్న గౌడ్, మహీపతి రామలింగం, షేక్ దస్తగిరి, వై వెంకటేశ్వర్లు, చల్లగుండ్ల సుజాత, గుండు రవి కుమార్, పెండ్యాల శ్రీనివాసరావు, నరిగె సుజాత, వాళపల్లి రాంబాబు, కట్టా శ్రీలత, కాపర్తి వెంకటాచారి, నల్లమల్ల సత్యం, సుజిత్ కుమార్, మస్నా శ్రీనివాస్, చెరుకూరి పార్వతి, దొప్పలపూడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదులక్షల ఎక్స్ గ్రేషియా చెక్ అందజేసిన ఎమ్మెల్యే జారె



**దమ్మపేట, జూన్ 2:** దమ్మపేట మండల కేంద్రంలో కార్పెంటర్ కాలనీ నందు గతంలో విద్యుత్ ప్రమాదంలో అకాల మరణం చెందిన రంగు కోకిల ఎ/శీ భాను కుటుంబానికి విద్యుత్ శాఖ ద్వారా మంజూరైన ఐదులక్షల రూపాయల ఎక్స్ గ్రేషి యా చెక్కును ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ నేపథ్యంలో వారి చిత్రప టానికి పుష్పాంజలి ఘటించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కక్కిరాల రమేష్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, స్థానిక సర్పంచ్ పగడాల రమాదేవి, ఉపసర్పంచ్ ఆంగోత్ శ్రీనివాసరావు, చిన్నశెట్టి యుగంధర్ అన్నవరపు నాగేంద్ర, వార్డు మెంబర్లు పోలమ్మ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

# అగ్నిప్రమాదంలో మృతి చెందిన మహిళల కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



**వేలేరుపాడు, జూన్ 2:** వేలేరుపాడు మండల కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన విషాదకర అగ్నిప్రమాద ఘటనలో మృతి చెందిన మహిళల కుటుంబ సభ్యులను పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పరామర్శించారు. ప్రమాద వార్త తెలుసుకున్న వెంటనే ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఘటనలో ఒక ఇంటిలో నిద్రిస్తున్న వలగాని సావిత్రి మరియు సిగ పుల్లమ్మ అగ్నికి ఆహుతై మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎమ్మెల్యే తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, పోలీసు అధికారులతో ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు ఘటనపై అనుమానాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో పోలీసులు దీనిని అనుమానాస్పద ఘటనగా నమోదు చేసి, క్లూస్ టీమ్‌తో పాటు ప్రత్యేక బృందాల సహాయంతో దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు. ఘటనకు గల అసలు కారణాలను వెలికితీసేందుకు అన్ని కోణాల్లో విచారణను వేగవంతం చేసి, పూర్తి స్థాయి స్పష్టత తీసుకువస్తామని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు గణేశుల ఆదినారాయణ, బీజేపీ మండల అధ్యక్షులు ఓలేటి బాలకృష్ణ, మెచినేని సంజయ్, కొవ్వల క్రాంతి, పొట్ల మోహన్ దొర, దేవినేని సుధాకర్, సారే బాబ్జీ, ములకలపల్లి నరసింహారావు, ఎం.డి. షాను, మాచర్ల వెంకటేశ్వర్లు, కోడూరి నాగు, గాలి బాలరాజు, సోడే కల్యాణ్, కమ్మచిచ్చు సాయి తదితరులు పాల్గొన్నారు.

## నువ్వులు దివ్యౌషధం.. ఎందుకో తెలుసా..?



నువ్వులు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. నువ్వులలో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, విటమిన్‌లు, కాల్షియం, ఐరన్, మెగ్నీషియంతోపాటు ఇతర యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల నువ్వులను క్రమం తప్పకుండా తీసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. మధుమేహాన్ని అదుపులో ఉంచడంలో.. చెడు కొలెస్టరాల్‌ను కరిగించి గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో.. ఎముకలను పటిష్టం చేయడంలో.. జీర్ణవ్యవస్థ, మెదడు పనితీరును మెరుగుపర్చడంలో.. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో నువ్వులు కీలకపాత్ర పోషిస్తాయి. ఈ ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.. 1. నువ్వులలో పీచు పుష్కలంగా ఉంటుంది. కాబట్టి నువ్వులను తీసుకోవడంవల్ల రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు నువ్వులు చాలా మంచిది.

2. నువ్వులు తింటే గుండె ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది. వీటిలోని 'ఒలియిక్ యాసిడ్', 'లినోలిక్ యాసిడ్' వంటివి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.

3. నువ్వులు ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలకపాత్ర పోషిస్తాయి. నువ్వులలో ఉండే అధిక కాల్షియం ఎముకల బలోపేతానికి తోడ్పడుతుంది. ఆస్టియోపోరోసిస్ వంటి వ్యాధులతో పోరాడేందుకు నువ్వులను తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. 4. నువ్వులు మన జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో కూడా చాలా మేలు చేస్తాయి. నువ్వులలోని అధిక పీచు అరుగుదలకు తోడ్పడుతుంది. మలబద్ధకం వంటి జీర్ణ సమస్యల నుంచి బయటపడటానికి నువ్వులు దివ్యౌషధంగా పనిచేస్తాయి. 5. నువ్వులు మెదడు పనితీరును మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయి. నువ్వులలో ఉండే అనేక పోషకాలు మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ముఖ్యంగా నువ్వుల్లో ఉండే విటమిన్ బి6 మెదడుకు మేలు చేస్తుంది. 6. నువ్వులు మన చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, చర్మ వ్యాధులతో పోరాడటానికి సహాయపడతాయి. నువ్వులలోని విటమిన్-ఇ, యాంటీ ఆక్సిడెంట్లు ఇందుకు సహకరిస్తాయి. చర్మాన్ని తేజోవంతంగా ఉంచుతాయి.

# జెండా ఆవిష్కరించిన వనమా రాఘవ

### - తెలంగాణ ఉద్యమంలో భద్రాచలం సబ్ జైల్లో వనమా రాఘవ



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 2:** భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పాత పాల్వంచ లో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు వనమా రాఘవేంద్రవు పాత పాల్వంచలో జెండా ఆవిష్కరించడం జరిగింది. అనంతరం సుజాతనగర్ వేపలగడ్డలో బిఆర్ఎస్ పార్టీ నూతన దిమ్మ కార్యక్రమంలో పాల్గొని నూతన దిమ్మ ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరించిన వనమా రాఘవేంద్రరావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలి దశ ఉద్యమానికి కెసిఆర్ పెడికెళ్లి బిగించి గులాబీ జెండా ఎత్తారని సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణ మార్చేందుకు కెసిఆర్ తో కలిసి అందరం నడుస్తున్నామని తెలంగాణ ఆకాంక్షను సాకారం చేసేందుకు అనేక పదవులు కేసీఆర్ త్యాగం చేశారని సంపాండ వర్గాలు కేసీఆర్ తో కలిసి నడిచి పోరాటంతో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తిన ఎగిసిందని గుర్తు చేశారు ఈ సందర్భంగా భద్రాచలం సబ్ జైల్లో ఆరు రోజులు తెలంగాణ ఉద్యమంలో నేను కూడా పాలుపంచుకున్నానని ఈ సందర్భంగా పాత మధుర జ్ఞాపకాలను గుర్తు చేసినారు. ఆనాడు వనమా వెంకటేశ్వరరావు కాంగ్రెస్ ప్రభుత్వంలో పనిచశారని కాంగ్రెస్ ప్రభుత్వ ఎమ్మెల్యేగా ఉంటూ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించడం జరిగిందని తెలంగాణ రావడంలో నేను జైలుకుపోవడం చాలా సంతోషమని వారు అన్నారు. వనమా వెంకటేశ్వరరావు నివాసం నుండి భారీ వాహనాలతో నవభారత్ లో జెండా ఆవిష్కరించి అనంతరం కొత్తగూడెం మీదుగా సుజాతనగర్ మండలం వేపలగడ్డలో బిఆర్ఎస్ పార్టీ జెండా ప్రారంభించి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్పొరేటర్లు సర్పంచులు ఉపసర్పంచ్ వనమా అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## ఎన్విడియా సీఈఓ ఒక్క ప్రకటనతో ఒక్కరోజే 25 శాతం పెరిగిన షేరు.. ఇదేందయ్యా ఇదీ..!




స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌కు లోబడి ఉంటాయన్న సంగతి తెలిసిందే. ఇక్కడ ఊహించని స్థాయిలో హెచ్చుతగ్గులు, ఒడుదొడుకులు ఉంటాయి. ఎన్నో అంశాలు స్టాక్ మార్కెట్‌పై ప్రభావితం చూపుతాయి. ఆర్థిక నిపుణుల సలహా మేరకు పెట్టుబడులు పెట్టడం మంచిదని చాలా మంది చెబుతుంటారు. అప్పుడు కాస్త నష్టభయం తగ్గుతుందని చెబుతుంటారు. ఇక స్టాక్ మార్కెట్లో కొన్ని స్టాక్స్ అప్పటికప్పుడు భారీగా పెరుగుతుంటాయి. అదే సమయంలో కొన్ని కారణాలతో అవే స్టాక్స్ భారీగా పతనం కూడా అవుతుంటాయి. ఇక్కడ చిన్న చిన్న ప్రకటనలతో కూడా స్టాక్స్ భారీ హెచ్చుతగ్గులకు లోనవుతుండటం గమనించొచ్చు. అందుకే ఇక్కడ ఆయా కంపెనీల నుంచి వచ్చే ప్రకటనలు, ఫలితాలు, ప్రణాళికలు ఇతర కారణాల గురించి తెలుసుకోవాలి. చాలా వరకు స్టాక్స్ మహా అంటే అప్పర్ సర్క్యూట్, లోయర్ సర్క్యూట్ 5 శాతం, 10 శాతం, 15 శాతం.. మరీ పెద్ద కారణం ఉంటే 20 శాతం వరకు పెరిగేవి ఉంటాయి. ఇక్కడ స్టాక్ అప్పర్ సర్క్యూట్, లోయర్ సర్క్యూట్‌లకు కొన్ని పరిమితులు ఉంటాయి. ఇక దాదాపు 20 శాతానికి మించి పెరగవు. కానీ ఇప్పుడు అమెరికా స్టాక్ మార్కెట్లో ఒక స్టాక్ ఒక్క సెషన్‌లో 24 శాతానికిపైగా దూసుకెళ్లింది. దీంతో ఇందులో ఇన్వెస్ట్ చేసిన వారికి కాసుల పంట పండిందని చెప్పొచ్చు. అదే మార్వెల్ టెక్నాలజీ లిమిటెడ్. కిందటి రోజు ఈ స్టాక్ ధర 219.43 డాలర్లుగా ఉండగా.. ఇవాళ ఒక్కరోజులోనే ఏకంగా 25 శాతానికిపైగా పెరిగి 275 యూఎస్ డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇంట్రాడేలో ఇంకా ఎక్కువే పెరిగి 277.54 డాలర్ల వద్ద సెషన్ గరిష్ఠాన్ని.. 52 వారాల గరిష్ఠాన్ని కూడా నమోదు చేసింది. స్టాక్ 52 వారాల కనిష్ఠ ధర 61.15 డాలర్లుగా ఉంది. మార్కెట్ విలువ 23.81 వేల కోట్ల డాలర్లుగా ఉండగా.. భారత కరెన్సీలో ఇది రూ. 22 లక్షల కోట్లకుపైనే ఉంటుంది. అంటే మన దగ్గర రిలయన్స్ ఇండస్ట్రీస్ కంటే ఎక్కువ విలువైనది. ఇప్పుడు ఈ చిప్ మేకర్ కంపెనీ స్టాక్ ఒక్కసారిగా పెరిగేందుకు ప్రధాన కారణం.. మార్కెట్ వాల్యుయేషన్ పరంగా ప్రపంచంలోనే అతిపెద్ద కంపెనీ అయిన ఎన్విడియా బాస్ జెన్సెన్ హువాంగ్ చేసిన ప్రకటనే. అవును డేటా సెంటర్లకు చిప్స్ తయారు చేసే ఈ మార్వెల్ టెక్ కంపెనీనే.. నెక్ట్స్ ట్రిలియన్ డాలర్ కంపెనీ అని ప్రకటన చేశారు హువాంగ్. ట్రిలియన్ డాలర్ అంటే భారత కరెన్సీలో దాదాపు రూ. 96 లక్షల కోట్ల వరకు ఉంటుంది. ఎన్విడియా, అల్ఫాబెట్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, యాపిల్ వంటి కొన్ని కంపెనీలే ఈ క్లబ్‌లో ఉన్నాయి. మరికొన్ని వాటికి చేరువలో ఉన్నాయి. ఏఐ మౌలిక సదుపాయాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ కంపెనీ అదే రీతిలో వృద్ధి చెందుతుందని హువాంగ్ అభిప్రాయపడ్డారు. అదే సమయంలో రానున్న రోజుల్లో ఏఐ చిప్స్‌కు డిమాండ్ మరింత పెరుగుతుందన్న అంచనాల నేపథ్యంలో.. ఒక్కసారిగా ఇన్వెస్టర్లు ఈ షేర్లను కొనేందుకు ఎగబడగా షేర్లు ఆ స్థాయిలో పుంజుకున్నట్లు తెలుస్తోంది. పైన ఇచ్చింది సమాచారం మాత్రమే. పెట్టుబడికి సిఫార్సు కాదు. స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేసే ముందు ఆర్థిక నిపుణుల మంచిది.

# రాశిఫలాలు 02 జూన్ 2026: ఈరోజు హంస రాజయోగం ప్రభావంతో మేషం, కర్కాటకం సహా కొన్ని రాశులకు అదృష్ట సంకేతాలు




జ్యోతిష్యశాస్త్రం ప్రకారం మంగళవారం రోజున చంద్రుడు ధనస్సు రాశిలో సంచారం చేయనున్నాడు. ఇదే సమయంలో ద్వాదశ రాశులపై మూల నక్షత్ర ప్రభావం ఉంటుంది. మరోవైపు హంస, సాధ్య, శుభ యోగాలు ఏర్పడనున్నాయి. ఇదే రోజున గురుడు కర్కాటకంలో సంచారం చేయనున్నాడు. ఈ కార ణంగా హంస రాజయోగం ఏర్పరచ నున్నాడు. పంచమహాపురుష రాజయోగాలలో ఇది ఒకటి. ఈ శుభ యోగాల కారణంగా ద్వాదశ రాశులకు కెరీర్ పరంగా మంచి పురోగతి లభించొచ్చు. కుజుడి స్థానం బలపడటంతో కొందరు వ్యక్తులకు ధైర్యం పెరుగుతుంది. అంతేకాదు హనుమంతుని అనుగ్రహం లభించనుంది. ఈ సందర్భంగా మేషం నుంచి మీన రాశుల వారికి ఏ మేరకు శుభ ఫలితాలు రానున్నాయి, ఎవరికి అశుభ ఫలితాలు రానున్నాయనే ఆసక్తికరమైన విషయాలను ప్రముఖ పండితులు "ఆచార్య క్రిష్ణ దత్త శర్మ" మాటల్లో తెలుసుకుందాం. మేష రాశి వారికి ఈరోజు సానుకూల ఫలితాలు రానున్నాయి. మీరు ఆధ్మాతిక విషయాలపై ఆసక్తి పెంచుకోవచ్చు. మీ ప్రయాణాలకు సంబంధించి సానుకూల ఫలితాలు సాధిస్తారు. మీ కుటుంబ సభ్యుల నుంచి పూర్తి సహకారం లభిస్తుంది. మీ ప్రేమ జీవితంలో సంతోషంగా ఉంటుంది. గురు గ్రహ సంచారం కారణంగా అత్యంత శుభప్రదంగా, ప్రయోజనకరంగా ఉంటుంది. మీ పిల్లల జీవితంలో సంతోషంగా ఉంటుంది. మీకు ఊహించని లాభాలు కలిగే అవకాశం ఉంది. వృషభ రాశి వారికి ఈరోజు గురు గ్రహం ప్రభావంతో సానుకూల ఫలితాలు రానున్నాయి. ఆర్థిక పరంగా మెరుగైన ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంది. అయితే మీ ఖర్చులు ఎక్కువగా పెరగొచ్చు. మీ ఆదాయం ఎక్కువగా పెరిగే అవకాశాలున్నాయి. ఈరోజు వివిధ శుభకార్యాల కోసం కొంత డబ్బు ఖర్చు చేయొచ్చు. మీ తోబుట్టువుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మీ ఇంట్లో కొన్ని సమస్యలను ఎదుర్కోవాల్సి రావొచ్చు. కాబట్టి చాలా జాగ్రత్తగా ఉండాలి.

మిథున రాశి వారికి ఈరోజు శుభప్రదమైన ఫలితాలు రావొచ్చు. గురు గ్రహం ప్రభావంతో ఈ రాశి వారికి ఆర్థిక పరంగా అనేక ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంది. మీరు చేసే ప్రయాణాలన్నింట్లో మంచి ఫలితాలు రావొచ్చు. మీకు దూర ప్రయాణం చేసే అవకాశం లభించొచ్చు. ఈరోజు మీరు శుభకార్యాల కోసం కొంత డబ్బు ఖర్చు చేయొచ్చు. మీ మనసులో సంతోషంగా ఉంటుంది. మీరు ఆధ్యాత్మిక కార్యకలాపాలపై ఆసక్తి చూపుతారు. కర్కాటక రాశి వారికి ఈరోజు గురు గ్రహం ప్రభావంతో సానుకూల ఫలితాలు రానున్నాయి. ఇదే రాశిలో హంస రాజయోగం ఏర్పడటంతో మీకు శుభ ఫలితాలు రానున్నాయి. మీరు చేసే ప్రయాణాలన్నింట్లో శుభ ఫలితాలు పొందే అవకాశం ఉంది. మీ చుట్టూ కొంత గందరగోళం ఉండొచ్చు. మీరు చేసే పనుల్లో కొంత ఇబ్బంది ఎదుర్కోవాల్సి రావొచ్చు. ఆర్థిక పరంగా మెరుగైన ఫలితాలు రావొచ్చు. మీరు చేసే ప్రయత్నాలన్నింట్లో మంచి లాభాలొచ్చే అవకాశం ఉంది. సింహ రాశి వారికి ఈరోజు మిశ్రమ ఫలితాలొచ్చే అవకాశాలున్నాయి. ఈ రాశి నుంచి చంద్రుడు పంచమ స్థానంలో సంచారం చేసే సమయంలో మీ కుటుంబ జీవితంలో సంతోషం పెరుగుతుందిద. గురు గ్రహం ద్వాదశ స్థానంలో ఉండటం వల్ల మీ ఖర్చులు పెరగొచ్చు. మరోవైపు మీ వైవాహిక జీవితంలో సంతోషంగా ఉంటుంది. మీరు చేసే శుభకార్యాలన్నింట్లో సానుకూల ఫలితాలు రావొచ్చు. ఏదైనా ఒక నిర్దిష్ట విషయం గురించి అధికారుల నుంచి ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఉద్యోగులకు కార్యాలయంలో వాతావరణం ప్రతికూలంగా ఉంటుంది. కన్య రాశి వారికి ఈరోజు గురు గ్రహం తన స్థానాన్ని మారడం వల్ల సానుకూల ఫలితాలు రానున్నాయి. మీరు చేసే పనులన్నింట్లో మంచి లాభాలు రావొచ్చు. మీకు వాహనాలు, ఇతర వస్తువులపై ఎక్కువ డబ్బు ఖర్చు కావొచ్చు. మీకు చాలా రంగాల్లో అదృష్టం కలిసి రావొచ్చు. మీరు చేసే ప్రయత్నాలన్నింట్లో సులభమైన విజయాలు సాధించొచ్చు. మీ ప్రియమైన వారిని కలుసుకోవచ్చు. ఉద్యోగం మారాలని యోచిస్తున్న వారికి సమయం అనుకూలంగా ఉంటుంది. తులా రాశి వారికి ఈరోజు శుక్ర, గురు గ్రహాల ప్రభావంతో అత్యంత శుభప్రదంగా ఉంటుంది. ఆర్థిక పరంగా మెరుగైన లాభాలు రావొచ్చు. మీరు చేసే పనులన్నింట్లో మంచి విజయం సాధించొచ్చు. మీ ప్రేమ జీవితంలో సంతోషంగా ఉంటుంది. మీ జీవిత భాగస్వామితో మీ అనుబంధం, సామరస్యం మరింత బలపడతాయి. ఉద్యోగులకు ఉన్నతాధికారుల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుంది. మరోవైపు శుక్రుడి ప్రభావంతో ఆర్థిక పరమైన ఖర్చులు పెరగొచ్చు. కాబట్టి చాలా జాగ్రత్తగా ఉండాలి. వృశ్చిక రాశి వారికి ఈరోజు అనేక రంగాల్లో మంచి ప్రయోజనాలు లభించొచ్చు. చంద్రుడు ఇదే రాశిలో సంచారం చేయడం కారణంగా అత్యంత శుభప్రదమైన, లాభదాయకమైన రోజుగా మారొచ్చు. మరోవైపు గురుడు తొమ్మిదో స్థానంలో సంచారం చేయడం కారణంగా కెరీర్ పరంగా మీకు పురోగతి లభించొచ్చు. మీ పనులన్నీ సకాలంలో పూర్తయ్యే అవకాశాలున్నాయి.

# అండర్-18 ఆసియా కప్‌లో భారత్ ఘన విజయం!




జపాన్‌లోని కాకామిగహారా వేదికగా జరుగుతున్న అండర్-18 ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత పురుషుల జట్టు మరోసారి లీగ్ దశలో అద్భుత ప్రదర్శన చేసింది. సోమవారం జరిగిన పూల్-ఎ మ్యాచ్‌లో కెప్టెన్ కేతన్ కుష్వాహా మెరుపు దాడితో భారత్ 4-1 గోల్స్ తేడాతో బలమైన దక్షిణ కొరియా జట్టును సులువుగా ఓడించింది. ఈ విజయంతో లీగ్ దశలో ఆడిన 3 మ్యాచ్‌ల్లో భారత్‌కు ఇది రెండో విజయం కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో భారత కెప్టెన్ కేతన్ కుష్వాహా ముందుండి జట్టును నడిపించాడు. మ్యాచ్ 3వ, 36వ నిమిషాల్లో రెండు కీలక గోల్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కేతన్ కుష్వాహాతో పాటు వరిందర్ సింగ్(5వ నిమిషం), షారూఖ్ అలీ(54వ నిమిషం) చెరో గోల్ చేసి స్కోరు బోర్డును పరుగెత్తించారు. కొరియా జట్టు తరపున కెప్టెన్ యూన్ జెహ్యాక్ 21వ నిమిషంలో ఏకైక గోల్ సాధించాడు. ప్రస్తుతం పూల్-ఎ లో భారత్, కొరియా, జపాన్ జట్లు ఆరేసి పాయింట్లతో సమానంగా ఉన్నప్పటికీ.. మెరుగైన గోల్ డిఫరెన్స్ కారణంగా భారత్ గ్రూప్ టాప్‌లో నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో రెండు పూల్స్ నుంచి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. కొరియాపై సాధించిన ఈ భారీ విజయం భారత్ సెమీస్ అవకాశాలను మరింత మెరుగుపరిచింది. మ్యాచ్ ప్రారంభం నుంచే భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. మొదటి క్వార్టర్ ఐదో నిమిషానికే భారత్ 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆట 3వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను రాహుల్ యాదవ్ పాస్ సాయంతో కెప్టెన్ కేతన్ గోల్‌గా మలిచాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే 5వ నిమిషంలో గాజీ ఖాన్ అందించిన అద్భుతమైన పాస్‌ను వరిందర్ సింగ్ ఏమాత్రం తడబడకుండా గోల్ పోస్ట్‌లోకి పంపి ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. రెండో క్వార్టర్‌లో కొరియా పుంజుకుని 21వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చి స్కోరును 2-1కి తగ్గించింది. అయితే మూడు, నాల్గవ క్వార్టర్లలో భారత్ మళ్లీ ఆటపై పట్టు సాధించింది. 36వ నిమిషంలో కేతన్ కుష్వాహా వ్యక్తిగత రెండో గోల్ కొట్టి భారత్‌కు 3-1 ఆధిక్యాన్ని అందించాడు. మ్యాచ్ ముగిసే సమయానికి (53వ నిమిషంలో) కొరియా గోల్ చేయడానికి తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ.. భారత గోల్‌కీపర్ ఆయుష్ రజక్ అద్భుతమైన డిఫెన్స్‌తో దానిని అడ్డుకున్నాడు. ఆ మరుసటి నిమిషంలోనే భారత్ ఎదురుదాడికి దిగి, షారూఖ్ అలీ క్లాస్ షాట్‌తో నాల్గవ గోల్ కొట్టి 4-1తో భారత్ విజయాన్ని ఖరారు చేశాడు. టీమిండియా తన తదుపరి పూల్-ఎ మ్యాచ్‌లో జూన్ 3న చైనీస్ తైపీతో తలపడనుంది.

# ఆస్ట్రేలియాలో కోహ్లికి చాలా పెద్ద ఫ్యాన్ బేస్

### - ఆస్ట్రేలియా ఉప ప్రధాని రిచర్డ్ మార్లెస్




రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్‌లో వరుసగా రెండో టైటిల్ అందుకుంది. ఆర్సీబీ విజయంపై ఆస్ట్రేలియా ఉప ప్రధాని రిచర్డ్ మార్లెస్ హర్షం వ్యక్తం చేశారు. దాంతో పాటు విరాట్ కోహ్లిని ఆకాశానికి ఎత్తుతూ ప్రశంసల జల్లు కురిపించారు. ఆస్ట్రేలియాలో విరాట్ కోహ్లికి చాలా పెద్ద ఫ్యాన్ బేస్ ఉందని చెప్పారు. గతేడాది తాను భారత్‌కు వచ్చినప్పుడు ఆర్సీబీ తొలి కప్ అందుకుందని, ఇప్పుడు రెండో టైటిల్ సొంతం చేసుకుందని ఆయన గుర్తు చేశారు. విరాట్ కోహ్లికి ఆస్ట్రేలియాలో ఎంత పెద్ద ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందో చెప్పాల్సిన అవసరం లేదు. అక్టోబర్‌లో జరిగిన కోహ్లి ఆఖరి ఆస్ట్రేలియా టూర్‌లో ఫ్యాన్స్ ఎలా బ్రహ్మరథం పట్టారో చూశాము. కోహ్లి డకౌట్లు అయినా ఫ్యాన్స్ మాత్రం మంచి సెండాఫ్ ఇచ్చారు. ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు కూడా విరాట్ కోహ్లి - రోహిత్ శర్మలకు ఘన వీడ్కోలు పలికింది. తాజాగా ఐపీఎల్‌లో ఆర్సీబీ వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా నిలవడంపై ఆస్ట్రేలియా ఉప ప్రధాని కోహ్లిపై ప్రశంసల వర్షం కురిపించారు. భారత పర్యటనలో ఉన్న ఆస్ట్రేలియా ఉప ప్రధాని రిచర్డ్ మార్లెస్ ఆర్సీబీ టైటిల్ సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా విరాట్ కోహ్లిపై ప్రశంసల జల్లు కురిపించారు. ఆర్సీబీ విజయాన్ని, కోహ్లి ప్రభావాన్ని చూపిస్తూ భారత్ - ఆస్ట్రేలియా ద్వైపాక్షిక సంబంధాల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆస్ట్రేలియాలో కోహ్లి పేరు ఎక్కువగా వినిపిస్తుందని, ప్రపంచ వ్యాప్తంగా అతని అభిమానులు ఉన్నారని గుర్తు చేశారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన మార్లెస్ ఆర్సీబీ విజయాన్ని రెండు దేశాల మధ్య పెరుగుతున్న రిలేషన్‌కు గుర్తుగా అభివర్ణించారు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఫైనల్స్‌లో కోహ్లి 75 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆస్ట్రేలియా ఆటగాళ్లు జోష్ హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్ కూడా తమ వంత పాత్ర పోషించారని గుర్తు చేశారు. "గతేడాది కూడా ఐపీఎల్ ఫైనల్ తర్వాతి రోజు నేను భారత్‌లోనే ఉన్నాను. ఈ సారి కూడా ఆర్సీబీ విజయం సాధించింది. విరాట్ కోహ్లి 75 పరుగులతో నాటౌట్‌గా నిలిచి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. కోహ్లితో పాటు జోష్ హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్ కూడా కీలక పాత్ర పోషించాడు. భారత్ - ఆస్ట్రేలియా కలిసి ఎలా ముందుకు సాగు తున్నాయో చూపేందుకు ఇది ఓ ఉదాహరణ" అని మార్లెస్ అన్నారు. "ప్రస్తుతం క్రికెట్‌లో విరాట్ కోహ్లి అంటే ఓ సంచలనం. నేను చిన్నప్పటి నుంచి క్రికెట్‌ను ఫాలో అవుతున్నాను. అప్పట్లో నాకు గుర్తున్న కెప్టెన్ బిషాన్ సింగ్ బేడి. ఇప్పుడు కోహ్లి ఆ స్థాయిని దాటేశాడు. కపిల్ దేవ్ పక్కన నిల్చోవడం కూడా ఒక ఫ్యాన్ బాయ్ మూమెంట్" అని ఆస్ట్రేలియా ఉప ప్రధాని అన్నారు.



# కోట్లు పెట్టి డమ్మీ ప్లేయర్లను కొంటున్నారు

### - ఐపీఎల్ ఫ్రాంచైజీలపై గవాస్కర్ ఫైర్..!

ఐపీఎల్ 2026 ముగిసిన తరుణంలో భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఫ్రాంచైజీల తీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. లోకల్ లీగ్స్‌లో రాణించారని రూ.కోట్లు పెట్టి కొని, ఐపీఎల్‌లో కేవలం రెండు మ్యాచ్‌లకే పరిమితం చేసే ఆటగాళ్లు 'డమ్మీ'లతో సమానమని మండిపడ్డారు. స్థానిక లీగ్‌లకు, అంతర్జాతీయ స్థాయి బౌలింగ్ ఉండే ఐపీఎల్‌కు చాలా తేడా ఉందని, ఫ్రాంచైజీలు అంచనాలు తలకిందులై డబ్బు వృథా చేసుకుంటున్నాయని ఈ సందర్భంగా సునీల్ గవాస్కర్ పేర్కొన్నారు. ఐపీఎల్ 2026 ముగిసింది. ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రెండో టైటిల్‌ను ముద్దాడింది. ఈ నేపథ్యంలో ఐపీఎల్ ఫ్రాంచైజీలను ఉద్దేశించి.. టీమిండియా క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కొన్ని ఫ్రాంఛైజీలు.. రూ.కోట్లు పెట్టి డమ్మీ క్రికెటర్లను కొంటున్నాయని గవాస్కర్ వ్యాఖ్యానించారు. దీంతో సునీల్ గవాస్కర్.. ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారనేది చర్చనీయాంశంగా మారింది. భారత క్రికెట్‌కు ఐపీఎల్ ఎంతోమంది ప్రతిభావంతులను ఇచ్చింది. రవిచంద్రన్ అశ్విన్, జస్‌ప్రీత్ బుమ్రా, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా వంటి ప్లేయర్లు ఐపీఎల్ ద్వారానే వెలుగులోకి వచ్చారు. ఇదే సమయంలో పలువురు ఆటగాళ్లు మాత్రం వేలంలో భారీ ధర పలికి.. మైదానంలో అంచనాలను అందుకోలేకపోతున్నారు. రాష్ట్ర, నగర స్థాయి లీగ్‌ల్లో భారీ షాట్లు ఆడటంతో వారిపై ఫ్రాంచైజీలు ఫోకస్ పెట్టాయి. కానీ ఐపీఎల్‌లో అంతర్జాతీయ స్థాయిలో బౌలింగ్‌ను వారు ఎదుర్కోలేకపోతున్నారు. రాష్ట్ర స్థాయి లీగ్‌లలో బ్యాటింగ్, బౌలింగ్ ప్రమాణాలకు.. ఐపీఎల్‌కు చాలా తేడా ఉంది. కానీ అలాంటి ప్లేయర్ల కోసం ఫ్రాంచైజీలు డబ్బును వృథా చేసుకుంటున్నాయి" అని గవాస్కర్ అన్నారు. "ఫ్రాంచైజీ రూ.కోట్లు పెట్టి ఆటగాడిని కొనుగోలు చేసి.. అతడిని కేవలం 2 మ్యాచ్‌లకే పరిమితం చేయడం కరెక్టు కాదు. దానికి అసలు అర్థమే లేదు. ఓ ఫ్రాంఛైజీ గనక అలా చేస్తే ఆ ప్లేయర్ డమ్మీ అన్నట్లే లెక్క. ఐపీఎల్ చాలా త్వరగా ఓ ఆటగాడి అసలు సామర్థ్యాన్ని బయటపెడుతుంది. ఇదే ఐపీఎల్ స్పెషాలిటీ. ప్లేయర్‌పై అతిగా అంచనాలు పెట్టుకున్నారా? నిజంగానే భారీ ఇన్నింగ్స్ ఆడే సామర్థ్యం ఉందా? అనేది ఈజీగా తెలిసిపోతుంది. ఒక సీజన్‌లో పెద్దగా ప్రాధాన్యం లేని మ్యాచ్‌లో సత్తాచాటినా.. కొందరు ఆటగాళ్లు అదే ప్రదర్శన ఆధారంగా వచ్చే సీజన్‌కు ఎంపికవుతున్నారు" అని గవాస్కర్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం గవాస్కర్ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఎవరిని ఉద్దేశించి ఆయన ఈ కామెంట్స్ చేశారనే విషయంపై నెట్టింట చర్చ జరుగుతోంది.




## భారీ మూల్యం చెల్లించుకున్న టిమ్ డేవిడ్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఆటగాడికి షాక్ తగిలింది. భారీ హిట్టింగ్ చేసే ఆస్ట్రేలియా బ్యాటర్ టిమ్ డేవిడ్ ఐపీఎల్ ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చేసిన చిన్న పొరపాటుతో భారీ మూల్యం చెల్లించుకున్నాడు. క్రమశిక్షణా ఉల్లంఘనకు పాల్పడినందుకు ఒక మ్యాచ్ సస్పెన్షన్, మ్యాచ్ ఫీజులో 50% జరిమానా విధించారు. ఈ నిషేధం కారణంగా, టిమ్ డేవిడ్ ఐపీఎల్ 2027 తొలి మ్యాచ్‌లో ఆడేందుకు అవకాశాన్ని కోల్పోయాడు. ఇది ఐపీఎల్ 2026 సీజన్‌లో అతనికి విధించిన మూడో పనిష్మెంట్ కావడం విశేషం. ఫైనల్ మొదటి ఇన్నింగ్స్‌లో 10వ ఓవర్లో గుజరాత్ టైటాన్స్ వికెట్ పడిన వెంటనే ఇది జరిగింది.

## 3.4 కోట్లిచ్చి ఖాళీగా కూర్చోబెట్టిన లక్నో!




లక్నో సూపర్ జెయింట్స్ స్టార్ బౌలర్ మయాంక్ యాదవ్ ఐపీఎల్ 2026లో పూర్తిగా విఫలమయ్యాడు. గాయం నుంచి కోలుకుని వచ్చిన మయాంక్ 4 మ్యాచ్‌లు ఆడి వికెట్లేమీ తీసుకోలేకపోయాడు. లక్నో తరపున 2022 నుంచి ఐదు సీజన్లు ఆడిన మయాంక్ యాదవ్ ఓవరాల్‌గా పది మ్యాచ్‌లే ఆడాడు. ఈ పది మ్యాచ్‌లలో 9 వికెట్లు పడగొట్టాడు. అయితే మయాంక్‌ను బెంచ్‌కే పరిమితం చేసిన లక్నో.. రూ. 33.4 కోట్లను అతనికి చెల్లించింది. ఐపీఎల్‌లో ఎక్కువ హైప్ తెచ్చుకుని డగౌట్‌కే పరిమితమైన ప్లేయర్ ఎవరంటే మొదటగా గుర్తొచ్చేది మయాంక్ యాదవ్. దేశవాళీ క్రికెట్‌లో రాణించి ఐపీఎల్‌లో అడుగుపెట్టిన మయాంక్ యాదవ్ నెట్స్‌లో మెరుపు బంతులతో కోచ్‌లను కట్టిపడేశాడు. కానీ.. సీజన్‌లో అడుగుపెట్టిన వెంటనే గాయాలతో రూలుడ్ అవుట్ అవడమో, లేక రెస్ట్ తీసుకుని డగౌట్స్‌కి పరిమితమవ్వడమో చేశాడు. లక్నో సూపర్ జెయింట్స్ ఐదేళ్లలో మయాంక్ యాదవ్ కోసం రూ. 33.4 కోట్లు ఖర్చు పెడితే అతను పట్టుమని పది మ్యాచ్‌లు కూడా ఆడలేదు. 150 కిలోమీటర్ల వేగంతో బంతులు విసరగల మయాంక్ యాదవ్.. టీమిండియాలో అడుగుపెట్టిన తొలి మ్యాచ్‌లోనే మెయిడిన్ ఓవర్‌తో సంచలనం సృష్టించాడు. ఐపీఎల్ 2022లో రూ. 20 లక్షల బేస్ ప్రైజ్‌తో మయాంక్ యాదవ్‌ను లక్నో సూపర్ జెయింట్స్ సొంతం చేసుకుంది. మొదటి రెండేళ్లు అంటే 2022, 2023 సీజన్‌లలో మయాంక్ యాదవ్ కేవలం బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఐపీఎల్ 2024లో మయాంక్‌ను రూ. 11 కోట్ల ధరకు రిటైన్ చేసుకున్న లక్నో సూపర్ జెయింట్స్ ఆ సీజన్‌లో కేవలం నాలుగు మ్యాచ్‌లే ఆడించింది.

# వైభవ్ వెనుక కార్పొరేట్ కంపెనీల పరుగులు



క్రికెట్ ప్రపంచంలో ప్రస్తుతం ఒకే ఒక్కడి పేరు మారుమోగిపోతోంది. అతడే 15 ఏళ్ల టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ. ఇటీవలే ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్‌లో ఈ బుడ్డోడు సృష్టించిన సునామీ అంతా ఇంతా కాదు. రాజస్థాన్ రాయల్స్ జట్టు తరపున ఆడిన వైభవ్.. తన బ్యాటింగ్ విశ్వరూపంతో క్రికెట్ దిగ్గజాలనే ఆశ్చర్యపరిచాడు. ఐపీఎల్ ముగింపు వేడుకల్లో మేజర్ అవార్డులన్నింటినీ ఇతడే క్లీన్ స్వీప్ చేశాడు. దాంతో రాత్రికి రాత్రే ఈ బిహార్ కుర్రాడి బ్రాండ్ వాల్యూ ఆకాశాన్ని తాకింది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను సైతం పక్కకు నెట్టి కార్పొరేట్ కంపెనీలు ఈయన వెనుక పరుగులు పెడుతున్నాయి. ఐపీఎల్ 2026 సీజన్‌లో రన్నరప్ రేసులో రాజస్థాన్ క్వాలిఫైయర్-2 లో ఓడిపోయినప్పటికీ, వైభవ్ సూర్యవంశీ మాత్రం చరిత్ర సృష్టించాడు. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ సాధించడంతో పాటు మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్, ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్, సూపర్ స్ట్రైకర్, సూపర్ సిక్సెస్ అవార్డులను కైవసం చేసుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత చిన్న వయసులో ఈ అవార్డులు గెలవడమే కాకుండా.. ఒకే సీజన్‌లో ఎంవీపీ, ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డులు రెండూ సాధించిన ఏకైక ఆటగాడిగా రికార్డులకెక్కాడు. ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోదీ సైతం స్పందిస్తూ.. భవిష్యత్తులో బాలీవుడ్, హాలీవుడ్ స్టార్ల కంటే పెద్ద సెలబ్రిటీ వైభవ్ అవుతాడని జోస్యం చెప్పారు. ఐపీఎల్‌లో వైభవ్ చూపించిన ప్రతాపానికి బ్యాట్ స్పాన్సర్‌షిప్ మార్కెట్ అప్సెట్ అయిపోయింది. కోహ్లీ బ్యాట్ స్పాన్సర్ ఎమ్ఆర్ఎఫ్, రోహిత్ శర్మ బ్యాట్ స్పాన్సర్ సియట్ లాంటి దిగ్గజ క్రీడా సంస్థలు వైభవ్ బ్యాట్ రైట్స్ కోసం పోటీ పడుతున్నాయి. మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం ఒక ప్రముఖ కంపెనీ అయితే ఈ 15 ఏళ్ల కుర్రాడికి ఏకంగా బ్లాంక్ చెక్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రేజ్ చూసి వైభవ్ తన కమర్షియల్ యాడ్స్ రేట్లను ఏకంగా రెట్టింపు చేసేశాడు. వైభవ్ సూర్యవంశీ కమర్షియల్ జర్నీ ప్రముఖ న్యూట్రిషన్ బ్రాండ్ కాంప్లాన్ ఇండియాతో ప్రారంభమైంది. 2026 ప్రారంభంలోనే కాంప్లాన్ సంస్థ అతనితో థోడా ప్లాన్, థోడా కాంప్లాన్ అనే క్యాంపెయిన్ కోసం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ దాదాపు రూ.75 నుంచి 80 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ యాడ్‌లో వైభవ్ క్రమశిక్షణతో కూడిన శిక్షణ, క్రీడాకారులకు పోషకాహారం ఎంత ముఖ్యమనే విషయాలను హైలైట్ చేశారు. వైభవ్ సూర్యవంశీ కమర్షియల్ జర్నీ ప్రముఖ న్యూట్రిషన్ బ్రాండ్ కాంప్లాన్ ఇండియాతో ప్రారంభమైంది. 2026 ప్రారంభంలోనే కాంప్లాన్ సంస్థ అతనితో థోడా ప్లాన్, థోడా కాంప్లాన్ అనే క్యాంపెయిన్ కోసం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ దాదాపు రూ.75 నుంచి 80 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ యాడ్‌లో వైభవ్ క్రమశిక్షణతో కూడిన శిక్షణ, క్రీడాకారులకు పోషకాహారం ఎంత ముఖ్యమనే విషయాలను హైలైట్ చేశారు. మే 30వ తేదీన జార్ఖండ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఇర్ఫాన్ అన్సారీ ఒక కీలక ప్రకటన చేశారు. వైభవ్‌ను యూత్ ఎనర్జీకి నిలువెత్తు రూపంగా అభివర్ణిస్తూ, త్వరలోనే జార్ఖండ్ ఆరోగ్య శాఖ తరుపున ప్రచారకర్తగా నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఇక క్రికెట్ కిట్ విషయానికి వస్తే.. ప్రముఖ స్పోర్ట్స్ తయారీ సంస్థ సరీన్ స్పోర్ట్స్ తో వైభవ్‌కు ఎప్పటి నుంచో ఒప్పందం ఉంది. ఈ ఎస్ఎస్ బ్యాట్ స్పాన్సర్‌షిప్ ద్వారా వైభవ్‌కు ఏడాదికి దాదాపు రూ.50 లక్షల ఆదాయం లభిస్తోంది.

# నాగచైతన్యకు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట..

### అశ్లీల కంటెంట్ తొలగించాలని ఆదేశం



నటుడు అక్కినేని నాగచైతన్యకు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. తన పేరు, ఫొటో, కీర్తిని దుర్వినియోగం చేస్తూ ఆన్‌లైన్‌లో అశ్లీల, పరువు నష్టం కలిగించే కంటెంట్‌ను ఏఐ ద్వారా సృష్టించిన నకిలీ చిత్రాలను వ్యాప్తి చేస్తున్నారని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు సానుకూలంగా స్పందించింది. ఇటువంటి కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

గత 15 ఏళ్లుగా తెలుగు చిత్ర పరిశ్రమలో నటుడిగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాగచైతన్య, తన వ్యక్తిత్వ హక్కులకు (పర్సనాలిటీ రైట్స్) భంగం కలుగుతోందని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కొన్ని అశ్లీల వెబ్‌సైట్లు తన పేరును ట్యాగ్‌లు, కేటగిరీలుగా వాడుకుంటూ అభ్యంతరకర కంటెంట్‌కు తప్పుడు ప్రచారం కల్పిస్తున్నాయని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనివల్ల తన పరువు, ప్రతిష్ఠలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటితో పాటు తన అనుమతి లేకుండా తన ఫొటోలతో టీషర్టులు వంటి వస్తువులను (మెర్చండైజ్) ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారని కూడా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ జ్యోతి సింగ్ ధర్మాసనం, నాగచైతన్య వాదనలతో ఏకీభవించింది. నాగచైతన్య ప్రముఖ నటుడని, ఆయన కీర్తి, ప్రతిష్ఠలకు చట్టపరమైన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. "ఫిర్యాదుదారుడికి అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి ప్రాథమిక ఆధారాలున్నాయి. ఒకవేళ అలా చేయకపోతే, ఆయనకు పూడ్చలేని నష్టం జరుగుతుంది" అని కోర్టు తన తీర్పులో పేర్కొంది.

ఈ మేరకు నాగచైతన్య పేరు, ఫొటో, వాయిస్ లేదా ఆయన వ్యక్తిత్వాన్ని సూచించే ఏ అంశాన్ని అయినా ఆయన అనుమతి లేకుండా వాణిజ్యపరంగా లేదా వ్యక్తిగతంగా ఉపయోగించరాదని ప్రతివాదులను ఆదేశించింది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌ఫేక్, ఫేస్ మార్ఫింగ్ వంటి టెక్నాలజీల ద్వారా కంటెంట్ సృష్టించడాన్ని నిషేధించింది. అభ్యంతరకర కంటెంట్ ఉన్న యూఆర్ఎల్‌లు, యూట్యూబ్ వీడియోలను 24 గంటల్లోగా తొలగించాలని సంబంధిత వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను సెప్టెంబరు 30కి వాయిదా వేసింది. ఇటీవల కాలంలో తమ వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసం కోర్టును ఆశ్రయించిన ప్రముఖులలో అల్లు అర్జున్, నాగార్జున, గౌతమ్ గంభీర్, అభిషేక్ బచ్చన్ వంటి వారి సరసన నాగచైతన్య కూడా చేరారు.

# నటి ప్రియాంక మోహన్‌కు కొరియా ప్రభుత్వ అరుదైన గౌరవం



ప్రముఖ యువ నటి ప్రియాంక అరుళ్ మోహన్‌కు అరుదైన అంతర్జాతీయ గౌరవం లభించింది. ఆమెను దక్షిణ కొరియా పర్యాటక గౌరవ రాయబారిగా నియమిస్తున్నట్లు కొరియా ప్రభుత్వం, కొరియా పర్యాటక సంస్థ (కేటీఓ) అధికారికంగా ప్రకటించాయి. ఇటీవలే ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'మేడ్ ఇన్ కొరియా' అనే తమిళ చిత్రం విడుదలైన నేపథ్యంలో ఈ గౌరవం దక్కడం విశేషం. ఈ సినిమా కొరియా నేపథ్యంలో సాగడం, అక్కడి సంస్కృతిని ప్రతిబింబించడంతో ఆమెను ఈ పదవికి ఎంపిక చేశారు.

ఈ నియామకం పట్ల ప్రియాంక మోహన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తన సంతోషాన్ని, కృతజ్ఞతలను వ్యక్తం చేశారు. "ఇది నాకు దక్కిన అద్భుతమైన గౌరవం. కొరియా పర్యాటక గౌరవ రాయబారిగా నన్ను నియమించడం ఎంతో ప్రత్యేకం. కొరియా సంస్కృతిని, సంప్రదాయాలను భారతీయ ప్రేక్షకులకు మరింత చేరువ చేసే వ్యక్తిగా నన్ను గుర్తించినందుకు కొరియా ప్రభుత్వానికి, పర్యాటక సంస్థకు హృదయపూర్వక ధన్యవాదాలు. కొరియా సంస్కృతి, ప్రజల ఆప్యాయత నన్ను ఎప్పుడూ ఆకట్టుకుంటాయి. ఈ అందమైన ప్రయాణంలో భాగమైనందుకు సంతోషిస్తున్నాను" అని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు.

ప్రియాంక మోహన్‌కు కొరియాతో ఉన్న అనుబంధం ఇటీవలి కాలంలో బలపడింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేసిన విందులో ఆమె పాల్గొన్నారు. ఆ విందుకు ప్రధాని నరేంద్ర మోదీ, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ కూడా హాజరయ్యారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఆ కార్యక్రమంలో అగ్ర నాయకులతో కలిసి భోజనం చేయడం ఒక అద్భుతమైన అనుభవమని, తన 'మేడ్ ఇన్ కొరియా' చిత్రాన్ని వారు అభినందించడం ఎప్పటికీ మరిచిపోలేనని ప్రియాంక అప్పుడు కూడా సోషల్ మీడియాలో పంచుకున్నారు. రా కార్తీక్ దర్శకత్వం వహించిన 'మేడ్ ఇన్ కొరియా' చిత్రం మార్చి 12న నేరుగా నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో విడుదలైంది. దక్షిణ కొరియాలో చిత్రీకరణ జరుపుకున్న తొలి తమిళ చిత్రంగా ఇది రికార్డు సృష్టించింది. ఈ సినిమా ద్వారానే ప్రియాంక తొలిసారి అంతర్జాతీయ నటులతో కలిసి పనిచేశారు. ఇప్పుడు అదే సినిమా ఆమెకు ఈ అంతర్జాతీయ గుర్తింపును తీసుకురావడం గమనార్హం.

# 'ఐరన్ లెగ్' ట్రోలింగ్‌పై కృతి శెట్టి ఘాటు స్పందన



'ఉప్పెన' సినిమాతో రాత్రికి రాత్రే స్టార్ స్టేటస్ సంపాదించుకున్న యువ నటి కృతి శెట్టి, తనపై జరుగుతున్న సోషల్ మీడియా ట్రోలింగ్‌పై ఎట్టకేలకు నోరు విప్పారు. ఉప్పెన తర్వాత 'బంగార్రాజు', 'శ్యామ్ సింగ రాయ్' వంటి చిత్రాలు మంచి విజయాన్ని అందించినప్పటికీ, ఆ తర్వాత ఆమె నటించిన వరుస తెలుగు సినిమాలు బాక్సాఫీస్ వద్ద తీవ్ర నిరాశపరిచాయి. వీటికి తోడు ఇటీవల ఆమె నటించిన తమిళ చిత్రాలు 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ', 'వా వా వాతియార్' కూడా ఆశించిన స్థాయిలో ఆడకపోవడంతో, నెటిజన్లు ఆమెను 'ఐరన్ లెగ్' అంటూ దారుణంగా ట్రోల్ చేయడం ప్రారంభించారు.

ఈ నేపథ్యంలో ఒక తాజా ఇంటర్వ్యూలో మాట్లాడిన కృతి శెట్టి, తనపై వస్తున్న విమర్శలను నేరుగా తిప్పికొడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక సినిమా ఫ్లాప్ అయితే దానికి హీరోయిన్లను బ్లేమ్ చేయడం చాలా అన్యాయమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

చాలా సినిమాల్లో హీరోయిన్ల పాత్ర నిడివి చాలా తక్కువగా ఉంటుందని, సినిమాను ఎలా తీయాలి లేదా కథను ఎలా నడపాలనే విషయాల్లో తమకు ఎలాంటి నిర్ణయాధికారాలు ఉండవని స్పష్టం చేశారు. అలాంటప్పుడు తమపై 'ఐరన్ లెగ్' అనే ట్యాగ్ వేయడం విచిత్రంగా ఉందని, అసలు పరిశ్రమలో ఒక సక్సెస్‌ఫుల్ సినిమాను ఎలా తీయాలో ఎవరికీ ముందుగా తెలియదని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. కృతి శెట్టి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు టాలీవుడ్, కోలీవుడ్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. సినిమా ఫ్లాప్ అయితే హీరోయిన్లను మాత్రమే టార్గెట్ చేయడం తప్పు అంటూ ఒక వర్గం ఆమెకు మద్దతు తెలుపుతుండగా, మరో వర్గం మాత్రం దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. సినిమా హిట్ అయినప్పుడు క్రెడిట్ తీసుకునే హీరోయిన్లు, ఫ్లాప్ అయినప్పుడు మాత్రం బాధ్యత తీసుకోరా? అంటూ కొందరు నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. అలాగే సక్సెస్ ఫార్ములా ఎవరికీ తెలియదంటూ కృతి చేసిన వ్యాఖ్యలు సీనియర్ దర్శకులు, నిర్మాతల అనుభవాన్ని తక్కువ చేసి చూపించేలా ఉన్నాయంటూ పరిశ్రమలోని కొందరు అభిప్రాయపడుతున్నారు.

# 'యూఫోరియా' నా కెరీర్‌లో ఓ మైలురాయి: దర్శకుడు గుణశేఖర్



'యూఫోరియా' చిత్రం తన కెరీర్‌లోనే ఒక ముఖ్యమైన మైలురాయి అని, అది తనలో కొత్త సృజనాత్మక శక్తిని నింపిందని ప్రముఖ దర్శకుడు గుణశేఖర్ అన్నారు. మంగళవారం తన 62వ పుట్టినరోజు సందర్భంగా ఆయన సోమవారం మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడారు. సాధారణంగా పుట్టినరోజున మీడియా ముందుకు రాని తాను, 'యూఫోరియా'కు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూసి మాట్లాడాలనిపించిందని తెలిపారు. "నా కెరీర్‌లో నేను చేసిన అన్ని సినిమాల్లో 'యూఫోరియా' చాలా ప్రత్యేకం. ఇలాంటి సినిమాలు మరిన్ని తీయాలని సోషల్ మీడియాలో ఎన్నో కామెంట్లు చూశాను. సినిమాపై వచ్చిన విశ్లేషణాత్మక వీడియోలను లక్షలాది మంది వీక్షించారు" అని గుణశేఖర్ వివరించారు. ఈటీవీ విన్, ఆహా వంటి ఓటీటీలతో పాటు అమెజాన్ ప్రైమ్ వీడియో రెంటల్స్‌లో కూడా సినిమా ట్రెండింగ్‌లో ఉందని, థియేటర్లలో చూడలేకపోయామని చాలామంది బాధపడ్డారని ఆయన పేర్కొన్నారు. ఈ చిత్రానికి తానే నిర్మాతగా ఉండటం వల్ల మార్కెటింగ్ పరంగా కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని ఆయన అంగీకరించారు. "నిర్మాతగా కూడా నేనే ఉండటం ఒక మైనస్ కావచ్చు. మార్కెటింగ్ పరంగా విఫలమయ్యానని భావిస్తున్నాను. భవిష్యత్తులో నిర్మాణ భాగస్వాములతో కలిసి పనిచేస్తాను," అని స్పష్టం చేశారు. మైనర్ల నేరాలకు సంబంధించిన నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ సినిమాను తీశానని, యువతలో పెరిగిపోతున్న మాదకద్రవ్యాల వాడకం వంటి సామాజిక అంశాలపై ఇది అవగాహన కల్పిస్తుందని గుణశేఖర్ తెలిపారు. తన సినిమా ఆలోచనా విధానం కూడా మారిందని చెబుతూ, "మనం హీరోల కోసం కథలు రాయడం ఆపాలి. ముందు కథ రాసుకుని, దానికి సరిపోయే హీరోను ఎంపిక చేసుకోవాలి," అని అన్నారు.

భూమికా చావ్లా, సారా అర్జున్ వంటి నూతన నటీనటులు నటించిన 'యూఫోరియా' ఫిబ్రవరి 2026లో విడుదలైంది. 'ఒక్కడు', 'చూడాలనివుంది', 'రుద్రమదేవి' వంటి భారీ చిత్రాలను అందించిన గుణశేఖర్, 'యూఫోరియా'కు ముందు 'శాకుంతలం' చిత్రానికి దర్శకత్వం వహించారు.

# హైదరాబాద్‌పై 'పెద్ది' యూనిట్ ఫోకస్




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, దర్శకుడు బుచ్చిబాబు సానా రూపొందించిన పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు సమయం దగ్గర పడుతుండటంతో ప్రచార కార్యక్రమాలను చిత్ర బృందం ఉధృతం చేసింది. ఈ నెల 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే ప్రమోషన్లలో భాగంగా నేడు హైదరాబాద్‌లో ఓ భారీ ప్రెస్ మీట్ నిర్వహించేందుకు చిత్ర యూనిట్ సిద్ధమైంది.

నిన్న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో లక్షలాది అభిమానుల మధ్య అట్టహాసంగా జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్, సినిమాపై ఉన్న హైప్‌ను మరింత పెంచింది. అదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ, చిత్ర బృందం ఈ రోజు మధ్యాహ్నం 3 గంటలకు బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మీడియా ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఈ కార్యక్రమానికి హీరో రామ్ చరణ్‌తో పాటు హీరోయిన్ జాన్వీ కపూర్, సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్, దర్శకుడు బుచ్చిబాబు సానా, కీలక పాత్రధారులు జగపతి బాబు, దివ్యేందు శర్మ, నిర్మాత వెంకట సతీష్ కిలారు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను, పాత్రల వివరాలను, చివరి నిమిషం అప్‌డేట్స్‌ను పంచుకోనున్నారు. విలేజ్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో రూపుదిద్దుకున్న 'పెద్ది' చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన ట్రైలర్, టీజర్లు, పాటలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా రామ్ చరణ్ సరికొత్త లుక్, బుచ్చిబాబు టేకింగ్, ఏఆర్ రెహమాన్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో ప్రమోషన్లు నిర్వహించిన చిత్ర బృందం, విడుదల ముందు హైదరాబాద్‌లో ఈ ప్రెస్ మీట్‌ను కీలకంగా భావిస్తోంది. మరోవైపు రేపు రాత్రి నుంచే ఓవర్సీస్‌తో పాటు ఏపీలోని కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రీమియర్ షోలు పడనున్నాయి. దీంతో సినిమా టాక్ ముందుగానే బయటకు వచ్చే అవకాశం ఉంది. భారీ అంచనాల మధ్య విడుదలవుతున్న ఈ చిత్రం, రామ్ చరణ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు.

# హీరో విజయ్‌తో రిలేషన్ రూమర్స్..

### పరోక్షంగా కౌంటర్ ఇచ్చిన నటి త్రిష!



నాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో నటి త్రిష రిలేషన్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలు కొన్ని రోజులుగా సినీ, రాజకీయ రంగాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా తన వ్యక్తిగత విషయాలపై వచ్చే రూమర్లపై స్పందించని త్రిష, తాజాగా సోషల్ మీడియా వేదికగా పరోక్షంగా స్పందించారు. తన పెంపుడు కుక్క ఫొటోను షేర్ చేస్తూ.. "నా వ్యక్తిగత విషయాల్లో తలదూర్చడానికి దీన్ని మాత్రమే అనుమతిస్తాను" అంటూ ఆసక్తికరమైన క్యాప్షన్ పెట్టారు. నేరుగా ఎవరి పేరు ప్రస్తావించకపోయినప్పటికీ, తనపై అసత్య ప్రచారాలు చేస్తున్న వారికి కౌంటర్‌గానే ఈ పోస్ట్ పెట్టారని అభిమానులు భావిస్తున్నారు.

మరోవైపు, మే నెల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ త్రిష చేసిన "మ్యాజికల్ మే" పోస్ట్ కూడా నెట్టింట వైరల్ అవుతోంది. ఈ ఏడాది మే నెలను తలచుకున్నప్పుడల్లా తన ముఖంపై చిరునవ్వు వస్తూనే ఉంటుందని ఆమె పేర్కొన్నారు. మే నెలలోనే త్రిష పుట్టినరోజు ఉండడం, అదే సమయంలో తన ఆప్తమిత్రుడు విజయ్ తమిళనాడు ఎన్నికల్లో ఘన విజయం సాధించి సీఎం కావడం విశేషం. దీనికి తోడు ఆమె నటించిన 'కరుప్పు' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ హిట్‌గా నిలిచి 348 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ వరుస విజయాల వల్లే ఆమె ఈ పోస్ట్ పెట్టారు.


Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com